
# వాస్తవము

టి. రాఘవయ్య



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# వాస్త్రవేము

(వ్యాస పంచకము)

రచయిత

టి. రాఘవయ్య

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

**VASTHAVAMU**

*by*
**T. Raghavaiah**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No : 634

First Edition 2004

Copies : 2000

*Published by*
**Sri Ajeya Kallam, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati – 517 501

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati — 517 507

# ముందుమాట

ఈ ప్రపంచంలో వేదభూమి అయిన భారతదేశం పవిత్రమైంది. ఆధ్యాత్మిక వాతావరణంతో నిండి ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రపంచదేశాలు నేటికి గౌరవిస్తున్నాయి. ప్రతి హైందవుడు తనమతం, దేశం యొుక్క ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి. ఈ ఉద్దేశంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం గ్రంథప్రచురణ పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది.

హిందుమతంలోని వైశిష్ట్యాన్ని సంగ్రహంగా, సులభంగా తెలియజేయాలనే ఉద్దేశంతో హైందవ ధార్మిక సాహిత్యాన్ని ప్రకటించడం జరుగుతోంది. అందులో భాగంగానే తిరువాయిపాటి రాఘవయ్య గారి వాస్తవము గ్రంథాన్ని ప్రచురిస్తున్నాం.

హిందూమతంలో నైతిక విలువలు, మానవీయ విలువల గురించి విస్తృతంగా చెప్పే ఈ గ్రంథంలో ఐదువ్యాసాలు సమకూర్చబడ్డాయి. రచయిత తిరువాయిపాటి రాఘవయ్య గారు తమ నిరూపణకు భగవద్గీత, ఉపనిషత్తుల నుండి, త్యాగరాజు ఇత్యాది భక్తి పంథానికి చెందిన వారి సాహిత్యాన్ని ఆధారం చేసుకొని తమ అభిప్రాయాలను విశ్లేసిస్తూ సత్యాని, వాస్తవాన్ని కనుగొన్నారు. అందువలననే ఇది వాస్తవం. దీనిని పాటించుము, ఎరుగుము అని పునరావృతం ప్రతివ్యాసంలోను కనబడుతుంది.

ఆయన కనుగొన్న సత్యాలు పాఠకలోకం సమాదరణకు పాత్రంలో కాగలదని భావిస్తున్నాను. ఎప్పటిలాగా ఈ పుస్తకం కూడ భక్తుల, చదువుల మన్ననలను పొందగలదని ఆశిస్తున్నాం.

కార్యనిర్వహణాధికారి
తి.తి. దేవస్థానములు, తిరుపతి.

# తొలిపలుకు

క్షీరము నుండి నవనీతమును సేకరించు తెరగున నేనార్జించిన గ్రంథస్థ విషయములనుండి అనుభవ, ఆలోచన, పరిశ్రమల ఫలితముగా నే గ్రహించగలిగిన వాస్తవమును యీ వ్యాస పంచకమున పొందుపరచితిని.

నిప్పునకు నుసి గప్పియున్నట్లు గ్రంథస్థ సత్యభావము లనేకములు మూఢవిశ్వాస పొరలయందు గుప్తముగా మరుగున పడియున్నవి. విసనకఱ్ఱతో నుసిని విసరివేసి నిర్మలాగ్నిని జూపుటయే నే జేసిన యీ ప్రయత్నము.

వాస్తవమను ఈ గ్రంథమును చదివి గ్రహింపవలసిదేగాని మీదు మిక్కిలి తొలిపలుకున వచించుట అనవసరమని భావించెదను.

వాస్తవము అను యీ రచనను వాస్తవము నెఱుగదలచిన పాఠకులకే అంకితమొనర్చుట యుక్తమని తలచి, యీ గ్రంథమును వాస్తవమునకే అంకితము - అని తెల్పుచున్నాను.

విషయగ్రాహ్యము ప్రధానముగా భావించుటచేత సాధ్యమైనంత వరకు సులభ భాషాశైలి పాటింప బడినది. శబ్ద సంధులు, లఘు శకట రేఫ భేదములును యీ రచన యందు పాటింపబడలేదు. సుహృద్భావమున వాస్తవమును పాఠకులు గ్రహింతురు గాక!

ఇట్లు
గ్రంథకర్త
**టి. రాఘవయ్య**

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | భక్తియోగము (కడపటి మాట) | 1 |
| 2. | హిందూమతము - దైవభక్తి - ప్రవర్తన (సనాతనము) | 19 |
| 3. | దైవము - దైవభక్తి - (త్యాగరాజోపనిషత్) | 28 |
| 4. | ఆత్మవిచారము | 38 |
| 5. | నైతిక మార్గము | 70 |

# 1. భక్తి యోగము

## (కడపటి మాట)

ఈ వాస్తవము నెఱుగుము.

పిన్నలయెడ చూపబడు ప్రేమను వాత్సల్యము, అనురాగము, కరుణ, సానుభూతి అని ఆయా సందర్భములయందు గ్రహింతుము. పెద్దలయెడ ప్రదర్శింపబడు ప్రేమను భక్తి అని యందుము.

భక్తి అనుపదము సంస్కృత భాషా పదజాలములోనెల్ల అతి యుత్కృష్ట శబ్దము. ఈ పదరత్నముచే సూచింపబడు సంస్కార భావము మానస తత్త్వమును, మానవునియందు విశ్వమానవ సౌభ్రాత్రమును, సర్వభూత దయా సానుభూతులను ప్రేరేపింపజేసి, వానిని ఉన్నత మానవునిగా రూపొందించి, లోకకల్యాణ కార్యాచరణునిగా తీర్చి, దిద్ది దైవసమునిగా జేయును.

దైవము అనగా భగవంతుడు. విశ్వములోని చరాచర సర్వము అను భావముగాన, అందు స్వార్థరహిత భావమున లీనమై యుండుటయే దైవ సముడుగా నుండు స్థితి. ఈ స్థితియందు భక్తుడు సర్వభూత సౌభ్రాత్ర ప్రేమభావమున, సృష్టి స్థితి లయ కారణ భూతమైన సర్వంతర్యామియైనట్టి అవాఙ్మానసగోచరమగు వైష్ణవశక్తికి (ఈశ్వరశక్తికి) ప్రపన్నుడై తన్మయ భావమున ఆనందించుచుండును. ఈ అనిర్వచనీయ ఆనంద స్థితియే మోక్ష భావము. స్వార్థరహిత భావమే శరణాగతి తత్త్వము. అదియే మోక్ష భావము.

వైష్ణవమైనట్టియు (సర్వవ్యాప్త మైనట్టియు) ఆది మధ్యాంత రహిత మైనట్టియు ఈ జీవశక్తి ఆయా భూతములకు ఆయా సమయముల యందు శివముగను, రౌద్రముగను, శాంతియుతముగను, ప్రళయముగను, ఆనందముగను, భయంకరముగను తోచుచుండును. నిర్మల భక్తునకు తన అద్వైత భావమునందు సర్వము సమముగ

కాన్పించును. అతడెల్లప్పుడును తన వైష్ణవభావమున శివముగను, శాంతముగను, ఆనందముగను ఉండును. అందువలన అన్ని జీవిత మార్గములలో అనగా అన్ని జీవితయోగములలో భక్తియోగము శ్రేష్ఠతమమైనది.

సృష్టి అనాది. మానవుడు ఆదినుండియు సృష్టి కారణమును, సృష్టి కర్తృత్వమును గూర్చి ఆలోచించుచునే యుండెను. మనోతత్త్వశాస్త్రము నెరుగని స్థితిలో పూర్వులు స్వప్న ప్రపంచమును గూర్చియు, మరణమును గూర్చియు, మతిభ్రమలను గూర్చియు అనవరతాన్వేషణముల జేయుచునే యుండిరి. మానవుడు క్రమక్రమముగా ప్రకృతి శక్తులకు భయపడి ఆ ప్రకృతి శక్తుల పూజింపదొడగెను. ప్రకృతిలోని ఉపయోగకరము లైనట్టియు, అవకారులగు నట్టియు, భయోత్పాతములయినట్టియు, ఆనందదాయకములైనట్టియు భూత విశేషములను ఆరాధింప ప్రారంభించెను.

తరువాత ప్రకృతి శక్తుల నారాధించుచుండిన మానవుడు ప్రకృతిలోని ప్రతి శక్తికిని, ప్రతి భూతమునకును, అధిదేవతలను ఊహించుకొని, బహు దేవతారాధనము చేయసాగెను. క్రమముగా ఈ దేవతలకు చిహ్నములను, ప్రతిబింబములను ఏర్పరచుకొని మానవుడు తన సాంకేతిక శిల్ప చిత్రలేఖనాభావసంపదలతో విగ్రహముల సృష్టించి, వానిని పూజార్థమై ప్రతిష్ఠించుకొనెను.

ఈ కార్యపరంపర ప్రపంచమున అన్ని భాగముల అన్ని జాతుల మతముల వారిచే ఏదో మార్పులతో జరుగుచునే యుండెను. ఇందు కనుగుణమైన సారస్వతము గూడా వృద్ధిజెందుచుండెను.

వేదకాలమునాడు మనదేశమున బహుదేవతాపూజలు, ప్రకృతిశక్తుల ఆరాధనలు, దేవతల ప్రీత్యర్థము యజ్ఞయాగాదులు, భూత గ్రహ పిశాచ శాంతి కార్యక్రమములు, జరుగుచుండినవి. మానవుని భావనాశక్తి అభివృద్ధి జెందుకొలది ఉపనిషత్కాలము నాటికి

ఋషులు భావించి నిర్ణయించిన దేమనగా ఏకేశ్వరోపాసన. ఈ యేకేశ్వరుని దేవదేవుడు, ఆదిమధ్యాంతరహితుడు, త్రిమూర్తుల కలితుడు, అవాఙ్మానసగోచరుడు అని భావించిరి. అవాఙ్మానస వైష్ణవ శక్తికి మానవ ఋషులు వారి భావనా కల్పనా శక్తితో మూర్తిత్వమును ఆపాదించుటలో భక్తిభావము నెలకొనినది. ఈ భక్తిభావము అనునది ఆ వైష్ణవశక్తికి శరణాగతిగా నుండుటయే.

సర్వంతర్యామియగు ఈశ్వరశక్తి శ్వేతాశ్వతరోపనిషత్తునందు (6-17, 18) ఇట్లు వర్ణింపబడినది.

"సతన్మయోహ్యమృత ఈశ సంస్థోజ్ఞః సర్వ గో భువన స్యాస్యగోప్తా ।
య ఈశే అన్య జగతో నిత్యమేవ నాన్యో హేతు ర్వి ద్యత ఈశనాయ ॥"

"యో బ్రహ్మణం విదధాతి పూర్వం, యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై ।
తం హ దేవం ఆత్మబుద్ధి ప్రకాశం, ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే॥"

"అతడు ఈ ప్రపంచమునకు అంతరాత్మ; అమృత స్వరూపుడు; ఈశ్వరుడు; సర్వజ్ఞుడు; సర్వవ్యాపి; లోకరక్షకుడు; శాశ్వత ప్రభువు; శాశ్వతుడు అగు అట్టి పరమాత్మకంటే జగన్నియామకుడు వేరొకడు లేడు." (అతడు - అనంత జీవశక్తి యొక్క మూర్తిత్వము).

"సృష్ట్యాదిని బ్రహ్మను ఎవ్వడు సృజించి వేదముల నొసగెనో, ఎవ్వని ప్రకాశము బుద్ధిని ఆత్మాభిముఖ మొనర్చునో ఆ దేవదేవుని మోక్షార్థినై శరణు బొందుచున్నాను."

పైన ఉదాహరింపబడిన ప్రథమ ఉపనిషద్వాక్య భావము : సర్వోపనిష త్సారమున భగవద్గీతలోని విభూతి యోగ సారాంశము. అందు వైష్ణవశక్తి యొక్క విభూతులన్నియు వర్ణింపబడి యున్నవి.

పై నుదాహరింపబడిన ద్వితీయ ఉపనిషద్వాక్య భావమే గీతా శాస్త్రమందలి భగవత్ శ్రీ రామానుజాచార్యుల వారిచే (విశిష్టాద్వైత సిద్ధాంత సంస్థాపకుడు) సూచింప బడిన చరమశ్లోకభావము.

"సర్వ ధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణాం వ్రజ ।
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మా శుచః ॥"

"అన్యములయిన సకలధర్మములను వదలి నన్నొక్కనినే శరణు బొందుము. నేనే నిన్ను సమస్త పాపములనుండి విముక్తుని జేయుదును. శోకింపకుము" అని భావము.

సర్వధర్మములకును ధర్మమైన ధర్మము - అనగా సకల ఉపాయములకు శ్రేష్టమయిన ఋజుమార్గము శరణగతి తత్త్వము. శరణాగతి తత్త్వమనగా స్వార్థ రాహిత్య భావము. స్వార్థరహితుడయిన వాడే వైష్ణవశక్తికి శరణాగతియై ప్రపన్నుడు కాగలడు. స్వార్థరాహిత్యమున నున్నవాడు చేయగల అపరాధములుండవు, పాపము లుండవు; కావున స్వార్థరాహిత్య భావమే మానవుని అన్ని విధములయిన పాపములనుండి తొలగించును. స్వార్థరహితుడు అరిషడ్వర్గమునకు, సప్త వ్యసనములకు దూరముగా నుండును. స్వార్థ రాహిత్యమే మోక్షమార్గము, మోక్ష స్థితి (స్వార్థ భావము బంధము). ఈ అత్యున్నత భావము గీతాచరమ శ్లోకమున నిమిడియున్నది. ఇదియే గీతార్థము. ఈ చరమ శ్లోకార్థమును ఇట్టిదిగా తెలిసికొని, తదనుగుణ జీవితమార్గమున ప్రవర్తింపనివాడు ప్రస్థాన త్రయమున (ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, భగవద్గీత) పండితు డయ్యును, అజ్ఞానియనియే చెప్పవలసియుండును. విశిష్ట సత్య జ్ఞాన సారము నెరుగని విద్యాశాస్త్ర పురాణ వేదపఠనము నిష్ప్రయోజనము. ఈ పాండిత్య పఠనా కౌశలము అజ్ఞనుల ముందు జేరి ఉపన్యసించుటకే పనికి వచ్చును.

శరణాగతి భావము (స్వార్థ రాహిత్య భావము) ఉపాయముగాను, మోక్షము (బంధ విముక్తి - ఆనంద స్థితి) అభయముగాను చెప్పబడిన భగవద్గీతా చరమ శ్లోకార్థమే శిల్ప సాంకేతిక రూపమున వ్యక్తము చేయబడుటకు కావింపబడిన ప్రయత్నము యొక్క ఫలితమే అర్చావతారము (శ్రీ వేంకటేశ్వర విగ్రహము) అయినది. విగ్రహము యొక్క వామ హస్తము శరణాగతి భావమును సూచించుచు

పాదములను చూపుచున్నది. దక్షిణహస్తము అభయ ప్రదానమును (మోక్షమును) చాటుచున్నది.

శరణాగతి భావము - మోక్షము అను ఉపాయ అభయములను దివ్య భావములను దెల్పుటకు శ్లోకము అనునది భాషా లిపి సాంకేతికమే గదా? అట్లనే అర్చావతారము (విగ్రహము) అదే భావములను ప్రదర్శించు శిల్ప సాంకేతిక మయినది. శ్లోకమును, ఈ విగ్రహమును సమానములే. శ్లోకార్థమును గమనించుటకు చదువుట, భాషాజ్ఞానములు అవసరములు; ఇవి కొందరికే ఉన్నవి. విగ్రహమును సర్వులు చూచి నేరుగా సులువుగా క్షణములో భావమును గ్రహింపగలరు ! విగ్రహమును 'రాయి' అనుకొన వద్దు; దానిని దేవుని ప్రతిబింబమని తలపరాదు. అదియొక సాంకేతికము.

శ్రీ వేంకటేశ్వర విగ్రహము ఆది మధ్యాంత రహితమును, అవ్యయమును అగు సర్వంతర్యామి వైష్ణవశక్తికి ప్రతిబింబము కాగలదా? కాని అట్టి శక్తిని గ్రహించిన భక్తాగ్రేసరునకు ఈ విగ్రహరాజము చరమ శ్లోకార్థమును వ్యక్తము జేయుచున్నది. నిజమైన భక్తుడు ఈ విగ్రహమును ఈ భావముననే చూచి, సేవించును. అన్యుల విధము వేరు. కావున ఈ విగ్రహము గీతకు సాటియై, చరమశ్లోకమునకు సాంకేతికమై గీతా ప్రబోధము చేయుచున్నది. ఈ శిల్పఖండము విగ్రహరూపమున నున్న గీతాచార్యుడు; జగద్గురువు.

చరమ శ్లోక భావము విభిన్న మతముల కతీతము. సర్వమత సారము; భువనైక జ్ఞానసంపద (ప్రవక్త జీసస్‌క్రైస్ట్ యొక్క ప్రబోధసారము పశ్చాత్తాపము - శరణాగతి - ఇస్లాం అనగా శరణాగతి యని భావము. శరణాగతి భావమును వెదజల్లు స్వార్థ రాహిత్య భావమే బౌద్ధమత సారము - సంఘ సౌభాగ్యము కొరకు మార్క్స్ మహాశయుడు సూచించిన సామ్యవాద తత్త్వమునకు మూలమైన గుణము స్వార్థరాహిత్య భావము).

చరమ శ్లోక దివ్యజ్ఞానమును బడయుటకే గీత యందలి అష్టాదశయోగ పఠనము ఆవశ్యకమై యున్నది. అష్టాదశయోగ పఠనము గావించియు చరమ శ్లోక ప్రాముఖ్యమును గమనింపజాలని పండితుని పాండిత్యము నిష్ప్రయోజనము. భారతరచన కాలమునుండి అనేక శతాబ్దముల కాలము భారతమును, అందు పొందుపరుపబడిన (బంగారు హారమున రత్నమువోలె) భగవద్గీతను పండితులు, ఋషులు చదువుచుండిరే గాని, పదునొకండవ శతాబ్దమున శ్రీరంగ పుణ్యక్షేత్రమున విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదకుడయిన మహామేధావి యామునాచార్యులవారు మొట్టమొదటిసారిగా చరమ శ్లోకమును గమనించినారు. ఇదియొక అవిష్కరణవంటిది. ఈ చరమ శ్లోక ప్రాధాన్యమును (తిరుమంత్రమును) ప్రప్రథమముగా యామాను చార్యులవారి ఆధ్యాత్మిక వారసుడు భగవద్రామానుజా చార్యులు, దయా సముద్రుడు, లోకమునకు ప్రకటించినారు. పండితుని వలె చరమ శ్లోకార్థమును, వ్యాఖ్యానమును గ్రహించి, తదనుగుణముగా స్వార్థ రాహిత్య జీవితమును గడపని పండితుడును పామరుడే. అనుభవ యోగ్యముగాని జ్ఞానము అడవిని గాచిన వెన్నెల యగును.

ఈ చరమశ్లోక జ్ఞానానుష్ఠానమే గీతలోని భక్తియోగమున తెలుపబడినది. అట్టి భక్తియోగస్థ భావ పరంపరను మనము గ్రహింపవలసియున్నది. భక్తుడు కర్మ యోగియో? కర్మ సన్యాసియా? - కార్యశూరుడా? సోమరియా? - భజనపరుడా? కార్యనిమగ్నుడా? అతని విధి నామోచ్చారణయా? లోక కల్యాణార్థ కార్యనిర్వహణయా? అతడు వాంఛించునది తన మోక్షమా? సంఘ మోక్షమా? నిర్మల సహృదయమున ఆలోచింపుడు.

విశ్వరూప ప్రదర్శనానంతరము గీతాచార్యుడు భక్తియోగమును నరున కిట్లు ప్రబోధించినాడు : (గీతాచార్యుడు అను పదము అనంత వైష్ణవశక్తికి బదులుగా ఉపయోగింపబడిన పదముగా భావింపదగి యున్నది. లేక ఈశ్వరశక్తితో సంశ్లేషపడిన అద్వైతి అయిన గురువుగా

భావింపవచ్చును. అర్జునుడు (నరుడు) ఇచట విధేయుడును, వివేకియును, గురునాజ్ఞను తు.చ. తప్పక పాటించువాడును అయిన శిష్యరత్నముగా చెప్పదగియున్నాడు).

ఇపుడు భక్తి యోగములోని కొన్ని శ్లోకముల యొక్క భావమును గమనింతురుగాక :

(12-2) "ఎవరు నాయందు మనస్సుంచి, నిత్యయుక్తులై పరమ శ్రద్ధతో నన్నుపాసింతురో వారే ఉత్తమయోగులని నా అభిప్రాయము".

(సర్వంతర్యామి యగు భగవచ్ఛక్తిని భగవంతుని సాకారమూర్తిగా, తన మూర్తికి సామ్యముగా భావించి భక్తుడు సంశ్లేషపడును. ఆ భగవన్మూర్తి సర్వమంగళ గుణమూర్తి. అట్టి సర్వోత్కృష్ట మంగళకర గుణముల దలచి, ఆ గుణగణముల గల్గిన పురుషోత్తముల ప్రశంసించి, ప్రేమించి, ఆరాధించుటయే భక్తి భావమని తలంపబడుచున్నది. అందువలననే ఉత్తమగుణప్రపూర్ణులగు పురుషోత్తములైన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు మనకు పూజనీయులయినారు. వారిని అరాధించుట అనగా వారి గుణరత్నములను మనము స్వీకరించి, ఫలప్రదమైన, ఆదర్శప్రాయమైన దివ్య జీవితములను గడపుట అని భావము. అంతియేగాని నామోచ్చారణగాదు).

(12-12) అభ్యాసము కంటె జ్ఞానము శ్రేష్ఠమైనది. జ్ఞానము కంటె ధ్యానము శ్రేష్ఠమైనది. ధ్యానమునకంటె కర్మఫల త్యాగము శ్రేష్ఠమైనది. అట్టి త్యాగము వలన శాంతి లభ్యమగును".

(మానవుడు ఎన్నియో అభ్యాసముల పాటించుచున్నాడు. కేవలము అభ్యాసముల పాటించుచుండి నంత మాత్రమున చాలదు. అట్టి అభ్యాసముల వలన సత్యమును - అనగా సృష్టి స్థితి లయముల గూర్చి విశిష్ట జ్ఞానమును పొందవలసియున్నది. కానిచో మానవుడు ఆలోచనా రహితుడై జంతుతుల్యుడుగా లెక్కింపబడును. కార్యకారణ జ్ఞానములేని అనంత అభ్యాసము పరంపరలు ఎందులకు? ఈ

విజ్ఞానవే వాన్తవికవాద మనబడును. వాన్తవము - అనగా సత్యము-నిత్యము. ఈ సత్యమయిన, యీ నిత్యమయిన విషయమేది అని గ్రహింప గలుగుటయే వాస్తవిక జ్ఞానము. వాస్తవిక జ్ఞానముచే మన మనములందు రగుల్కొనబడిన అద్భుత భావమే ఆధ్యాత్మిక జ్ఞానము. ఇట్టి జ్ఞానమును పొందినను జ్ఞాని యగువాడు అజ్ఞానమును గూర్చి పూర్వాపరముల సతతము ధ్యానింప వలసి యుండును. విషయజ్ఞానముగాని, వన్తు జ్ఞానముగాని, స్థితి జ్ఞానముగాని అనంతములు. దినదిన ప్రవర్ధమానములు అభివృద్ధి జెందుచున్న సృష్టియందు, ధ్యాన ఫలితముననే శాస్త్రజ్ఞుడు (సృష్టి పరిశీలకుడు - భౌతిక, జీవ శాస్త్రజ్ఞుడు) తన జ్ఞానము నాధారముగా జేసుకొని మానవాళి సుఖ జీవితము కొరకు నూతన ఆవిష్కారముల కనుగొని సాంఘిక అభివృద్ధికి దోహదకారి యగుచున్నాడు. నూతన మనో వికాన మార్గములను, నూతన ఆర్థికాభివృద్ధి మార్గములను సూచింప గలుగుతున్నాడు. ఈ విధముగా ధ్యానము శాస్త్రజ్ఞుని ఆవిష్కార కౌశలమునకు కారణభూతమై యున్నది. ఇట్టి ధ్యాన విశేషమే ఋషుల యొక్క తపస్సు అయినది. ఈ ధ్యాన తపస్సుల ఫలితముగా ఋషి అయినవాడు జీవిత సత్యాన్వేషణను సాగించుచు, మానవాళికి ఆధ్యాత్మిక జ్ఞాన వికాసమును కలుగజేయును. ఇట్టి ధ్యాన తపస్సుల ఫలితములే శ్రుతి స్మృతుల అవతరణము.

ఇట్టి సర్వోత్కృష్టమును, మానవ ప్రగతికి కారణభూతమును అయిన ధ్యానముకంటె కర్మఫల త్యాగము శ్రేష్ఠమయినది. కర్మఫల త్యాగము అనునదే కర్మయోగి యొక్క స్వార్థ రాహిత్య భావము. ఇట్టి కర్మఫల త్యాగము, ఇట్టి స్వార్థ రాహిత్య భావము ప్రపంచమునకు శాంతిని చేకూర్చును.

(3-25) శ్లో॥ సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యాద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షుర్లోక సఙ్గ్రహమ్ ॥

ఆ విద్వాంసుడు (అజ్ఞాని, మూఢుడు) స్వలాభము కొరకు కర్మలు చేయుచుండును. కాని జ్ఞానియయిన వాడు (విద్యావంతుడు) స్వార్థ రహితుడై లోక కల్యాణము కొరకు కార్యముల జేయును.

(ఈనాడు ఒక సంఘమున గాని, దేశమున గాని, ప్రపంచమున గాని యేం మూలనో, యేం అంశము నందుననో, అశాంతి ప్రబలుచుండగా, దానికి మూల కారణము వ్యక్తులయందు గాని, అధినేతలయందు గాని యున్న స్వార్థభావము; స్వార్థభావము పేరాశను, గర్వమును పెంపొందించును. ఇట్లు కర్మఫల త్యాగము యొక్క ఔన్నత్యమును గీత సూచించుచున్నది.)

అందువలన నిజమైన భక్తుని యొక్క తత్త్వమును గీతాచార్యుడిట్లు వర్ణించియున్నాడు :

(12 - 13, 14 శ్లో.)

"సకల భూతముల యందును ద్వేషము లేక, వానియెడ మైత్రియు, కారుణ్యమును గలవాడై, మమకార అహంకారములను వదలి, సుఖ దుఃఖములయందు సమచిత్తుడును, క్షమాశీలుడును అగుచు, నిత్య సంతుష్టుడును, నియతాత్ముడును, దృఢ నిశ్చయుడును, మనోబుద్ధులను నాయందు (సర్వంతర్యామి యగు ఈశ్వర శక్తియందు) అర్పించిన వాడెవడో వాడే నాయొక్క భక్తుడు; నాకు ప్రియుడు. (నాయొక్క భక్తుడనగా సర్వంతర్యామి శక్తిని గ్రహించి అద్వైత భావమున ఆనందమయుడయిన వాడు. నాకు ప్రియుడనగా సర్వులకు ప్రియుడు అని భావము).

(కావున భక్తుడు నామస్మరణ జేయుచు సంఘమునకు దూరముగా నుండి ముక్కు మూసుకొని తపస్సు అను దానిని జేయువాడా? అట్టి వానికి పైనుదాహరింపబడిన గుణము లెందులకు? సంఘమున జీవించుచు, సంఘమునకు సేవ జేయువానికే గదా యీ

గుణములు అవసరములు? ఇంకను భక్తుని గుణము లెట్లు వర్ణింపబడి యున్నదో గమనింపుడు).

12-15. ఎవ్వని వలన లోకము భయసంభ్రమములను జెందదో, యెవ్వడు తాను లోకము వలన అట్లే ఉద్వేగమును జెందడో, అట్టి హర్షామర్ష భయోద్వేగ రహితుడై పురుషుడు నాకు ప్రియుడు. (నాకు ప్రియుడనగా సర్వులకు ప్రియుడు అని భావము, భగవచ్ఛక్తి సర్వాత్మకము కాబట్టి).

12-16. ఫలాపేక్ష లేనివాడును, చిత్తశుద్ధి గలవాడును, సమర్థుడును, స్వవిషయములో ఉదాసీనుడును, దుఃఖమును అధిగమించువాడును సకల స్వార్థ ఆరంభములను పరిత్యజించిన వాడును అగు భక్తుడు నాకు ప్రియుడు.

12-17. ఎవ్వడు శుభాశుభముల రెంటిని గూడ ఒల్లకయుండి, హర్షింపకయు, ద్వేషింపకయు, శోకింపకయు, కాంక్షింపకయు నుండునో అట్టి భక్తిపరుడు నాకు ప్రియుడు.

12-18, 19. శత్రు మిత్రుల యందును, మానావ మానముల యందును, శీతోష్ణముల యందును, సుఖ దుఃఖముల యందును సమచిత్తుడై, ఎందును తగుల్పాటు లేనివాడై, నిందలను స్తోత్రములను తుల్యముగా దలంచుచు, మౌనము వహించి, దొరికిన దానిచే సంతుష్టు డగుచు, నిరాశ్రయుడై, స్థిరచిత్తమున నుండు మానవుడు నాకు ప్రియుడు.

12-20. శ్రద్ధాళువై యెవ్వడు నన్నొక్కనినే (సర్వంతర్యామి యగు శివరుద్ర వైష్ణవ శక్తిని) నమ్మి, ధర్మ విరుద్ధముగాని యీ నా ఉపదేశా మృతమును గ్రోలుచు నన్ను ఉపాసించునో అట్టి భక్తుడు నాకు (సర్వులకు) అత్యంత ప్రియుడు.

కావున గీతాచార్యుడు తన గీతాశాస్త్రమున భక్తియోగమున వెల్లడించిన సారాంశమేమనగా - మానవుడు కర్మయోగిగా నుండ వలయుననియు, అతడు కర్మఫల సన్న్యాసముతో, స్వార్థ రహితుడై,

లోక హితుడై లోక కల్యాణార్థము కృషిచేయుచు, భగవన్నామ సంకీర్తనము గావించుచు, (భగవన్నామములు సూచించు గుణ విశేషముల మననము చేసికొనుచు, తద్గుణములను తాను స్వీకరించి యుండుట) సర్వ పాప కార్యముల నుండి త్రికరణశుద్ధిగా విముక్తుడై, మోక్ష స్థితియందు (ఆత్మ జ్ఞానయుక్తుడై) పరమానందమున నుండవలయునని భావము. అంతియే గాని భక్తి యోగమును పాటించువాడు కర్మ సన్న్యాసియై, ఆచార యుక్తముగా కట్టు జుట్టు బొట్టులను పాటించుచు, కేవలము భగవన్నామోచ్చారణ గావించుచు ఉండుట కానేరదు; విశ్వ వ్యాప్తమయిన వాసుదేవ శక్తికి ఒక చిన్న చీకటి గుడిని నిర్మించుటయుగాదు. ఇవి యెన్ని యున్నను, లేకున్నను, సర్వభూతముల యందును (ఆత్మవత్ సర్వ భూతాని కాబట్టి) దయా సానుభూతులతో గూడిన కార్యాచరణుడై యుండుట, సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తి యెడ, సర్వభూతముల యెడ భక్తితో, ప్రేమతో, కార్యాచరణుడై యుండుట, జ్ఞాన భక్తి మార్గముల లోకహిత కార్యాచరణమే భక్తియోగము.

"వేగలేచి, నీట మునిగి - బూది బూసి - వ్రేళ్ల నెంచువారు - త్యాగ శీలురై - తెలియలేదు - రామభక్తి మార్గమును" - అని త్యాగరాజస్వామి గానము జేసినాడు. ఆచార యుక్తముగ నుండుట మాత్రముననే రామ భక్తి మార్గమును తెలిసికొన్నట్లు కాదు. "రాముడు" అనగా సర్వులను రంజింపజేయువాడు అని భావము. సర్వులకు ఆనందము నొనగూర్చు మార్గమే "రామభక్తి మార్గము" అనబడును; రామశబ్ద ఉచ్చారణ కాదు - రామ నామ కోటి రచనగాదు - రాముడుగా జీవించుటయే రామ భక్తి మార్గము - ఇది ఉత్కృష్ట కార్యాచరణ మార్గము. అంతేగాని దిగంబర, కౌపీనధారణ సన్న్యాశ్రమము, కాషాయ వర్ణ వస్త్రధారణ సన్న్యాసము భక్తిమార్గ మెట్లవును ?

శ్రీరాముడు కర్మ సన్న్యాసియా? శ్రీకృష్ణుడు కర్మ సన్న్యాసియా? కాదు. అయితే రామ భక్తులము, కృష్ణ భక్తులము అని చెప్పుకొనుట

వింతకాదా? శ్రీరాముడు తన ఆదర్శములను జూపుచు జీవించునాడు. శ్రీకృష్ణుడు సన్యాసిగాదు, అర్జునుని కర్మ సన్యాసికమ్మని బోధించలేదు. తన బోధనను ఎక్కడో అడవిలోనో మఠములోనో చెప్పలేదు. జీవిత యుద్ధ మధ్యమున శ్రీకృష్ణుడు అర్జుననకు గీతోపదేశము గావించినాడు గదా !

'నా మాదిరి నీవు జీవింపుము' అని చెప్పగలిగిన వాడే ఆచార్యుడు. శ్రీకృష్ణుడు, బుద్ధుడు, క్రైస్తు, మహమ్మదు కార్యాచరణమునే, విధ్యుక్త ధర్మమార్గమునే బోధించినారు; కర్మ సన్యాసమును కాదు. వేషముల ధరించి ఆచారముల పాటించుట కర్మ సన్యాసము కాదు.

ప్రహ్లాదుడు వచించిన విధమును పరిశీలింతము.

"తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు నాత్మలో నెరుకయున్ సంకీర్తనల్ చింతనం
బనున్ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా।

'సజ్జనుడై యుండుట' అనునది అసలు ప్రాధాన్య విషయము. సజ్జనుడనగా తోటి మానవులపై దయా సానుభూతులతో మెలగువాడు అని భావము. తాను జీవించుచు ఇతరుల సుఖ జీవితమును కోరుచు ఇతరులకెట్టి బాధాకరముగ నుండని వ్యక్తి సజ్జనుడు. భక్తుడనబడు వాడు సజ్జన జీవితమున విశిష్టుడై గుర్తింపబడవలసి యున్నది. సజ్జనుడై యుండుట నిష్కామ కర్మ యోగిత్వమే, కర్మఫల త్యాగమే.

"హరిన్ నమ్మి" అన్నపుడు సతతము "హరి-హరి-హరి" అని నామ భజన చేయుటగాదు. రాగయుక్తముగ తాళయుక్తముగ వేషధారులై రుద్రాక్ష మాలాధరులై భజన కీర్తనలు భజన బృందములతో జేరి గానము జేయుటగాదు.

'హరి' అనగా హరింపజేయువాడు అని భావము. మానవుడు అట్టి భావముతో తన చెడుగును హరింపజేసికొనుచు, సంఘములోని

లోపములను హరింపజేయుటకై కృతనిశ్చయుడుగా నుండుటకు ప్రయత్నించుటయే హరిస్మరణ చేయుట అని భావము. "నేను లోప రహితుడనై యుందునుగాక - నాలోపములను హరింపజేసికొనెదను గాక. తోటి మానవుల కష్టములను హరింపజేయుటకు శక్తికొలది ప్రయత్నించెదగాక - తోటి మానవుడు కలుష రహితుడుగా నుండవలయునని కాంక్షించెదనుగాక" - అను ఆలోచనా క్రమము, నిశ్చయము హరిస్మరణ అనబడును. అంతియేగాని హరి శబ్దోచ్చారణ కాదు; హరినామ భజన చాలదు; లోక క్షేమమునకు హరి నామ స్మరణ అవసరము.

అట్లే శివభక్తి పరాయణుడనగా "శివ-శివ-శివ" అని నామభజన గావింటుటగాదు. "శివము" అనగా శుభస్కరము. "శైవము" అనగా శుభమును కోరునది అని భావము. ప్రపంచము శివముగా నుండుగాక - క్షేమముగా నుండుగాక - సర్వులు ఆనంద సుఖములతో వర్థిల్లుదురు గాక" అను మంగళాశాసన పూర్వక భావమున నుండుటయే "శివభక్తి" అనబడును. ఇది నిజమైన భక్తుని మనోప్రవృత్తి - కార్య విధానము - ఆలోచనాక్రమము. నిజమైన కర్మఫలత్యాగియొక్క మనోతత్త్వము. "శివ-శివ - అనరాదా - భవభయ బాధల నణచుకోరాదా" అని త్యాగరాజు గానము జేసినాడు. "శివ శివ శివ అనరాదా - సర్వ క్షేమమును కోరుము. సర్వులను శివ శివ అని ఆశీర్వదింపుము. అట్టి స్థితిలో నీవున్న యెడల నీకు ఇతరుల నుండి భయములేదు - నీవు చేయగల భవము (పాపము) లేదు. నీకు ఎట్టి బంధములుండవు. మోక్షమార్గమున నుందువు" అని భావము. అంతియేగాని "శివ-శివ" అని నామభజన చేయుటగాదు. కావున హరి-శివ అని మంగళాశాసనము గావించు భక్తుడు, శివ శివ అని ఆశీర్వచనమును పలుకు భక్తుడు వాస్తవముగా స్వార్థరహిత లోకకల్యాణార్థ కార్యదీక్షాపరులుగ నుందురు.

హరి-శివ అనునవి వేరువేరు దేవతల పేర్లుగాను, అని నీ కోర్కెలు, నీ సత్సంకల్పములు. ఇట్టి సత్సంకల్పమే హరి-శివ అని పిలువబడును.

నీ మంచి మనస్సే హరి. నీ మంచి మనస్సే శివ. ఇట్టి సత్యమును గానక, ఇట్టి శివ-హరి భావ సామ్యతనుగానక, హరి భక్తులమనియు, శివ భక్తుల మనియు వేర్వేరుగా భావించి కలహించు భక్త నామ ధారులను, పండితమ్మన్యులను గూర్చి యేమని తలంపగలము? ఇదియే ప్రహ్లాదుడు సూచించిన - "కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి" అను సూత్రము.

భర్తృహరి సుభాషితమున నిట్లు తెలుపబడియున్నది.

చ॥ శిథిలత లేని భక్తి నతిసేయుదు వేల్పుల కాసుపర్వులున్
విధివశవర్తులా విధియు విశ్రుత కర్మఫల ప్రదాతన
య్యధిక ఫలంబు కర్మవశమట్లగుటన్ పనియేమి వారిచే
విధి కధికంబు కర్మమని వేమరు మ్రొక్కి భజంతు కర్మమున్॥

ఆదికాలమునుండి బహుకాలము బహుదేవతా ప్రార్థనము నుండి విజ్ఞానియగు మానవుడు ఏకేశ్వరోపాసనకు వచ్చినాడు. మానవుని నిమ్నోన్నతములు తన పూర్వకృత ఫలితములని నమ్మినవాడు దైవము కంటె తన కార్యాచరణమునందే యెక్కువ జాగరూకుడుగా నుండ వలయును కదా! భగవంతుని కర్మఫల ప్రదాత అని అంటున్నారు గావున- నిజమైన భక్తుని మార్గము లోకసంగ్రహము కొరకు కర్మఫల త్యాగమే యగును.

ఒక భక్త శిఖామణి యిట్లు వచించినాడు -

"కలువ ల్మల్లెలు మొల్లలంబుజము లున్గన్నేరులున్ తుమ్మిపూ
వులు చేమంతులు పారిజాతములు నిన్ పూజింపగాఁదగ్గపూ
వులటే నిర్మల ధర్మ పుష్పము దయాపుష్పంబు విజ్ఞానర
మ్యలతాంతంబును పూలుగాక-పరమేశా! దీనభక్తప్రియా".

పుష్పములు సజీవముగా సువర్ణ సువాసనలతో తేజోవంతముగా కొమ్మల రెమ్మల అంచుల నొయ్యారముగా కూర్చొని ఉయ్యల

లూగుచు, ఊర్ధ్వముఖులై సర్వంతర్యామి ఈశ్వరశక్తిని ఆరాధించుచున్న వనియే (ఆత్మార్పణము గావించుచున్న వనియే) ఊహింపదగి యున్నవి. ఇక యీ భక్త నామధేయుడు వానిని గిల్లి, కోసివైచి, నిర్జీవముల గావించి, సగము వాడిన, తరిగిన ఆ పుష్పములను ఏల విగ్రహములపై వేయవలయునో ఆలోచింపుడు. సర్వంతర్యామి యగు వైష్ణవ శక్తిని పూజించుటకు నానా విధములయిన యీ భౌతిక పుష్పములు చాలవు. స్వధర్మ నిర్వహణము అను పుష్పము, దయాగుణము అను పుష్పము, జ్ఞానము అను పుష్పము - అను నీ మానసిక పుష్పత్రయమే తగియున్నది !

కాబట్టి నిజమైన భక్తుని మార్గమేమనగా దయా జ్ఞాన యుక్తముగా స్వార్థరహితముగా లోకసంగ్రహముకొరకు స్వధర్మము నాచరించుట అని తెలియుచున్నది. భక్తుడు భక్తి (ప్రేమ) మార్గమున కార్యాచరణుడై కర్మఫల త్యాగి యగుచున్నాడు.

ఇట్టి విజ్ఞానకర మైనట్టియు, ప్రభావితము లైనట్టియు మార్గములను జ్ఞానభక్తి ప్రపూర్ణులైన భక్తశిరోమణులు, సంస్కర్తలు, ఆచార్యులు సూచించుచున్నను, మూఢాచార పరాయణులయిన భక్తులనబడు వారు మూఢాచారములనే పాటించుచున్నారు గదా ! కాని దీనికి మించిన విచారకరమైన మరియొక అవాంఛనీయ దుస్థితి యేమనగా స్వాభావికముగా అనేక కారణములవలన అజ్ఞానులుగా నున్న ప్రజలను మూఢమార్గములకు ద్రిప్పు పరివ్రాజక భృవుల అధునాతన మార్గ ధోరణులు గల ఉపన్యాసకుల, భజనపరుల, మఠాధిపతుల సంఖ్య అధికమగుచునే యున్నది. "కానని వాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి" అను తార్కాణము మఱల జ్ఞప్తికి తెచ్చుచున్నాను.

ఇందుండి విముక్తి యెప్పుడు? మానవుడు తాను స్వయముగా ఆలోచించుకొన్నప్పుడే !

చిత్, అచిత్, ఈశ్వర అను తత్త్వత్రయములో సర్వంతర్యామి యగు ఈశ్వరశక్తి అనంతకల్యాణగుణప్రపూర్ణ మనియు, అందువలన భగవన్మూర్తి త్రిభువన సుందరమనియు, సత్య సౌందర్య సుగుణమూర్తి అనియు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్తయగు భగవద్రామానుజాచార్యులు వచించియున్నారు. ఈ సత్య, సౌందర్య, సుగుణ రాశియైన పురుషోత్తమునే దైవాంశముగా భక్తుడు భావించుకొనును. సగుణాకారునిగా - శ్రీరాముని శ్రీకృష్ణుని పూజించుటకు ఇదే కారణము.

మాయావాదమును రామానుజుడు అంగీకరించలేదు; ఏ దేవతకు పూజ జరిపినను, ప్రార్థించినను, అవి సర్వేశ్వరునే జేరును. సర్వంతర్యామి యగు అద్వైత ఈశ్వర శక్తినే ఉపాసించమని ఆచార్యుల ఆదేశము - షణ్మతస్థాపనలకు, బహుదేవతారాధనములకు వాస్తవముగా శాస్త్రీయముగా తావెక్కడిది ?

తత్త్వత్రయము నెరిగిన వాడే నిజమైన జ్ఞాని, నిజమైన భక్తుడు. చరాచర లక్షణములే తత్త్వత్రయ జ్ఞానము. చిత్, అచిత్, ఈశ్వర అను యీ మూడు తత్త్వములు అనాదులే. అచిత్ అనగా జడపదార్థము (ఘన ద్రవ వాయు పదార్థములతో కలిసి). చిత్ అనగా జీవరాసులు, వృక్షములతో సహా. ఈశ్వర అనునది ఈరెంటి యందును గల అనిర్వచనీయమగు సర్వతర్యామి యగు శక్తి. ఇదియే అద్వైత భావము యొక్క విశిష్టాద్వైతము. ఈ తత్త్వత్రయమును పరిశీలించి, సత్యమును గ్రహించుటయే నిజమైన శాస్త్ర జ్ఞానము. ఇదియే సత్యాన్వేషణము. సూత్రప్రాయముగా యీ సత్యా న్వేషణము పూర్తియయినను, అభివృద్ధి జెందు ప్రకృతియందు యీ సత్యా న్వేషణము అనంతము. అందు మాయావాదమునకు తావులేదు. మన కగపడు జడ పదార్థములన్నియు సత్యములే. మన కగపడు జీవరాసులు సత్యములే, వాని స్థితులు రూపములు మారుచుండును. ఆయా స్థితి రూపములు తాత్కాలికముగా సత్యములే. స్థితి మార్పును సత్యమే. వీనియందుగల

ఈశ్వర శక్తియు సత్యమే. ఈ శక్తి చరాచరములందు వ్యాపించి యున్నందున నిది అద్వైత శక్తి. ఈ శక్తి ప్రతిదానియందును విశిష్టముగా కన్పట్టు చున్నది. ప్రత జడపదార్థమును ఈ శక్తి వలన విశిష్టముగా కన్పడుచున్నది. ఈ అద్వైత శక్తి యొక్క విశిష్టత యిట్టిది. ఈ తత్త్వత్రయ విచారణయే, అన్వేషణయే - నిరంతర శాస్త్ర పరిశోధనము. ఈ శాస్త్ర పరిశోధనము నిరంతరము జరుగుచుండ వలసినదే. దీనికి అంతము లేదు. ప్రకృతి-పురుష (తత్త్వత్రయము)ను అన్వేషించుటయే శాస్త్ర జ్ఞాని, భ'క్తుని మార్గములు.

శాస్త్రజ్ఞుడు సత్యమును అన్వేషించును, కనుగొనును. కార్యాచరణ జరుపును, అసత్యమును లోక కల్యాణార్థము ఉపయోగించును. భక్తుడన్నచో సత్యమును తెలిసికొనుచు, తత్త్వత్రయముల గమనించి అద్భుతపడుచు, సంశ్లేష భావమున ఆనందించుచు, అనంత జ్ఞాన సంపదకు ప్రపన్నుడగును.

తత్త్వత్రయ జ్ఞానమును బడసిన విజ్ఞానియు, దయాసముద్రుడును అయిన భక్తుడు విశిష్టాద్వైతియై, మూఢత్వమునకు దూరముగా నుండి, అద్వైత భావమున సర్వభూతములయెడ సానుభూతిపరుడై, వైష్ణవ సహస్రనామ సూచక గుణ విశేషముల నెరిగినవాడై, తాను వైష్ణవాంశముగా భావించుకొని, దక్షుడై, లోకకల్యాణార్థము చింతించుచు, విధ్యుక్త ధర్మమును నెరవేర్చుకొనుచుండును.

ఈ భక్తిభావము లోకమునకు గీతాచార్యునినుండి, నేడు మన ముందున్న ఆచార్యుని వరకుగల ఆచార్య, ప్రవక్త, సంఘ సంస్కర్తలచే అనవరతము వ్యక్తము చేయబడుచునే యున్నది. అందువలన మనము ఆచార్యపరంపరకు సతతము కృతజ్ఞులము. వారు వారి బోధన ప్రకాశముచే ఎల్లప్పుడు లోకమును ప్రభావితము జేయుచున్నారు. వారు మృత జీవులు.

**శ్లో॥ లక్ష్మీనాథ సమారంభం నాథ యామున మధ్యమామ్**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**

(ఈ శ్లోకము శ్రీమద్రామానుజాచార్యుల యొక్క ప్రథమ శిష్యరత్నము కూరత్తాళ్వార్ (కూరేశుడు)చే చెప్పబడినది.

భక్తియోగమును గూర్చి కడపటి మాటగా చెప్పబడిన యీ విషయము వాస్తవము - మతాతీతము - ఈ వాస్తవమును తెలిసికొనుడు - ఈ వాస్తవమును పాటింపుడు.

❄

# 2. హిందూమతము-
# దైవభక్తి-ప్రవర్తన (i)
## (సనాతనము)
## 1

ఈ వాస్తవము నెఱుగుము.

చరిత్రకును ఊహకును అందని కాలమునకు అనాదియని పేరు. చరిత్రకు అందకు ఊహకు కొలదిగాఅందినకాలమును పౌరాణిక మందుము. సర్వాధారములకు అనుగుణముగా నున్న కాల విషయము లను చారిత్రకమందుము.

అనాధి, పౌరాణిక కాలములనుండి వచ్చిన సంస్కృతిని సనాతన మందుము.

మానవాభ్యుదయమునకు ఈ మూడు కాలములకు సంబంధించిన విషయ జ్ఞాన మవసరమే. కాని వానిలో నిగూఢముగా నున్న సత్యమును తెలిసికొన్న వాడు విజ్ఞాని. అట్టి విజ్ఞానమును సంఘ సౌఖ్యశాంతులకు ఆపాదింపగలిగిన వాడు జ్ఞాని. ఇట్టి జ్ఞానముతో తాను సంతోషముగా నుండగలిగి, యితరుల సంతోషమునకు దోహదము జేయువాడు భక్తుడు. ఈ భక్తి భావమును మిగుల ప్రచారము జేసి జయప్రదుడయిన వాడు ప్రవక్త, ఆచార్యుడు. ఆచార్యుని ఆదేశములను పాటించు వాడు శిష్యుడు, సామాన్య ప్రజా సముదాయమున మెరుగైన వాడితడు. ఇది ఆధ్యాత్మిక నైతిక సామ్రాజ్యములోని స్థితి పరంపర.

హిందూ మతమును సనాతనమని యందుము. హిందూ మతమనగా నేమి ? దీనిని స్థాపించిన వాడెవడు? బోధించిన వాడెవడు?

హిందూమత మనునది మన దేశమున ప్రభవించిన ఆది మానవుని నుండి ఆచార ఆలోచనపరముగా నెలకొనుచు వృద్ధి జెందుచు ఈ నాటికిని ఉన్నందున దీనిని అనాది అందుము. ఇందు పాత క్రొత్తలు మిళితమై యున్నవి, వస్త్రములోని పేక పడుగుల వలె. ఇది అశ్వత్థ వృక్షము వంటిది. విస్తరించిన వ్రేళ్లు కనబడకుండా భూమిలో నున్నవి. పైన మహాకాండము, శాఖోపశాఖలు, పత్ర పుష్ప ఫలములున్నవి. శాఖోపశాఖలనుండి అసంఖ్యాకములైన ఊడలు (ఆకాశ వ్రేళ్లు) క్రిందికి దిగి భూమిని ప్రవేశించి వ్రేళ్లతో చేతులు గలిపి సఖ్యత నేర్పరచుకొను చున్నవి. ఇప్పుడీ వృక్షమునకు స్థిరత్వము నిచ్చునవి వ్రేళ్లా, ఊడలా ?

హిందూ మతమును 'ఇది' అని ప్రత్యేకముగా నిర్వచింప జాలము. ప్రపంచములోని అన్య మతముల వలె హిందూమతము ఏదో ఒక ప్రవక్త, యేదో ఒక మహానుభావునిచే బోధింప బడినది కాదు. ఉన్నట్లుండి ఒక పిడుగు మాదిరి పడ్డది కాదిది; ఒక విప్లవముగా తలయెత్తినది గాదిది. ఇది యొక దీర్ఘకాల ప్రశాంత పరిణామము. ఎండకు, వానకు, గాలికి తట్టుకొని హిమాలయమువలె నెలకొని యున్నదిది. ఇది యొక సాంఘిక, నైతిక, ఆధ్యాత్మిక సుదీర్ఘ చరిత్ర. వ్యక్తి, సాంఘిక ఆచారములతో మొదలిడి, నైతిక సూత్రముల నేర్పరచుకొని, ఆధ్యాత్మిక పరిశీలనాన్వేషణముల తోటి వృద్ధిజెందిన భారత మానవ చరిత్రావృక్షమిది. అగణిత వసంతముల బొంది, పుష్పించి, ఫలముల నొసంగు మహారసాల వృక్షరాజమిది. ఇది యొక మహాసముద్రము వంటిది. ఎండాకాలమున, వర్షాకాలమున మట్టములో మార్పు లేనట్టియు, ఎన్ని నదులు చేరినను తన మట్టములో మార్పు నొందని మహాసముద్రము వంటిది హిందూమతము. మానవ నాగరకత, సంస్కారముల నడక అనదగిన యీ హిందూమతము మధ్యలో ఎన్ని చేర్పులు, మార్పులు, లోట్లు, విప్లవములు వచ్చినను, అది అట్లనే భగవానుని వలె నిలిచియున్నది.

సర్వమును తనలోనికి స్వీకరించుకొని తన వ్యక్తిత్వ విశిష్టతను, తన సంపూర్ణతను నిలబెట్టుకొని యున్నది.

హిందూదేశమున మానవజాతి మొదలై యిప్పటి కెంతో కాల మయినప్పటికిని, హిందూమతమును ఈనాటికిని యిట్టిది అని నిర్వచించుటకు వీలులేకున్నది. హిందూ దేశమనబడు భౌగోళిక భాగమున నివసించు ప్రజలు అనేక జాతులవారు, అనేక భాషలవారు, వివిధ ఆచారములను పాటించువారు, వివిధవిధముల మానవాతీతమగు దైవశక్తిని వివిధ విధముల నారాధించువారు ఇప్పటికిని ఉన్నారు. వీరందరి సంస్కృతుల సమ్మేళనా రూపమును హిందూమత మనవలసినదే. ఈ సంస్కృతులు పరస్పర సామ్యములను కలిగియున్నవి. పరస్పర భేదములను గలిగియున్నవి. ఈ సామ్యతలు, ఈ భేదములు గలిగి యుండియు హిందూదేశ ప్రాంత ప్రజలందరు ఈ మత సమ్మేళనమే వారి మతమని భావింతురు.

హిందూమతము ఆది రచనలగు వేదములతో ముడిబడి యున్నట్లు ముఖ్యముగా ఉత్తరాదివారు భావింతురు. ఆర్యుల గ్రంథములు వేదములు; ఆర్యులు వచ్చి స్థిరనివాసము నేర్పరచుకొని వ్యాపించిన ప్రాంతమంతయు, వింధ్యపర్వతములకు ఉత్తరమున నున్న దేశ మంతయు, ఆర్యావర్తమని పిలువబడినది. కావున ఈ ఉత్తర దేశ ప్రజల మతము ఆర్యమతము, వైదిక మతము అని పిలుపబడినది.

ఆర్యుల నాగరకతాప్రభావమున దక్షిణాదివారిలో అధిక సంఖ్యాకులు వారి మతము వైదికమతమని భావింతురు. అందువలన హిందూమతమును ఒక విధముగా వైదికమతమందురు. కాని వేదకాలమునకు పూర్వమున్న ఆచారములు సైతము ఈనాటికిని కొన్ని తెగలలో నున్నవి. ఈనాటికిని వైదికమత వాసనలు లేని కొన్ని కొండ జాతులున్నవి. వీరందరును హిందువులే. పర్వతము అన్నపుడు

అందులోని రాయి పర్వత భాగమే; అందులోని యిసుక రేణువులు కూడా పర్వతాంశమే కదా !

హిందూమత సంస్కారమునకు వేదములు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, భారత రామాయణములు, భాగవతాది పురాణములు మూలములుగా నున్నవి. కాని వీనియందు పరస్పర విభేదభావము లుండుటంజేసి హిందూమతము ఇట్టిదని నిర్వచింపబడుట సులభము గాదు. చాలవరకు ఈ విభేదములను చూపెట్టుచు, ఏకత్వమును సూచించు సమన్వయ మత సారస్వతము "భగవద్గీత" అని చెప్పవలసి యున్నది.

"సర్వశాస్త్రమయీ గీతా
సర్వవేద మయో హరిః"
"ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతం" అని గీతా పీఠిక.

''సకల ముపనిషద్వాక్య సంపూజ్య మంత్రం'' - అని కులశేఖరాళ్వారు ముకుందమాల ప్రబంధమున శ్రీకృష్ణభగవాను డొసంగిన గీతార్థ తిరుమంత్రమును గూర్చి అన్నాడు.

## 2

ఇట్టి హిందూమత ప్రామాణిక మైనట్టియు, సర్వోపనిషత్సార మైనట్టియు, యోగశాస్త్రమైన భగవద్గీత దైవమును గూర్చి యేమి చెప్పుచున్నది? దైవశక్తి అవాఙ్మానస గోచరమని తెల్పుచున్నది. ఇక అట్టి దైవశక్తిని గూర్చి నిర్ణయించి, భాషించు అధికారము ఎవరికున్నది? అట్టి అవాఙ్మానస గోచరమైనట్టియు, సర్వవ్యాప్తమైనట్టియు, ఆ వైష్ణవశక్తికి శరణాగతి యగుట తప్ప, దానిని గూర్చి తర్కించుట ఎవరికి సాధ్యపడును? తర్కింపబూనుట నిర్వచింపబూనుట వృథా ప్రలాపమే యగును.

దైవశక్తి విశ్వాత్మకము గావున, వాసుదేవముగాన, అట్టి శక్తిని యే మానవుడు ఊహించుకొనగలడు? ఇక అది పంచేంద్రియములకు

వలను పడదుకదా? కావున భగవచ్ఛక్తి యొక్క విశ్వరూపమును మానవుడు చూడజాలడు; ఊహించుకొన జాలడు.

ఈ విషయము భగవద్గీతయందే సోదాహరణముగా అనుభవ పూర్వకముగా వర్ణింపబడి యున్నది.

శ్రీకృష్ణభగవానుడు అర్జునునకు విశ్వరూపమును ప్రసాదించి నపుడు, అర్జునుడు దానిని జూచి భయపడెను. ఏ విశ్వరూపమును అప్పటికి ముందెన్నడును ఎవరును చూచి యెరుగరో అట్టి విశ్వరూపమును జూచి, అర్జునుడు ఆనందించలేకపోయెను; విభ్రాంతుడాయెను; దానిని చూచుటకు అతనికి నయనములు చాలలేదు. గ్రహించుటకు మనస్సు చాలలేదు :

శ్లో॥ నాహం వేదైర్న తపసా । నదానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం । ద్రష్టవానసి మాం యథా ॥ 11-53

శ్లో॥ భక్త్యా త్వనన్యయా శక్య । అహమేవంవిధోఽర్జునా ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన । ప్రవేష్టుం చ పరంతప ॥ 11-54

"ఓ అర్జునా, ఇప్పుడు నన్నెట్టి వానినిగా చూచితివో, అట్లు వేదాధ్యయన తపోదాన యజ్ఞములచేత గూడ అన్యులచేత నేను చూడ శక్యమైనవాడను గాను. అట్టి ఆకారముగల నేను భక్తిచేతనే చూడను, తెలిసికొనను, ప్రవేశింపను శక్యమైన వాడను". అని శ్రీకృష్ణపరమాత్మ సెలవిచ్చి యున్నాడు.

అందువలననే విశ్వరూపమును జూచి, భయపడి అర్జునుడు ఇట్లు పలికి యుండెను :

శ్లో॥ అదృష్టపూర్వం హృషితోస్మి దృష్ట్వా ।
భయేన చ ప్రవ్యథితం మనోమే ।
తదేవమే దర్శయ దేవరూపం ।
ప్రసీద దేవేశ జగన్నివాస ॥

"కృష్ణా, నీయీ విశ్వరూపమును జూచి, నా శరీరము గగుర్పాటు చెందుచున్నది. భయముచే మనస్సు బాధపడుచున్నది. ఓ జగన్నివాసా! క్షమింపుము. నీ పూర్వ రూపమును జూపుము. నీ మనోహరమైన దివ్య సౌందర్య రూపమును జూపుము".

కాబట్టి భగవచ్ఛక్తి విశ్వరూపము. దానిని మానవుడు తన పంచేంద్రియములతో, జ్ఞానేంద్రియములతో, గ్రహింపజాలడు. దానిని సత్య సౌందర్య సుగుణరాశిగానే ఊహించుకొనగలడు. ఇచ్చటనే సూక్ష్మముగా విశిష్టాద్వైత సిద్ధాంతము అద్వైత సిద్ధాంతమును మెరుగు పరచుచున్నది. ఈ సిద్ధాంతములు రెండును పరస్పర విరోధములు గావు! విశిష్టాద్వైతము భక్తిమార్గమున చేతనుని ఉద్రేకపరచి, మానసికముగా ఆనందమయుని జేసి తృప్తిపరచును.

అనంతము సర్వవ్యాపి, అయిన ఈశ్వరశక్తిని చేతనుడు గ్రహింపలేక పోగా, సత్య సౌందర్య సుగుణ రాశియగు భగవచ్ఛక్తిని గూడ మానవుడు విరాట్ రూపమున విశ్వరూపమున ఊహించుకొనజాలడు. (మానవు డన్నపుడు సామాన్య మానవుడని భావము - జ్ఞానులు, భక్తులు వేరు). కావున సత్య సౌందర్య సుగుణమూర్తి యగు పురుషోత్తముడైన మానవుడే భగవత్సమానుడు. ఇట్టివాడు లోకకల్యాణకరుడు; ఆదర్శప్రాయుడు; లోకశాంతికి తోడ్పడువాడు. అందువలన పురుషోత్తములుగా సారస్వతమున తీర్చిదిద్దబడిన మహావ్యక్తులు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సత్య సౌందర్య సుగుణమూర్తులై, త్రిభువన సుందరులుగా విలసిల్లిరిగాన, వీరి దివ్యమంగళ రూప కీర్తులు స్మరించి, ఆరాధించుటయే ఉత్తమోత్తమ మయిన దివ్యజ్ఞాన మార్గము అని ఆళ్వారులు విశదముగా తేల్చి చెప్పియున్నారు. ఆళ్వారులు స్వార్థరహితులై శరణాగతులై ప్రపత్తి మార్గమున విష్ణుసంశ్లేషభావమున పరమానందమున నుండువారు. ఆళ్వారుల దివ్యవైభవమునుబట్టియే శ్రీమద్రామానుజాచార్యులు విశ్వరూపమును త్రిభువన సుందరముగా దెల్పి, పురుషోత్తముడు

సత్య సౌందర్య సుగుణరాశియని నిర్వచించి యున్నారు. ఈ భక్తిమార్గమే యీనాడు ప్రపంచమంతయు నిండుయున్నది. కావున ఇట్టి సర్వ వ్యాప్తమయిన విష్ణువు యొక్క అంశమునకు శరణాగతియై, తాను అఖిల భూత ప్రియుడుగా నుండగలుగుటయే దైవభక్తి.

## 3

దైవభక్తు డెట్టివాడు? దైవభక్తుని ప్రవర్తన యెట్టిది? అను విషయముల గూర్చి గీతాచార్యుడు భక్తియోగమున .విపులముగా నిర్వచించి యున్నాడు. (శ్లోక భావములనే వ్రాయుచున్నాను - సులభముగా విషయమును గ్రహింపగలందులకు).

'సకల భూతముల యందును ద్వేషము లేక వానియెడ మైత్రియు కారుణ్యమును గలవాడై, మమకార అహంకారములను వదలి, సుఖదుఃఖములయందు సమచిత్తుడును, క్షమాశీలుడును, నిత్యసంతుష్టుడును, మనోబుద్ధులు నాయందు అర్పించినవాడును ఎవడో, అట్టివాడు నాకు ప్రియమైన భక్తుడు.

ఎవ్వనివలన లోకము భయపడవలసిన అవసరము లేదో, ఎవ్వడు భయరహితుడో, అట్టి హర్షామర్ష భయోద్వేగ శూన్యుడయిన పురుషుడు నాకు ప్రియమయిన భక్తుడు.

ఫలాపేక్ష లేనివాడును, చిత్తశుద్ధి గలవాడును, సమర్థుడును, స్వవిషయములో ఉదాసీనుడును, దుఃఖమును అధిగమించిన వాడును, సకల స్వార్థ ఆరంభములను పరిత్యజించిన వాడును అగునట్టి నా భక్తుడు నాకు ప్రియుడు.

ఎవ్వడు శుభాశుభముల రెంటిని కూడా నొల్లడో, హర్షద్వేష శోక కాంక్షారహితుడో వాడే నా ప్రియభక్తుడు.

శత్రుమిత్రుల యందు, మానావమానముల యందు, శీతోష్ణముల యందు సుఖదుఃఖముల యందు, సమచిత్తుడై యెందును తగులము లేనివాడు నాకు ప్రియుడు.

నిందలను, స్తోత్రములను, తుల్యముగా తలంచుచు, సంతుష్టుడై,నిరాశ్రయుడై (ఒక నిర్ణీతమయిన ఆశ్రమమును కోరనివాడై) స్థిరచిత్తమున వ్యవహరించువాడు నా భక్తుడు.

పై విధముగా గీతాచార్యుడు భక్తునియొక్క లక్షణములను, భక్తి యొక్క తత్త్వమును, విపులముగా వర్ణించియున్నాడు. తేటతెల్లముగా నున్న యీ భక్తి భావమును భక్తుడనబడు వాడు అనుసరింపదగి యున్నది. ఈ భక్తి భావములేక, యిట్టి ప్రవర్తన లేని, భక్తుడు బిరుదమును తనకై తాను వహించుకొన్నవాడు భక్తుడు కానేరడు. కట్టు, జుట్టు, బొట్టు, వేషములు గలిగి మూఢాచారముల మెలగుచు, స్వయ మారోపిత భక్తనామ బిరుదాంకితుడు భక్తుడు కానేరడు. విశ్వమును, విశ్వశక్తిని (విశ్వమూర్తిని) నమ్మి శరణాగతుడైనవాడు భక్తుడు. ఇతడు దేశ, భాష, కుల, మతములకు అతీతుడు. విశ్వపేరుడతడు. ఇట్టివాడు అరుదుగా నగపడును. ఇట్టి నిజమయిన భక్తులు యే కొలదిగనో ప్రపంచమున అన్ని భాగముల నుందురు. అట్టి వారే జగత్కల్యాణమునకు కారణభూతులు.

ఇట్టి నిజమైన భక్తి భావమును గీతాచార్యుడు సెలవిచ్చిన విధమున పరమభక్త శిరోమణులు ప్రహ్లాదుడు, విభీషణుడు, భీష్ముడును భక్తి ప్రపత్తి మార్గములను వెల్లడించియున్నారు.

విశిష్టాద్వైతసిద్ధాంత ప్రవక్త, యతిరాజ శ్రీరామానుజుడు తిరు మంత్రమునుప్రపంచమునకు బహిర్గతము చేయుచు ఇట్లు చెప్పి యున్నాడు : "చిత్, అచిత్, ఈశ్వర అను యీ తత్త్వత్రయమును శాస్త్ర రీత్యా గ్రహింపుడు. ఈశ్వరశక్తి త్రిభువనసుందరము; సత్య సౌందర్య సుగుణాత్మకము. ఎవ్వడు భగవచ్ఛక్తి సర్వవ్యాపితమని భాసించునో వానిని వైష్ణవుడని పిలుతును. అట్టివాడు సమభావము గలిగి యుండి సర్వులను ప్రేమించి, సేవించును. అట్టి వైష్ణవుడు గీతా చరమ శ్లోక భావమున (తిరుమంత్ర భావమున) వైష్ణవ శక్తికి

శరణాగతియై, స్వార్థరహితుడై జీవించును గాన పాపములకు దూరముగా నుండి మోక్షభావమున పరమానంద భరితుడై విలసిల్లును".

ఇది హిందూమతము, దైవము, దైవభక్తుని ప్రవర్తనమును గూర్చిన వాస్తవము; ఈ వాస్తవమును తెలిసికొనుము; ఈ వాస్తవమును పాటింపుము.

# 3. దైవము - దైవభక్తి (ii)

## (త్యాగరాజోపనిషత్)

ఈ వాస్తవము నెఱుగుము.

హిందూమతము - దైవము - భక్తి - ప్రవర్తన అను పూర్వపు శీర్షిక క్రింద మతము యొక్క ఉద్దేశము మానవుని సంస్కరించుట అనియు, దైవశక్తి సర్వవ్యాపితమైనట్టియు, అవాఙ్మానసగోచర మైనట్టిదనియు, దైవభక్తి అనగా సర్వ వ్యాప్తమయిన వైష్ణవశక్తికి శరణాగతి యగుట అనియు, అట్టి భక్తికి అనుగుణమయిన ప్రవర్తన యనగా మానవుడు స్వార్థరహితుడై లోకకల్యాణార్థము కర్మఫల త్యాగిగానుండుట అనియు గమనించి యున్నాము.

పై విషయములకు సర్వోపనిషత్సారమైన భగవద్గీతయే ప్రమాణమని గూడా తెలిసికొనియున్నాము. ఈ విషయముల గూర్చి త్యాగరాజస్వామి కీర్తనలు ఏమని వక్కాణించుచున్నవో యిపుడు గమనింతము గాక !

హిందూమతమను పేర, హిందూమత సంస్కరణోద్యమము అనుపేర, అసంఖ్యాకములయిన భిన్నమతములు ఆదినుండి నేటివరకు ఉద్భవించుచునే యున్నవి. సమన్వయమును ఆలోచనాపరుడే పొందగలడు. అన్ని మతము లొకటేనని చెప్పుచు, అన్నిటిని వేరువేరుగా వర్ణించువారు తయారైనారు. ఏ దేవుని ప్రార్థించినను, ఆ ప్రార్థనలు ఒకే దేవునికి అందునని చెప్పువారు కొందరు - వీరందరు మానవులను సంస్కరింప జాలనివారు.

ఉండేది ఒకే దైవశక్తి అయినపుడు 'ఏ దేవునికి మ్రొక్కినను' అను విషయమునకు అర్థమున్నదా ! సర్వతర్యామి యగు వైష్ణవశక్తియే సృష్టించునది (బ్రహ్మశక్తి), శుభమును చేకూర్చునది (శివశక్తి),

వినాశనము చేకూర్చునది (రుద్రశక్తి) యగుచున్నది కదా ! అందువలన ఒకే దైవశక్తి అనబడునది "బ్రహ్మ శివ రుద్ర వైష్ణవం" అనదగియున్నది.

మొక్కులను, ప్రార్థనలను, ముడుపులను పాటించు మానవునకు దైవభీతి యున్నట్లు తోచుచునదేగాని, దైవభక్తి కనబడుటలేదు. దైవభక్తి అనగా స్వార్థ రహిత జీవితమున విశ్వశక్తికి శరణాగతి యగుట - అను విషయము అమలులో నున్నట్లు కన్పడదు. దైవశక్తిని యిట్టిదని చెప్పలేని బడుగు గురువులు వారి వారి అజ్ఞానమునకు దోచిన విధమున ఆచారముల నేర్పరచుటచేత కొంత ఆలోచనాపరులగు వివేకవంతులు దిగ్భ్రమ జెందవలసియున్నది. అంతా ఆధ్యాత్మికమే! అంతా సనాతనమే! అంతా అనుసరణీయమే! అంధులకు - మూఢాచారపరాయణులకు, "అదికాదు"-"ఇది" అను చెప్పే ధోరణి గీతకు పూర్వము హిందూ మతమున నున్నట్లులేదు. అందువలన గీతయే ప్రమాణమయినది.

ఆధ్యాత్మికము యోగ శాస్త్రము.ఈ యోగశాస్త్రము (1) ఆత్మజ్ఞాన యోగశాస్త్రము, (2) కర్మయోగ శాస్త్రము అని రెండు విధములు. దైవము, జీవము అను విషయాన్వేషణ యొకటి; ప్రవర్తన అనునది రెండవది. ఈ యోగశాస్త్రముల విషయమై తర్కించి, తరించిన శ్రీ త్యాగరాజస్వామి (గాయక బ్రహ్మ) సూక్ష్మముగా సులువుగా వాస్తవము నిట్లు దెల్పి యున్నారు.

భగవచ్ఛక్తి అవాఙ్మానసగోచరము; సర్వవ్యాపితము; దానిని గూర్చి తర్కింపనేల? - శరణాగతి యగుట తప్ప? కాని పనికి కష్టము మెండు అన్నట్లు! అవాఙ్మానసగోచర మన్నపుడు ఇక చూచునదేమున్నది? చెప్పునదేమున్నది? ఆలోచించి యూహించునదేమున్నది?

ఈ క్రింది కీర్తనలోని భావమును గమనింపుడు :

"మరుగేలరా ? - ఓ రాఘవా !
మరుగేల ? - చరాచర రూప !
పరాత్పరసూర్య సుధాకరలోచనా ! ॥మ॥

అన్ని నీవనుచు, అంతరంగమున,
తిన్నగాను వెదకి, తెలిసి కొంటినయ్యా !
నిన్నెగాక మదిని, నమ్మజాల నొరుల;
నన్ను బ్రోవుమయ్య - త్యాగరాజనుత ॥మ॥

'చరాచరము సర్వము కలిసి దైవము అయినది. ఈ సత్యమును గమనించితిని. ఇక యితరమును నమ్మజాలను. ఈ వైష్ణవశక్తికి శరణాగతు డనగుచున్నాను' - అని భావము.

కావున దైవశక్తి అనగా చిత్, అచిత్, మయమయిన సర్వతర్యామి యగు ఈశ్వరశక్తి యని తెలినది. ఇదియే తత్త్వత్రయ జ్ఞానము.

ఈ సర్వాంతర్యామి యగు ఈశ్వరశక్తిని ఆదినుండియు, వేదకాలము నుండియు, రకరకములుగా మానవుడు భావింపదొడగెను. పరస్పర భేదములను జూపు ప్రస్థానత్రయము కూడా మానవులను వివిధ మార్గములకు తరుముచుండినవి. 'కానని వాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి' అనునది యెల్లకాలము లందును సత్య వచనమే.

కాని, యేది నిజము? ఎవరు చెప్పినది నిజము ? భగవచ్ఛక్తి నెలవును ఎవరు నిర్ణయించి చెప్పగలరు? సర్వంతర్యామి అన్న పదమే సరియైన మాట అగునుకదా ! భిన్నాభిప్రాయములు దెల్పువారికి తెలిసిన విషయమా యిది? కాదు. అది అగోచరముగదా ? ఏమని చూచి నిర్ణయింపనగును? అను ప్రశ్నలతోనే, శరణాగతి తత్త్వముననే, త్యాగరాజస్వామి యీ తర్కమును వదలి వేయును. ఎండమావును బట్టి వెంబడించదు వివేకి.

సర్వంతర్యామియగు ఈశ్వరశక్తిని ఒక్కమూర్తిలో నున్నట్లు భావించుట యెట్లు? అని త్యాగయ్య ఈ క్రింది కీర్తనయందు గానము చేయుచున్నాడు.

"ఏ తావునరా నిలకడనీకు ? -
ఎంచి చూడ నగపడవు !
సీతాగౌరీ వాగీశ్వరులను
స్త్రీ రూపములందా? గోవిందా ! ॥ఏ॥
భూ, కమలార్క, అనిల నభములందా ?
లోక కోటులందా ?
శ్రీకరులగు త్యాగరాజ నుతుతా
శివమాధవ బ్రహ్మాదులయందా ?" ॥ఏ॥

"పురాణములందు దైవశక్తి భూదేవి యనియు, పార్వతి యనియు, సరస్వతి యనియు చెప్పియున్నారు - పంచ భూతములందు దైవశక్తి యున్నదని మరి కొందరందురు - జగత్తునందుగల జీవరాసులయందు నిండి యున్నది భగవచ్ఛక్తి అని మరికొందరందురు. ఇంకను కొందరు భగవంతుడనగా బ్రహ్మదేవుడనియు విష్ణుమూర్తి అనియు, శివుడనియు అనుచున్నారు. ఒక్క వైష్ణవశక్తికి ఈ భిన్న నామధేయము లెందులకు? అని త్యాగరాజు ప్రశ్నించి యున్నారు. త్యాగరాజు యీ విభిన్నతత్త్వముల నంగీకరింపక అన్నియు "నీవే" అని కీర్తించుచున్నాడు. అన్ని భిన్న నామ ధేయములు ఒక్కటైన ఈశ్వరశక్తికి సంబంధించిన గుణవిశేషణములు; అంతియేగాని విభిన్న దైవశక్తులుగాదు.

మరియొక కీర్తనయందు భగవచ్ఛక్తి అనగా నిది అని నిర్ణయించుటకు వీలువడదు అని త్యాగరాజస్వామి ఇట్లని అనుచున్నారు.

ఎవరని నిర్ణయించేదిరా
నిన్నెట్లుల నుతియించేదిహా, నరవర ॥ఎ॥
శివుడవో, మాధవుడవో, పరబ్రహ్మావో ॥ఎ॥
శివమంత్రమునకు మ జీవము
మాధవ మంత్రమునకు రా జీవము

ఈ వివరణ దెలిసిన ఘనులకు మ్రొక్కెద
వితరణగుణ శ్రీ త్యాగరాజనుత ॥ఎ॥

"భగవచ్ఛక్తిని యిట్టిదని నిర్ణయింపలేము, నిర్వచింప జాలము, కీర్తింప జాలము. ఏలనన అది అవాఙ్మానసగోచరము కదా !

త్రిమూర్తులని చెప్పబడిన ముప్వురలో, అనగా బ్రహ్మ, విష్ణువు, శివుడు అను ముప్వురిలో నీవెవరవని నేను నిర్ణయించి చెప్పగలను?" అని త్యాగరాజు వితర్కించుకొనును.

ఈ వితర్కము అనవసరము; ఈ అన్వేషణ అనవసరము; సజ్జనుడుగా జీవించుటయే మానవునకు పరమావధి - అని త్యాగరాజు మాట.

పంచాక్షరీ మంత్రము శ్రేష్ఠమయినదని కొందరు తలంచి, దానిని జపము జేయుచున్నారు. అష్టాక్షరీ మంత్రము గొప్పదని కొందరు భావింతురు.

"ఓం నమో నారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రమందు 'రా' అను అక్షరము బీజాక్షరము. "నమశ్శివాయ" అను పంచాక్షరీ మంత్రమందు 'మ' బీజాక్షరము, (బీజాక్షరమనగానేమో తెలిసికొనుము - ఒక పదమున ఏ యక్షరమును తీసినచో వ్యతిరేకార్థము, విషమార్థము వచ్చునో అట్టి అక్షరమును బీజాక్షరమని యందురు. నమశ్శివాయ అనగా నమః+శివాయ. శివాయ=శుభమగు శక్తికి, నమః=నమస్కరించు చున్నాను అని భావము. నమశ్శివాయ - అను మంత్రమున మ అను అక్షరమును తీసివేసిన మిగిలినది యేమగును? "నశ్శివాయ" అవును - శుభస్కరము కాదు అని భావము. "భగవచ్ఛక్తి శుభస్కరమయినది; దానికి నేను ప్రణమిల్లెదను" అను దివ్యమంత్ర భావము పోయి "నశ్శివాయ" = శుభస్కరముకాదు - అనగా భగవచ్ఛక్తి శుభమైనదికాదు అని వ్యతిరేకార్థము, విషమార్థము వచ్చుచున్నది. అందువలన "నమశ్శివాయ" అను పంచాక్షరీ మంత్రమున 'మ' అనునది

బీజాక్షరము - ప్రాణాక్షరము. ఇట్లే "ఓం నమోనారాయణాయ" అను మంత్రమున "నారాయణాయ" అను పదము అతి ముఖ్యమయినది. నారాయణ - నార+ఆయణ=నీటిని ఆవరించినది (భగవచ్ఛక్తి) అని భావము. నీటియావిరి విశ్వమంతయు వ్యాపించియే యున్నది. అందువలన "నారాయణాయ" అన్నప్పుడు విశ్వవ్యాప్తమయిన శక్తి అని భావము వచ్చును. ఇందు 'రా' అను అక్షరమును తీసివేసిన యేమగును? "నాయణాయ" అగును. న + ఆయణ అన్నప్పుడు "వ్యాపించినదికాదు" అని అర్థము వచ్చును. అనగా భగవచ్ఛక్తి సర్వవ్యాప్త మయినదికాదు అను వ్యతిరేకార్థము, విషమార్థము వచ్చుచున్నది. అందువలన "ఓం నమోనారాయణాయ" అను అష్టాక్షరీ మంత్రమునందు 'రా' అనునది బీజాక్షరము - అతి ముఖ్యమయిన ప్రాణాక్షరము.

పై రెండు అష్టాక్షరీ, పంచాక్షరీ మంత్రముల యొక్క బీజాక్షరము లయిన రా, మ, అను రెండు అక్షరములను కలిపిన నేమగును? 'రామ' అను పదము వచ్చును. ఈ విషయమును తెలిసికొన్నవాడే వితరణ జ్ఞానముగల భక్తుడగును. లేనియెడల మూఢ భక్తుడగును. ఇచట 'రామ' అన్నపుడు రామ, రామ, అని కేవలము జపించుట కాదు. 'రామ' కోటిని వ్రాయుట కాదు. రామాలయమును నిర్మించుట గాదు. రామాయణ గ్రంథ పఠనము పారాయణము గాదు.

'రామ' శబ్దము సాంకేతికమగు జీవితమును గడపుట-అని భావము. 'రామః' అనగా సంతోషపెట్టువాడు, రంజింపజేయువాడు - అని భావము. సర్వులను సంతోషపెట్టు విధమున జీవించువాడు 'రామః'. కావున మానవుడు రాముడుగా నుండవలయును - అని భావము. కావున సత్ప్రవర్తనమే ప్రధానమయినదనియు, మానవుడు సర్వులను ప్రేమించి, లోకకల్యాణార్థము పాటుబడుటయే మోక్షమార్గమని త్యాగరాజస్వామి సూచించుచున్నాడు.

స్వార్థరాహిత్యభావమున పరోపకారనిరతి అన్నది అన్ని మంత్రములను జపించి, తపస్సు జేయుటకంటే గొప్పది - అని త్యాగరాజ స్వామి బోధ.

"రామ" అన్నప్పుడు సత్య, సౌందర్య, సద్గుణమూర్తి అని భావము. ఇక్కడనే నిరుణ వైష్ణవశక్తి కన్న, సగుణుడైన పురుషోత్తముడగు భువన సుందరమూర్తి ఆరాధ్యుడు - అని శ్రీరామానుజాచార్యుల వారనును. ఇదియే విశిష్టాద్వైతసిద్ధాంత ఆరాధనక్రమము. ఈ విషయమును తెలిసికొన్నవారే, అనగా శరణాగతి తత్త్వమున సజ్జనుడుగా జీవించుటయే శ్రేష్ఠమని తెలిసికొన్నవాడే వితరణగుణ జ్ఞాని. అన్యులు పండితులయ్యును అజ్ఞానులే; చీకటి యందు మసలుచుండు వారే.

అందువలననే త్యాగరాజస్వామి - సజ్జనత్వము శ్రేష్ఠమయినది, అదియే భక్తిమార్గము, అని తలచి, భువనసుందరుడైన పురుషోత్తముడు శ్రీరాముని కీర్తించుచున్నాడు. అనగా శ్రీరాముని యొక్క సుగుణముల వంటి సుగుణములను మానవుడు అవలంబించి జీవింపవలయును అని భావము.

శ్రీరాముని గుణముల వెల్లడిజేయు ఈ త్యాగరాజ కీర్తనను గమనింపుడు :

**సుజన జీవనా - రామా -**
**సుగుణ భూషణా - ॥రామ॥**
**భుజగభూషణా -**
**ఆశ్రిత జనావనా -**
**అజవందిత**
**ధృతచందన**
**దశతురంగమా ॥రామ సుజన జీవనా॥**
**చారునేత్ర -**
**శ్రీ కళత్ర -**
**శ్రీరమ్య గాత్రా -**

తారకనామ -
సుచరిత్రా -
దశరథపుత్రా -
తారకాధిపా -
ఘనధర్మ పాలనా -
తారయ రఘువర నిర్మల
త్యాగరాజ సన్నుత ॥రామ సుజన జీవనా॥

భావమును గమనింపుడు :

సుజనత్వము, సుగుణత్వము, శాంత స్వభావము, కరుణా మయుత్వము-సానుభూతి, ప్రశంసనీయత్వము, పరిశుభ్రత, బలము-దక్షత, సత్య పరిశీలనాశక్తి, ఐశ్వర్య సంపత్తి, తియ్యని పలుకు, తరింపజేయు 'రామ' అను నామధేయము, సుచరిత్రము, ఉన్నతవంశము, తరింపజేయు శక్తి, స్వధర్మ నిరతి, నిర్మలత్వము, కర్మఫల త్యాగము మొదలగునవి పురుషోత్తముడయిన శ్రీరాముని దివ్యమంగళ గుణ రత్నములు.

అట్టి పురుషోత్తముని స్మరించుట అనగా ఆ దివ్య గుణముల నలవరచుకొని వానివలె జీవితమును గడపుట అని భావము. అంతియేగాని రామభక్తుడు, కృష్ణభక్తుడు సన్యాసిగా నుండవలయునని గాదు. ఆ పురుషోత్తములు కార్యశూరులు, కర్మనిరతులు, కర్మఫల త్యాగులు. కర్మ సన్యాసమునకు, ఘోర తపస్సులకు, కఠిన జీవిత మార్గములకు తావేలేదు - నిజమైన భక్తునకు. కర్మఫల త్యాగమున ఆనందమయుడుగా నుంటయే భక్తుని మార్గము.

'త్యాగరాజనుత' అనుటలోనే ఈశ్వరశక్తి యొక్క ఔన్నత్యము, ప్రబోధము వెల్లడి యగుచున్నది. ఈశ్వరశక్తి త్యాగరాజుచే నుతింపబడు చున్నది - అన్నపుడు - ఈశ్వరశక్తిని నిజముగా నుతింపదగిన వాడు త్యాగియే అని భావము - త్యాగి అనగా కర్మ ఫల త్యాగి అని భావము.

ఈ నాల్గు కీర్తనలలో నాల్గు వేదముల సారమిమిడి యున్నది. గీతార్థము వెల్లడి యగుచున్నది. భాష్యకారుడగు శ్రీరామానుజాచార్యుల వారి దివ్యజ్ఞానము, దివ్య సందేశము, దివ్యాజ్ఞ యిమిడియున్నవి. ఈ నాల్గు గీర్తానల సంపుటిని "త్యాగరాజోపనిషత్" అని నేను అందును.

కావున త్యాగరాజోపనిషత్ జ్ఞానామృతమును సింహావలోకనమును జేసిన, మనము పొందు భావసారమేద్ది ?

'భగవచ్ఛక్తి అవాఙ్మానస గోచరము; దాని తత్త్వము మనకు తెలిసినది గాదు; మానవు లారాధించు పలు దేవతలలో ఫలాని దేవత భగవచ్ఛక్తిని సూచించునని మనము నిర్ణయింపజాలము; అది పంచ భూతములతో గూడిన విశ్వశక్తి అని అన్నపుడు అవాఙ్మానస గోచరమే యగుచున్నది.

అష్టాక్షరీ, పంచాక్షరీ, ఏకాక్షరీ మంత్రముల జపములకంటె సుజనత్వము (రామగుణము) శ్రేష్ఠమయినది. సుగుణరాశి యగు పురుషోత్తముడే భగవంతుడు. అట్టి పురుషోత్తము ననుసరించి ఆ సుగుణ సంపదను మనము అలవరచుకొన వలయుననెడి దివ్య సందేశమును త్యాగరాజస్వామి యివ్వగలడు. ఇదియే యతిరాజ శ్రీరామానుజు డొనగిన దివ్య సందేశము. కావున అవాఙ్మానస గోచరమయిన దివ్య వైష్ణవశక్తిని మనము అన్వేషింప జాలము. భువన సుందరులును, సత్యసౌందర్యసుగుణ వంతులును అగు రామ, కృష్ణులవంటి పురుషోత్తముల ననుసరించుచు, శరణాగతితత్త్వమున, స్వార్థరాహిత్యభావమున, కర్మఫలత్యాగమున సజ్జనుడుగా మానవుడు జీవితమును గడుపవలయుననెడు బోధయే - హిందూమతము, భగవచ్ఛక్తి, ప్రవర్తన అని మనకు సుబోధకమగుచున్నది.

కావున 'హిందూమతము - దైవశక్తి, దైవభక్తి, ప్రవర్తన' - అను అంశము తేటతెల్లముగా భాగవతోత్తములు తెల్పియున్నను, కొందరు వక్తలు, కుపండితులు, అజ్ఞానులు (మూఢాచార పరాయణులు) ఈ

విషయమును క్లిష్టము చేయుచున్నారు. ఋజుమార్గమున ముండ్లు చల్లు చున్నారు. వీనినుండి తప్పించుకొనుటకు వితరణగుణము అను పాదరక్షలలో నడువ వలయును.

సత్ప్రవర్తమే సుమతము; అదియే భక్తి మార్గము (ప్రేమ మార్గము). సత్ప్రవర్తన లేని వానికి మతములేదు; భక్తిలేదు; నత్యము లేదు, ధ్యేయము లేదు; జీవిత ఫలములేదు.

ఇది వాస్తవము; ఈ వాస్తవమును తెలిసికొనుము; ఈ వాస్తవమును పాటింపుము.

# 4. ఆత్మ విచారము

ఈ వాస్తవము నెఱుగుము.

ఆత్మ విచారము అన్నపుడు రెండు భావములు స్ఫురించుచున్నవి. 'ఆత్మ' అని చెప్పబడు దానిని గూర్చి (జీవాత్మ, పరమాత్మ) విచారించుటయా? లేక తనకు సంబంధించిన విషయములను గూర్చి తాను ఆలోచించుటయా ?

ఆత్మ విచారము అన్నపుడు ఆత్మను గూర్చిన విచారమని భావించి నపుడు అది ఆత్మను నిర్వచించుట అనిగాదు. ఆత్మ అనిర్వచనీయమని భగవద్గీతలో చెప్పబడియున్నది కదా !

'ఆత్మ'ను గూర్చి వేదములు, బ్రహ్మ సూత్రములు, ఉపనిషత్తులు, పురాణములు, గీత మొదలగు వానియందు తెల్పబడి యున్నను, ఆ తెల్పబడిన భావములన్నియు సంపూర్ణముగా ఏకీభవించ కుండా నుండడమో, కొన్ని యెడల పరస్పర విరుద్ధముగా నుండడమో మనము గమనింతుము.

ప్రపంచమున వివిధమతముల వారున్నారు; వారికి వారివారి పవిత్ర మతగ్రంథములున్నవి; మత సంబంధముగా వారి పవిత్ర గ్రంథములు వేరువేరుగా నున్నను, ఆత్మ విచారమును భిన్న మార్గముల బట్టించనను, ఆత్మను భిన్నవిధముల నిర్వచించినను, మానవ జాతి యొకటేకదా ? మానవులు గాని, యితర యే ప్రాణిగాని, పుట్టుచున్నది; జీవించుచున్నది; మరణించుచున్నది. పుట్టిన ప్రతి యొక్క ప్రాణి మరణించుట నిశ్చయము; కాని జీవిత కాలపరిమితి అనిర్ణయము.

"ఆత్మవత్సర్వ భూతాని" అని యనుటలో సర్వభూతములకు ఆత్మ యొకటున్నదనియు, ఆ యాత్మ లన్నియు పరమాత్మ యనబడు దానియొక్క అంశములేననియు, కొందరి విశ్వాసము.

ప్రాణులన్నియు ప్రాణ వాయువును పీల్చుకొనుచున్నవి; ప్రాణ వాయువు లేక యే ప్రాణియు జీవింపజాలదు; కాని యీ సర్వ ప్రాణులలో నుండు యీ ప్రాణ వాయువు విశ్వము నావరించి యున్న ప్రాణవాయువుయొక్క అంశమే. అట్లే ఆత్మ అనునది ప్రాణప్రద మయిన శక్తి అయిన యెడల, ఇది సర్వంతర్యామి యగునట్టియు, అనిర్వచనీయ మైనట్టియు, ఈశ్వరశక్తియొక్క అంశమే అయి యుండవలయును గదా! అట్టి యెడ భిన్న జీవులలో నున్న దానిని జీవాత్మ అన్నపుడు విశ్వ వ్యాపితమయిన ఈశ్వర శక్తిని పరమాత్మ అని అనవలయునేమో !

సర్వాంతర్యామియు, అగణితమును, అవాఙ్మానస గోచరమును, ఆది మధ్యాంత రహితమును అయిన పరమాత్మను ఈశ్వర శక్తి అనుట శాస్త్రీయముగానే కన్పడును. సారస్వతమున నీ శక్తిని అలంకార యుక్తముగా వర్ణించిన ఫలితముగా భగవంతుడు, దేవుడు, విశ్వేశ్వరుడు, విష్ణువు, పరబ్రహ్మ అను పదములు వచ్చినవి. ఇది మూర్తి వాచకములు. ఈశ్వర శక్తికి మూర్తిమత్త్వమును ఆపాదించి నపుడు జరిగిన సారస్వతముయొక్క మలుపు మానవుని ఆలోచన యొక్క ప్రతిబింబమే యగును.

ఇట్టితరి భగవంతుడను మూర్తి యొకడున్నాడనియు, వానిని ప్రార్థించిన యెడల కోర్కె లీడేరుననియు, పుణ్యపాపములను మరణానంతరము భగవంతుడు పరిశీలించి, వాని కనుగుణమయిన జన్మను మరల జీవికి భగవంతుడు ప్రసాదించుననియు, మరియు నరకలోక బాధలనియు, స్వర్గలోక సుఖములనియు, ఇహలోక సుఖ దుఃఖములకు భగవదనుగ్రహము కారణమనియు - ఇట్లు బహు భంగుల ఆయా మతముల యందు ఆయా భాషలలో చెప్పబడి యున్నవి.

ప్రాణి ప్రారంభము ఎన్ని లక్షల సంవత్సరములో యెవ రెరుగుదురు? ఆదిమానవుడు ఉద్భవించి యెంతకాలమైనదో

యెవరెరుగుదురు? సృష్టిని అనాది అన్నారు గదా! ఇట్టి ఆదిమానవుడు యెన్ని సంవత్సరముల కాలములో నాగరకుడగుచు వచ్చినాడో, (నాగరకుడనుటలో యిచట బుద్ధికుశలత యనియే భావింపదగి యున్నది). లిపిని యెన్ని వేల సంవత్సరముల క్రింద సృష్టించుకొన్నాడో, అట్టి లిపి భాషగా పరిణమించి, గొప్ప రచనారూపమును (గొప్ప రచనా రూపమనగా ఛందోబద్ధమై, నవరస భరితమై, అలంకార యుక్తమయిన రచన అని గ్రహింపవలెను.) ఎప్పుడు పొందినదో, అట్టి రచనల ద్వారా బహిర్గతములయిన భావములు మానవ జాతియందు ఎంతకాలమునుండి యున్నదో యెవరూహింప గలరు? కావున ప్రపంచమున నున్న మానవజాతులకు సంబంధించిన మత ప్రామాణిక గ్రంథములకు పూర్వము మానవమనోవృత్తుల పరివక్వదశల చరిత్రములు ఎంత దీర్ఘములో యెవరికెరుక ?

మొత్తము మీద ఈ వివిధ మతములయొక్క ప్రథమ రచనల లోనే, మత గ్రంథములలోనే, జీవాత్మ, పరమాత్మ, ప్రాణులు, దేవుడు, సృష్టి, సృష్టికర్త అను పదములు ప్రవేశ పెట్టబడినవి.

మన దేశమున వేదవ్యాసుని కాలమునే సక్రమముగా నిర్ణయించ లేకున్నారు. ఆయనకు ముందు ఎంత కాలము క్రిందట వేదము లనబడు ప్రథమ రచనలు పూర్ణరూపమును దాల్చినవో యెవరెరు గుదురు? ప్రస్థాన త్రయమునకు (ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, భగవద్గీత) పురాణములకు కర్త అయిన వేదవ్యాసుడు "ఆత్మవత్సర్వ భూతాని", "తత్త్వమసి", "ఏకమేవాద్వితీయం" అను అధ్యాత్మిక సూత్రములను ప్రస్థాన త్రయమున అచ్చటచ్చట జూపి, పరమాత్మ జీవాత్మల యేకత్వమును, సామ్యమును, భిన్నత్వమును వర్ణించి యున్నారు. ఇట్టి వేదవ్యాసుని కాలముననో, లేక వేదవ్యాసునకు తరువాత కొంత కాలముననో చార్వాకుడు అను బిరుదాంకితుడు ఆత్మ అనునది ప్రత్యేకముగా లేదనియు, అది ప్రత్యేకముగా వెలుపలనుండి గర్భస్థమయిన పిండమును ప్రవేశించి, పిండమును

ప్రాణిగా మార్చు చున్నదని చెప్పుట సత్యము కాదనియు, పంచ భూతాత్మకమయిన పిండము అభివృద్ధి జెందుచుండగా అందుండియే ఆత్మ ఉత్పన్నమగు చున్నదనియు చార్వాకమను మతము పేరిట వక్కాణించి యున్నాడు. ఈ వాదము యథార్థ వాదమయి మార్క్సిజం సిద్ధాంతమునకు సామ్యతను గలిగి యున్నది.

అందువలన ఇప్పటికి తేలిన విషయ మేమనగా "ఆత్మ" తేట తెల్లముగా సర్వజనామోదముగా శాస్త్రీయముగా నిర్వచింపబడ లేదన్నమాట.

హిందూమత పవిత్ర గ్రంథములలో భగవద్గీతను చరమ నిబంధనగా భావింపవలసి యున్నది.

శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాల నందనః,
పార్థోవత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.

వేదములు, వేదాంతము లనబడు ఉపనిషత్తులు మానవుని యొక్క భౌతిక జీవిత క్రమమును ప్రకటించుచు ఆత్మ విచారమును సూచించినవి.

కాని ఉపనిషత్తులు ప్రత్యేకించి సృష్టి స్థితి లయ కారణ భూతమయిన సర్వతర్యామి యయిన వైష్ణవ శక్తిని గూర్చి విపులముగా వెల్లడించుచున్నవి అని హిందువుల విశ్వాసము.

"అలంకార యుక్తముగా వర్ణించిన యెడల, సర్వోపనిషత్తులు గోవు రూపమును దాల్చిన, శ్రీకృష్ణుడు (గీతాచార్యుడు) పాలు పితుకు గోపాలుడగు చున్నాడు. పితుకబడిన పాలు గీతామృతమగు చున్నవి. ఈ యమృతమును గ్రోలినవాడు గీతను వినిన అర్జునుడగు చున్నాడు". అని గీతా పీఠిక వివరించుచున్నది. ఇదియే పై నుదాహరింపబడిన శ్లోకము యొక్క భావము.

"సకృ ద్గీతాంభసి స్నానం సంసార మల మోచనమ్" - (భగవద్గీతా విషయమును పాటించుట యనుస్నానము అరిషడ్వర్గము, సప్త

వ్యసనములకు స్థానమయిన సంసారమునుండి గృహస్థుని శుభ్ర పరచు నైర్మల్య స్నానము.) - "ఏవం శాస్త్రం దేవకీ పుత్ర గీతమ్" (భగవద్గీతయే పరమోత్కృష్టమయిన ఏకైక యోగ శాస్త్రము - ప్రామాణిక యోగ శాస్త్రము) " సర్వ శాస్త్రమయీ గీతా" (సర్వయోగ శాస్త్రముల యొక్కయు, నీతిశాస్త్రములయొక్కయు సారము భగవద్గీత) - భగవద్గీత వేదాంతము లనబడు ఉపనిషత్సారము, బ్రహ్మవిద్యా నిలయము, యోగ శాస్త్రము - ఇట్టి భగవద్గీతయే ఆత్మ విచారమునకు ప్రమాణ గ్రంథమని చెప్పవలసి యున్నది. ఈ ప్రామాణిక గ్రంథమును బట్టి ఆత్మవిచారమును మొదట గావించి, మనము గ్రహించిన విషయములను సమన్వయపరచి, సత్యమును గమనింతముగాక !

భగవద్గీతా పఠనమున, దాని గ్రాహ్యమున గొప్పపొరపాటు సహజముగా జరిగిపోవు చున్నది - అని యీ రచయిత భావించు చున్నాడు! భగవద్గీత పదునెనిమిది యోగములుగా (పదునెనిమిది అధ్యాయములుగా) విభజింపబడి యున్నను, అది మొత్తము మీద ఒక్కటే ఒక్క వేదాంతరచన - ఒక్కటే ఒక్క ఉపనిషత్ రాజము, ఒక్కటే యొక్క యోగశాస్త్రము. 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే' అను ప్రథమ శ్లోకము మొదలు 'మోక్షయిష్యామి మాశుచః' (చరమ శ్లోక అంత్య వాక్యము) వరకు ఒకే ఒక్క సుదీర్ఘ వచన భూషణముగా భావింపవలసి యున్నది. ప్రారంభ శ్లోకము మొదలు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవక్త శ్రీరామానుజుడు వెల్లడి గావించిన చరమశ్లోకమువరకు గీత ఒకే ఉపన్యాసము. భగవద్గీతలోని యే అధ్యాయమును గాని, ప్రత్యేకముగా పఠించి, వాకొక అధ్యాయము తెలిసినదనుకొనుట అజ్ఞానమే యగును. ఒక అధ్యాయముయొక్క జ్ఞానము తరువాతి అధ్యాయమును గమనించుటకు సహాయకారిగానే యుండును. ఇట్లు గీతయొక్క పదునెనిమిది అధ్యాయముల యొక్క సక్రమ సంపూర్ణ జ్ఞానము గీతా చరమ శ్లోకార్థమును గ్రహించుటకు తోడ్పడును.

(1) అర్జున విషాద యోగమను గీత ప్రథమాధ్యాయమున - విషాదముననున్నవానిని కారణ యుక్తముగా వాని విషాదమును

తొలగించి, వానిని సత్యమునకు మరల్చుటకు మార్గము తెలుప బడినది. (2) సాంఖ్యయోగమున బ్రహ్మ నిష్ఠను బొందినవాడు సత్క్రమ కర్మాచరణమునకు పూనుకొనవలయునని తెల్పబడినది. (3) సత్క్రమ కర్మాచరణమువలన మానవుడు జ్ఞాని కావలయును అని కర్మ యోగమున విపులీకరింపబడినది. (4) అజ్ఞానమును తొలగించుకొని జ్ఞానార్జనము చేయువానికి జ్ఞానయోగము చెప్పబడినది. (5) అనవరతము స్వకర్మయయిన సత్కర్మను పరోపకారార్థమై గావింప వలయునని కర్మసన్యాసయోగమున వివరింపబడినది - కర్మఫల త్యాగము వ్యక్తికి, సంఘమునకు శాంతిని చేకూర్చును. ఇట్టి కర్మ ఫల సన్యాసి యయినవాడు తనకును, అనగా, జీవాత్మకును, పరమాత్మకును గల సంబంధమును తెలిసికొనవలయునని యీ యోగమున తెలుపబడినది. (6) ఇట్టి జీవాత్మ పరమాత్మల సంబంధము తెలిసికొన్న వానికి ఆత్మసంయమయోగము తెలుప బడినది. (7) విజ్ఞానయోగమున పరమాత్మ యొక్క అధిభూత, అధిదైవ, అధియజ్ఞ తత్త్వములు తెలుపబడినవి. ఇట్టి విజ్ఞానమును బొందిన వాడు పుణ్యకర్ముడై సుఖదుఃఖాది ద్వంద్వజనితమయిన మోహము నుండి విముక్తుడగును. (8) అక్షర పరబ్రహ్మ యోగమున తెలుపబడిన దేమనగా - వేదాధ్యయనము నందును, యజ్ఞదీక్ష యందును, తపో వ్రతముల యందును, దానముల యందును ఉపదేశింపబడిన పుణ్య ఫలితములకు మించిన పరమపద స్థితి లభ్యమును గూర్చి తెలుప బడినది. పరమపద స్థితిని బొందిన మనుష్యుడు సర్వాంతర్యామి యయిన పరమాత్మ తత్త్వమును, దానియొక్క సర్వస్వామ్యమును గూర్చి తలంచుచు మోక్షమార్గమున బడును. (9) ఇట్లు మోక్షమార్గమున బడిన వానికి రాజవిద్యా రాజగుహ్య యోగము తెలుపబడినది. (10) విభూతి యోగమున పరమాత్మయొక్క విభూతియే యీ విశ్వ మంతయు ననియు, ఈ విశ్వములోని ప్రతిచరాచరఅంశమును, అణువును పరమాత్మచే నిండియున్నదనియు తెలుపబడినది. (11) ఇట్లు పరమాత్మ యొక్క విభూతులను గూర్చి తెలిసికొన్న విజ్ఞానికి

విశ్వరూపసందర్శనయోగమున విశ్వరూపము ప్రదర్శింపబడినది. అనగా మానసికముగా ఒక్కసారి విశ్వమునంతటిని తన మనో నేత్రముతో విజ్ఞాని చూడగలిగినాడన్నమాట. విశ్వము నొక్కసారి తన మనస్సునకు దెచ్చుకున్నాడని భావము. ఇట్టివాడు తాను విశ్వములోని యే అంశమునకు గూడా సామ్యత గలిగిన వాడుగా తెలిసికొని, విశ్వ సౌభ్రాత్రమును గలిగి తాను విశ్వముననొక పరమాత్మాంశమని గమనించును. (12) ఇట్లు సర్వ భూత ప్రియుడై యున్న మానవునకు భక్తియోగము తెల్పబడినది. ఈ యోగమున సర్వభూత ప్రియుడయిన మానవుడు తన జీవితమున నెట్టి ఉన్నత మానవ గుణములను గలిగి యుండునో చెప్పబడినది. భక్తుడనగా నెట్టివాడో నిర్వచింపబడినది. కర్మఫల త్యాగియు, చిత్తశుద్ధిగలవాడును, సమర్థుడును, ఉదాసీనుడును, నిత్యసంతోషియు, ద్వంద్వములచే చలింపని వాడును, అయిన మానవోత్తముడే నిజమైన భక్తిగలవాడని తెలుపబడినది. (13) ఇట్టి నిజమైన భక్తునకు క్షేత్ర క్షేత్రజ్ఞయోగమున క్షేత్ర క్షేత్రజ్ఞులకు గల భేదమును, భూతముల యొక్క ప్రకృతి బంధ మోక్షముల గూర్చిన జ్ఞానమునుగూర్చి తెలుపబడినది. (14) ఇట్టి క్షేత్ర క్షేత్రజ్ఞులకు గల భేదముల, సంబంధముల నెరిగిన భక్త శిరోమణి గుణత్రయ ప్రకృతి ప్రవృత్తులను గూర్చి ఆలోచించి తెలిసికొన గలడని గుణత్రయ విభాగ యోగమున తెలుపబడినది. (15) ఇట్టి మహాభక్తుడు సర్వంతర్యామి యగు ఈశ్వరశక్తిని పురుషోత్తమునిగా గ్రహింపగలడని పురుషోత్తమ ప్రాప్తియోగమున తెలుపబడినది. (16) ఇట్టి సర్వజ్ఞుడయిన భక్తుడు దైవ, అసుర అంశముల భేదముల గ్రహించి, సంపూర్ణమయిన మంచి కార్యములు దైవ కార్యములనియు, ఇతరులకు హానికరము లగు కార్యములు అసుర గుణములనియు తెలిసికొనగలడని దైవాసుర సంపద్విభాగ యోగమున తెలుపబడినది. అట్టి భక్తుడు స్వార్థరాహిత్య భావమున సత్కార్యముల జేయుచు పరమాత్మను గూర్చి ఆలోచించును. (17) ఇట్టి నిర్మలుడైన పరమభక్తుడు శ్రద్ధాత్రయ విభాగమును గమనించినవాడై తానెల్లప్పుడును మనోవాక్కాయ కర్మల

యందు ఉత్తమమార్గమునే పాటించునని శ్రద్ధాత్రయ విభాగ యోగమున వర్ణింపబడినది. (18) ఇట్టి ఉత్తమోత్తముడయిన భక్తుడు తన మోక్షసాధనమునకే గాక, సర్వులయొక్క మోక్షప్రాప్తికొరకు ఆలోచించి కృషి చేయువాడు గావున అతడు శరణాగతి ప్రపత్తి మార్గముల ననుసరించి, జీవించునని మోక్షసన్యాస యోగమున (కడపటిదగు పదునెనిమిదవ అధ్యాయమున) వర్ణింపబడి యున్నది.

ఈ విధముగా భగవద్గీత సమగ్రమయిన ఒక్క యోగశాస్త్రము. దీనియొక్క చరమశ్లోకార్థమునకు జీవితమును అంకితపరచుకొనుటకు మెల్లగా క్రమక్రమముగా మనము ఒక యోగమును గ్రహించి ప్రవర్తనయందు పాటించుచు, తరువాతి యోగపఠనమునకు పోవుచు నుండవలయును - అక్షరక్రమమును నేర్చుకొనునట్లు, ఎక్కములు కంఠస్థము చేసికొనునట్లు. పదునెనిమిది యోగముల జ్ఞానముతో గూడిన అనుభవముతో చరమశ్లోకార్థమగు ప్రతిపత్తిని పొందవలసి యున్నది. విషయము, పద్ధతి యిట్లుండగా, గీతాపఠనము జేయు చదువరులు, భక్తులమని తలంచువారు, గీతోపన్యాసములు గావించు పండితులు కొందరు, ఆధ్యాత్మిక తార్కిక పండితులు కొందరు - కర్మ యోగము మేలా? జ్ఞానయోగము మేలా? భక్తియోగము మేలా? అను ప్రశ్నలను ఉత్పన్నము జేయుట హాస్యాస్పదముగా నున్నది! కారము మేలా, ఉప్పు మేలా, పులుపు చింతపండు మేలా అను ప్రశ్నకు జవాబేమున్నది? ఈ ముడింటిలో యే ఒక్కదానినైనను ప్రత్యేకించి సేవించునదేమున్నది? ఈ మూడును తగుపాళ్లలో గలిగిన పచ్చడిని మనము సేవించి ఆనందించుచున్నాము! మకరధ్వజమను ఔషధ రాజము శరీరసర్వతోముఖాభివృద్ధికి ఎంతోఉపయుక్తమయిన ఔషధమని చెప్పబడినది. ఇందులో నుపయోగింపబడు పలు ద్రవ్యములలో నేదో ఒక్క ద్రవ్యమును అనుదినము ఎంత సేవించినను లాభమేమున్నది? అన్ని ద్రవ్యములతో కలిసి తయారైన ఆ దివ్యౌషధమే గదా సేవ్యము? నీటిని మనము త్రాగి ఆనందించు చున్నాము, జీవించుచున్నాము. నీరు ప్రాణవాయువు, ఉదజని అను

రెండు వాయువుల సమ్మేళనము గదా? ఇందులో ప్రాణవాయువు మేలా, ఉదజని మేలా అన్న ప్రశ్న అవివేక జనితమే కదా? ఈ రెండు వాయువులు కలిసి ఉత్పన్నమయిన నీరుకదా మనకు కావలసిన ద్రవ్యము? ఇదే విధముగా అతిసులువుగా పలుమారు అసంపూర్ణ జ్ఞానులై కాషాయవస్త్రధారులై సన్యాసులము, భక్తులము, మఠాధిపతులము అని చెప్పుకొనువారు కర్మయోగము మేలా, జ్ఞాన యోగము మేలా, భక్తియోగము మేలా అని యేదో వితరణ జ్ఞానమును వెదజల్లుచున్నామని భావించువారిని గూర్చి మన మేమనుకొనవలెను? ఇట్లు ప్రలాపించు పండితులు, స్వాములు అనబడువారు, కొందరు మఠాధిపతులు, మఠాధిపతులు ఈ మార్గముననే మాట్లాడుచు, దారి తెన్ను అగుపడని చీకటి గుంటలు, సమతలముల విహరించు అజ్ఞాన ప్రజలను అంధకార కూపములోనికి శాశ్వతముగా నెట్టుచున్నారు. "కానని వాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్ కానని భంగి" వలె ఈ ఆధ్యాత్మిక బోధనము అనబడునది జరిగిపోవుచున్నది.

కర్మయోగము మేలా, జ్ఞానయోగము మేలా, భక్తియోగము మేలా అని ప్రశ్నించుచు ప్రలాపించు వారల విషయము అనుకొన్నప్పుడెల్లను వివేకవంతులగు వారి మనస్సులను కలవర పెట్టుచుండును, మనోవ్యాకులతను గలిగించును. భగవద్రామానుజులు ఈ విషయమై యెంతో నిర్దుష్టముగా వక్కాణించియున్నారు. కర్మయోగము మేలా, జ్ఞానయోగము మేలా, భక్తియోగము మేలా అను విషయము గాదు సత్యమయిన విషయము. అసలు విషయమేమనగా ఈ మూడు యోగములు మానవునకు అవసరము. కర్మయోగమున ఆర్జించిన జ్ఞానమునకు ఫలమైన భక్తిమార్గమున మానవుడు ఉండవలయును. "భగవచ్ఛక్తి స్వధర్మ జ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైక గోచరమ్" అని పెరియాళ్వారయిన విష్ణుచిత్తుడు బల్కియున్నాడు. స్వధర్మమును సక్రమముగా నిర్వహించు వానికి నిజమైన జ్ఞానము లభ్యమగును, అట్టి జ్ఞానమున మానవుఁడు స్వార్థరహితుడై కర్మ ఫల త్యాగిగా నుండును. స్వార్థరహిత వైరాగ్యభావము నిజమైన భక్తిని రేకెత్తించును.

ఇట్టి భక్తి సర్వభూత దయ ప్రేమ అని చెప్పబడుచున్నది. ఇట్టి భక్తిభావము గల వానికే దైవశక్తి గోచరమగును - అని భావము. ఈ విధముగా ఒక యోగము మరియొక యోగమునకు సోపానముగా నుండగా ఆ యోగము మేలా, ఈ యోగము మేలా అని ప్రలాపించు వెల్తికుండల నేమనవలయును ?

ఆలోచించి చూడ యీ దురాలోచన "ఏనుగు-అర్గురు గ్రుడ్డివాండ్ల కథ'వలె నున్నది! కంటి అద్దముల జోడు నాకు సంబంధించినది, నాకు సంబంధించినది అని ముక్కు, కండ్లు, వాదులాడు కొన్నట్లున్నది?

కర్మయోగము మేలా, జ్ఞానయోగము మేలా, భక్తియోగము మేలా అని ప్రలాపించు యీ అసంపూర్ణ జ్ఞానులకు భగవద్గీతలోని యితర పదునైదు యోగములయందు చెప్పబడిన జ్ఞానముతో పనిలేదేమో! "శతశ్లోకేన పండితః" అన్నట్లున్నది! వీరికి మూడు మాటలతో వేదాంత మహాసముద్రమును చుట్టి వచ్చునట్లున్నది.

భగవద్గీతలోని పదునెనిమిది యోగములందు జెప్పబడిన జ్ఞానము క్రమముగా మానవునకు అవసరము. గీతాసారమయిన పదునెనిమిదియవ అధ్యాయమయిన మోక్షసన్యాసయోగమున బేర్కొనబడిన తిరుమంత్ర మనదగిన చరమ శ్లోకమున (శ్లో॥ సర్వ ధర్మాన్ పరిత్యజ్య । మామేకం శరణం వ్రజ । అహంత్వా సర్వ పాపే భ్యో । మోక్షయిష్యామి మా శుచః ॥) శరణాగతి, ప్రపత్తులు ప్రతిపాదింప బడినవి. ఇట్టి స్థితిని అందుకొనుటకు మానవునకు ఆత్మజ్ఞానము అవసరము. ఆత్మజ్ఞాన మనగా తన్ను తానెరుగుట. దీనినే తత్త్వత్రయ జ్ఞానమని భగవద్రామానుజులు తన విశిష్టాద్వైత సిద్ధాంత ప్రబోధమున విపులీకరించి యున్నారు.

ప్రథమములో చెప్పబడ్డ విధముగా బహుళజాతిప్రజలచే విశ్వసింప బడినట్టియు, హిందువులుకూడా నమ్మినట్టియు, పంచ భూతముల కతీతమైన 'ఆత్మ' అనబడు దానిని గూర్చి మన ప్రామాణిక గ్రంథము, యోగశాస్త్రము అయిన భగవద్గీత యందేనని వర్ణింపబడి యున్నదో విచారింతము గాక !

భగవద్గీతయందు అనేక సత్యములు, విశ్వాసములు, లక్షణములు నిర్వచింపబడి యున్నవి - గీతాచార్యునకు పూర్వము మానవ సంఘమున నున్న వివిధ విశ్వాసములను తెలియజేయుచు, తన యుద్దేశ మిదియని గీతాచార్యుడు చెప్పను. గీతాచార్యుని యుద్దేశము మనకు ప్రమాణముగాని అంతకు ముందున్న ఆచారములు, భావనలు, ఉద్దేశములు గావు. అర్జునుడడిగిన ప్రశ్నలు, అర్జునుని యొక్క విశ్వాసములు, ఉద్దేశములకు సంబంధించి అనేక శ్లోకములున్నవి గదా? ఈ శ్లోకములన్నియు ప్రామాణికములని చెప్పగలమా? గీతాచార్యుడు తన ఉద్దేశములుగా చెప్పబడిన శ్లోకములే మనకు ప్రామాణ్యములు.

'ఫలాని విషయమును గూర్చి పండితులిట్లు భావింతురు; యోగులిట్లు వచింతురు; సాంఖ్యులిట్లు భావింతురు; తార్కికు లిట్లందురు; ప్రస్తుతాచార మిట్లున్నది; కాని నేను ఈ విధముగా భావించుచున్నాను' అని కడపటి మాటగా గీతాచార్యడగును. ఈ కడపట ఇవ్వబడిన గీతాచార్యుని భావము మనకు అనుసరణీయము. ఈ విధముగానే అనేక విషయములను గీతాచార్యుడు నిర్వచించుచు, ఆదేశించుచు పోవును. అనేక విషయములందును, సందర్భములందును గీతాచార్యుడు తనకు పూర్వమునను, తన కాలమునను పాటింపబడుచున్న అనేక లోప భూయిష్టమయిన విషయములను చూపుచు, సత్యమార్గమును వెల్లడి చేయుచుందురు. అందువలన 'ఆత్మ' అను దానిని గూర్చి గీతాచార్యుడేమని నిర్వచించి యున్నాడో గమనింతముగాక.

విషయ గ్రాహ్యము ప్రధానము గావున ఆయా అధ్యాయములోని ఆయా శ్లోకముల సంఖ్యను గుర్తించుచు, శ్లోక భావములను వ్రాయు చున్నాను.

(1-42) "వర్ణ సంకరమువలన కులమునకే నరకము సంభవించును. వారి పితృదేవతలు పిండోదక క్రియలను గోల్పోయి స్వర్గభ్రష్టులగుదురు" - అని అర్జునుడనును.

(అర్జునుడు సామాన్య మానవునకు సాంకేతికము. కృష్ణుడు జ్ఞాని యైన ఆచార్యునకు సాంకేతికము).

పైన నుదాహరింపబడిన విశ్వాసము శ్రీకృష్ణుని కాలము వరకు ఉండినట్లే. ఆ మూఢ విశ్వాసమును అర్జునుడు వెల్లడించినాడు. ఈ విశ్వాసము ప్రకారము ముధముగా ఆలోచించు గీతా పాఠకులు ఏమని గమనించుచున్నారు? మరణానంతరము తలిదండ్రులు స్వర్గలోకమున నున్నారనియు, జీవించియున్న కుమారుడు పిండోదక క్రియల వలన స్వర్గమున నున్న వారిని సంతుష్టుల జేయవలయు ననియు, అట్లు చేయకున్న యెడల తల్లిదండ్రులు (పితృదేవతలు) స్వర్గ భ్రష్టులగుదు రనియు, తలంచుచున్నారు. ఇది సక్రమమయిన భావము కాదని వివేకుల మతము.

వర్ణ సంకరము కలిగిన యెడల, జనించు కుమారుడు తలి దండ్రులతో ఎంతవరకు బంధము కలిగియుండును? క్రమశిక్షణ అనునదేమున్నది? పరస్పర వంశ నంబంధ మేమున్నది? ఇట్టి పరిస్థితులలో వృద్ధులయిన మాతాపితలకు (పితృదేవతలకు) అన్న పానాదులు (పిండోదకములు) ఎట్లు లభ్యము కాగలవు? ఇట్టి తలి దండ్రులు అనగా వర్ణ సంకరము గావించిన తలిదండ్రులు ఎంతవరకు సు + వర్గమున (స్వర్గమున) నున్నట్లు భావింపబడగలరు? వర్ణ సంకరము గావించిన వారు దుర్వర్గమునకు సంబంధించిన వారుగానే భావింపబడుదురు.

అందువలన 1-42 శ్లోకమున 'ఆత్మ' అని చెప్పబడు దానిని గూర్చి యేమియులేదు. తరువాతి రెండు శ్లోకములు కూడా కేవలము ఈ ప్రాపంచిక జీవితమును గూర్చియే చెప్పబడినవిగదా? వర్ణ సంకరము వలన కులధర్మములు, జాతి ధర్మములు అనాదిగా నున్నవి నశించును. వర్ణ సంకర ఫలితముగా జనించిన కుమారుడు ఏ కుల ధర్మమును పాటింపవలయును? తండ్రి దానినా? తల్లి దానినా? అప్పటి కాలములో వర్ణాశ్రమ ధర్మ విధానము వ్రేళ్ళు పాతుకొని యుండెను గదా? అట్టి

కుల ధర్మములు నాశనము జెందిన యెడల నరకవాసము తప్పదు అని చెప్పబడినది. అనగా సుఖము, గౌరవము, లేవు అని భావము.

కావున 1-42, 43, 44 శ్లోకములు యుద్ధ ఫలితమున పురుషులు అకాలమరణముల నొందుటచేత కుల స్త్రీలు చెడు అవకాశములున్న వనియు, వర్ణ సంకరములు జరుగుననియు, తలిదండ్రులు బాధల పాలగుదురనియు, కులవృత్తులు జాతిధర్మములు అంతరించు ననియు , క్రమశిక్షణ నైతికమార్గముల యొక్క ప్రామాణ్యములుండ వనియు చెప్పబడినది. ఇట్లే శ్లోక భావములను గ్రహించిన యెడల తావులేదు. మరణాంతరము పితృదేవతలు స్వర్గమున నుండి, భూలోకము నందున్న వారి కుమారులిచ్చు పిండోదకములు గ్రహింతురను విశ్వాసమునకు తావులేదు.

సాంఖ్యయోగమున 2-12 శ్లోకమున నిట్లు తెల్పబడినది - 'మున్నెకప్పుడు నేను లేనివాడను గాను. నీవును నీ యెదుట నున్న యీ రాజులును అటువంటి వారే. ఇకమీద మన మందరమును ఒకప్పుడు లేకపోవు వారమునుగాము'.

ఇచ్చట నేను అను పదము చరాచరమునందున్న ఈశ్వర శక్తికి సాంకేతికము; అర్జునుడు జీవకోటిలో నొకడుగ సూచింపబడినాడు. ఈ ప్రపంచమున జన్మములు మరణములు స్వభావ సిద్ధముగా సహజముగా జరిగిపోవుచున్నవి గాన, యెవరు మరణించినను, యెందరు మరణించినను, ఈ ప్రపంచమునకు లోటులేదు. ప్రజలుందురు, రాజులుందురు, వీరికి సలహాల నిచ్చు గురువులో ఆచార్యులో ఉండనేయుందురు. సంఘటనలు చర్విత చర్వణముగా జరుగుచునే యుండును. ప్రకృతి యిట్లే యుండును. ప్రకృతి నావరించి యున్న సర్వంతర్యామి యగు ఈశ్వరశక్తి తరుగకుండా శాశ్వతముగా అట్లే యుండును; అని చెప్పబడినది. "ఆత్మ" అనబడు దానిని గూర్చి యిచ్చట యేమియు చెప్పబడలేదు.

(2-22) శ్లోకము అనాది విశ్వాసమయిన జీవునియొక్క పునర్జన్మమును గూర్చి తెల్పుచున్నది.

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యథావిహాయ నవాని గృహ్ణాతి నరో ఒ_పరాణి,**
**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ.**

భావము : 'మనుష్యుడు చినిగిపోయిన ప్రాత వస్త్రములను విడిచి, యితరములయిన క్రొత్త వస్త్రముల నెట్లు ధరించుచున్నాడో, అట్లే ప్రాతపడిన శరీరములను విడిచిపెట్టి జీవాత్మ క్రొత్తవైన శరీరమును గ్రహించుచున్నది' - అని.

ఇది శ్రీకృష్ణుని యొక్క భావముగాదు. అనాదినుండి మానవులచే విశ్వసింపబడిన భావము. శ్రీకృష్ణుని కాలము వరకు పండితులు, ఋషులు, తత్త్వవేత్తలు విశ్వసించిన పద్ధతి.

శ్రీకృష్ణుని విమర్శనాత్మకమయిన భావము 2-27, 28 శ్లోకముల యందు ఇవ్వబడినది. ఈ విషయమును తరువాత చర్చించుకొందము గాక.

ప్రస్తుతము ముందుగా పై 2-21 శ్లోక భావమును విమర్శించు కొందము. వాడుకగా నాలోచించుటలో శరీరము వృద్ధాప్యమున కృశించినదై పాతబడి జీర్ణించి పోవును. పంచేంద్రియములు చురుకుగా పనిజేయవు. దేహమునే భరింపలేని వాడుగా దేహి తలంచును. శరీరము యే సుఖమునకు గాని తగని స్థితి యందుండుటయే గాక, యే యుపయోగమునకును తగని స్థితియందుండును. అట్టి యెడ శరీరము దేహికి ఒక బాధాకరముగా నుండును. అట్టి స్థితిలో మరణము మేలని శరీరి భావించును.

కాని, యౌవనములో శరీర మానసిక దార్ఢ్యముండియు మానవుడేల మరణించుచున్నాడు? ఆరోగ్యవంతుడుగా నున్న పసిబిడ్డ తటాలున ఒక నిమిషములో కలరా వంటి వ్యాధికి లోనై మరణించు చున్నాడుగదా! యుద్ధమున మరణించు యుద్ధవీరుడు కూడా

ముందుగనే తన శరీరము ప్రాతబడినదని భావించి, దానిని వదలి మరియొక నూతన శరీరమును చూచుకొనునా? నవయౌవనుడుగా నున్న ఒకానొకడు యేదో మానసిక ఆవేదనముతో ఆత్మహత్యకు కడంగుటకు పూర్వము తన శరీరము జీర్ణించి పోయినదని నూతన శరీరమును చూచుకొనునా? కావున పై శ్లోకము యొక్క సత్యమును గమనింపుడు. ఈ నమ్మకము అనాదినుండి వచ్చినట్టిది. దానిని గీతాచార్యుడు సూచించుచున్నాడే గాని, ఆయన అంగీకరించినది కాదు. అందువలననే 2-27, 28, 29 శ్లోకములందు వారి యుద్దేశము లను ఈ విధముగా వెల్లడించుచున్నారు :

2-27. 'పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి పుట్టుక తప్పదు. కావున తప్పింప శక్యముగాని యీ విషయమునందు నీవు శోకింపతగదు'. ఇచ్చట ప్రాధాన్యమయిన విషయములు జనన మరణములు గావు. జీవితమును ఎట్లు గడపవలయు ననునది ముఖ్యమయిన విషయము. పుట్టిన జీవి మరణించుట అనునది సర్వులు ఎరిగిన విషయము. చచ్చినవాడు మరల పుట్టుననునది యెవ్వరును ఎరుగని విషయము. మొదటిది సాదృశ్యము; రెండవది అనాది విశ్వాసము మాత్రమే. గీతాచార్యుడు అతినేర్పుతో ఉన్న విశ్వాసములను అతి కఠినముగా ఖండింపక, వానిని వెల్లడించుచు, సత్య విషయమును ప్రత్యేకించి చూపును.

2-28. 'సకల భూతములు ఏదేని ఒక అగోచర పదార్థము నుండి పుట్టి నడుమ నిట్లు కనుపించుచున్నవి. తుదకు ఆ యగోచర పదార్థమునంద అవి లయించును. కావున నిందులకు శోకము అనవసరము'.

ఇది ప్రాజ్ఞత, శాస్త్రీయము, సత్యము. ఇది గీతాచార్యుని ఉద్దేశము, ఉద్బోధ. మనకు ప్రామాణ్యమయినది; అనుసరణీయము. జీవశక్తి అగోచరమన్నాడు. జీవి యొక్క అభివృద్ధి మాత్రము మనము గోచరించుచున్నది అంతవరకే. ఇచ్చట 'ఆత్మ' అను దానిని గూర్చి

ప్రత్యేకించిన విషయప్రసక్తే లేదు. దీనిని గూర్చి విచారము కూడా అనవసరమనియే సూచన. జీవితకాలమును సక్రమముగా, ఫలప్రదముగా జరుపుకొనుటయే ప్రధానమని గమనింపదగియున్నది.

2-29. 'ఆత్మ యింతటి ప్రసిద్ధ వస్తువయినను (మూలమయిన దయినను) దాని నొకానొకడు మిగుల క్రొత్తవస్తువవలె చూచుచున్నాడు. మరియొకడు దానిని గురించి ఆశ్చర్యముగా చెప్పుచున్నాడు. వేరొకడు దానిని గూర్చి అత్యాశ్చర్య విషయముగనే వినుచున్నాడు. ఇంత వినియును, దాని నెవ్వడుగాని తెలిసికొన్నవాడు కాడు'.

ద్వాపర యుగాంతమున వెలసినవాడు గీతాచార్యుడని కదా పురాణములు దెల్పుచున్నవి? వారికి ముందు వెలసిన ఋషులు, మునులు, యోగులు, తపస్వులు, తత్త్వవేత్తలు యెవరైనను 'ఆత్మ' అని చెప్పబడు దానిని గూర్చి తెలిసికున్నవారు లేరు అని వెల్లడి యగుచున్నది. అనగా ఉపనిషత్తులలో సహితము ఆత్మను గూర్చి భిన్నాభిప్రాయములు వ్యక్తము చేయబడినవి గాబట్టి, సంపూర్ణ జ్ఞానము వెల్లడింపబడలేదు. కావున ఆ భిన్నాభిప్రాయముల నమ్ముటెట్లు? సర్వోపనిషత్సారమయిన గీతయే మనకు ఆధారము. పురాణములలో వర్ణింపబడిన విధమున ఆత్మను గూర్చి తెలిసికొనుట సరియయినదని అనుటయెట్లు? పురాణ కథలలో కొన్నిటియందు మృతిజెందిన వారు మరల సజీవులయినట్లున్నది. మార్కండేయ చరిత్ర, లోహితాస్యుని వృత్తాంతము, రామాయణమునందు చనిపోయిన వానరులందరు సంజీవినిచే మరల సజీవులయిన వృత్తాంతములను పరిశీలించిన 'ఆత్మ' అను దానిని గూర్చి యేమనవలెను. జీర్ణించిన వస్త్రమును వదలి నూతన వస్త్రమును మానవురడు ధరించు మాడ్కి ఆత్మ జీర్ణించిన శరీరమును వదలి నూతన శరీరమును ప్రవేశించునను విషయమును గూర్చి యేమని ఆలోచింపదగియున్నది? పై వారందరు శరీరములు జీర్ణించినవని తలచిరిగదా? ఆత్మ శరీరమును వదలి పోయెనుగదా? మరల ఆ జీర్ణించిన శరీరమునే ఆత్మ యేల ప్రవేశించెను?

కుశాగ్రబుద్ధి యయిన శ్రీకృష్ణుడే 'ఆత్మ' అని చెప్పబడు దానిని గూర్చి మొదటిసారిగా సమగ్రముగా గమనించినవాడై నట్లున్నది. భగవద్గీత ప్రమాణమని నమ్ము హిందువులకు శ్రీకృష్ణుడు నుడివినదే ప్రమాణము. కావున నిపుడు తేలునదేమనగా 'ఆత్మ' అనబడు దానిని యెట్లు గమనింపవలయును. అని ప్రశ్న! ఈ ప్రశ్నను కడపట, అనగా, భగవద్గీతలోని ప్రామాణ్య శ్లోకముల నన్నిటిని పరిశీలించిన తరువాత, చర్చించెదముగాక.

2-37. 'చచ్చినచో స్వర్గమును బొందుదువు. గెలిచిన యెడల రాజ్యము ననుభవింతువు. కావున యుద్ధమునకు (నీ విధ్యుక్త ధర్మమునకు) కడంగుము'.

నీ ధర్మమును విధి యుక్తముగా జేయుచు, నీవు మరణించిన యెడల నీవు కీర్తివంతుడ వగుదువు. కీర్తిశేషుడ వగుదువు. సువర్గమునకు, అనగా, మంచివారు అనబడు ఉత్తమ వర్గమునకు జెందుదువు. (సు + వర్గము = స్వర్గము). నీ మరణానంతరము కూడ ప్రజలు నిన్ను కీర్తింతురు; స్మరించెదరు. అంతియేగాని మరణించిన తరువాత ఆత్మ అనబడునది మరియొక ఊర్ధ్వలోకమునకు బోయి, అచట నివసించునని భావముకాదు. శ్రీకృష్ణుని అభిప్రాయమునే ప్రమాణముగా తీసికొనవలసియున్నది.

2-29. శ్లోకమున 'ఆత్మ' అన్న దానిని తెలిసికొన్న వాడెవడును లేడని చెప్పబడినను, ఆత్మ సంయమ యోగమున, విజ్ఞాన యోగమున, క్రమముగా పునర్జన్మను గూర్చి, దైవములో ఐక్యమును గూర్చి చెప్పబడినది.

విభూతి యోగమున, రాజవిద్యారాజగుహ్యయోగమున, విశ్వరూప సందర్శన యోగమున చరాచరమంతయు జేరి భగవచ్ఛక్తి అని చెప్పబడియున్నది. ఈశ్వరశక్తి సర్వంతర్యామి అని తెలుపబడినది.

క్షేత్ర క్షేత్రజ్ఞ యోగమున తనలోనున్న ఈశ్వరశక్తి (ఆత్మ) సర్వంతర్యామి యగు (పరమాత్మ) ఈశ్వరశక్తిలోని భాగమని చేతనుడు గ్రహింపవలసి యున్నది.

సర్వోపనిషత్సార మయిన గీతయందు కొన్ని పరస్పర విరోధ భావములు కన్పట్టుచున్నవి. కాని పైన జెప్పబడిన 2-28, 29 శ్లోక భావములనుబట్టి చూడగా ఆత్మనుగూర్చి అన్వేషింప పనిలేదు. కాని ఈశ్వరశక్తి సర్వంతర్యామి యని తెలిసికొన్న మానవుడు అఖిల మానవ సౌభ్రాత్రమున సానుభూతితో జీవించును. ఇది విశ్వశాంతికి తోడ్పడును.

ఆయా యోగములు అంతకు పూర్వము వెలసిన ఉపనిష త్సారముగా పేర్కొనబడినందున గీతయందు భిన్నాభిప్రాయములు వ్యక్తమగును. కాని శ్రీకృష్ణుని అభిప్రాయము భిన్నరహితము, కడపటిది.

ఈ అత్మ విచారమును గూర్చి 8వ శతాబ్దమున వెలసిన నమ్మాళ్వార్ల సూక్తులిట్లు తెలుపుచున్నవి :

'ఆత్మ అనునది శరీరమను భౌతిక పదార్థము నుండి ఉత్పన్న మగును. ఆత్మ ఆత్మను భక్షించును. ఆత్మ ఆత్మయందే ఉండును. ఆత్మ శరీరగతమగు సుఖదుఃఖాదులను అనుభవించుచు, శరీరమునే ఆశ్రయించికొని యుండును'.

ఈ విజ్ఞానమును నమ్మాళ్వారు మొట్టమొదట మధురకవి ఆళ్వారునకు దెల్పెను.

శ్రీ మద్రామానుజాచార్యుల వారి ప్రథమ ఆధ్యాత్మికా చార్యుడయిన తిరుక్కచ్చినంబి రామానుజున కుపదేశించిన సూత్రములలో యీ విషయములున్నవి :

"అహమేవ పరం తత్వం - ఆ పరమ తత్త్వమే నేను అనబడు ఆత్మ. నావశ్యకీత స్మృతి రంతకాలే - అవసాన కాలమున దైవమును స్మరించిన చాలదు. జీవిత సర్వావస్థలయందును తన్ను తానెరిగి ...ంపవలయును. దేహావసానే మోక్షంచ - శరీర భావమునుండి విముక్తియే మోక్షము అనబడును".

భగవద్గీతలోని 2-28, 29 శ్లోక భావముల నుండియు, నమ్మాళ్వార్ల సూక్తులనుండియు, తిరుక్కచ్చినంబి దెల్పిన సత్యమును బట్టియు, విజ్ఞానియైన మానవుడు ఆత్మ జ్ఞానమును బడయవలసి యున్నది.

'ఆత్మ' అనగా 'నేను-నాది' అను నర్థముల నిచ్చు పదము : ఆత్మగృహము, ఆత్మీయుడు, ఆత్మజ మొదలగునవి. పంచ భూతాత్మక మయిన ప్రాణిలో ప్రాణశక్తి యున్నది. ఈ ప్రాణశక్తి ఉద్భవించినపుడే " ప్రాణి" అనునది తయారగుచున్నది. చీమ మొదలు ఏనుగు వరకు, మానవుని వరకు సర్వప్రాణులలో ప్రాణమున్నది గదా! ఇందులో 'నేను, నాది' అని భావింపగలిగినది, పూర్ణ భావమున - మరవకుండా, మానవుడొకడే. ఈ భావము చేతన శక్తికి మించినది. మానవునిలోని మెదడు యొక్క ఆలోచనా శక్తియొక్క గొప్పతనమే, విశిష్టతయే, "నేను-నాది" అనే భావన. ఇది ప్రాణశక్తి యొక్క ఉన్నత స్థితి, ఉన్నత గుణము. మానవుడొకనికే 'నేను, నాది' అను భావమున్నది. దీనిని 'ఆత్మ' భావము అని యందురు.

మానవున కివతల వెన్నెముకగల నాల్గుకాళ్ల జంతువులకుగాని, కోతికి గాని 'నేను' అను భావము ఒక క్షణములో నున్నను, మరుక్షణములో ఆ భావము విస్మరింపబడును. అందువలననే ఈ జంతువులకు తమ నివాస స్థానమనియు, తమ వస్తువులనియు, తాము తమ వస్తువులను తమ నెలవులయందు దాచి యుంచు కొనవలయుననియు మొదలగు భావములు లేవు. ఒక జంతువును తోటి జంతువుల నుండి, తన స్థలమున నుండి వేరుపరచిన అది పూర్వ స్థితిని మరుక్షణముననే మరచిపోవును. ఆవు దూడను ఇతరులకు అమ్మినాము. ఆ దూడను కొన్నవాడు పలుపు మెడకేసి తీసికొని పోవును. ఆ దూడ కొన్నవానిని వెంబడించిపోవును. తల్లి ఆవు అనియు, మానవ యజమాని యనియు మొదలగు భావములు ఆవు దూడకు ఉన్నవా? లేవు. మానవుడట్లు గాదుగదా! 'నా తల్లి - నా యిల్లు - యిది నాది' అను భావములు బిడ్డకు 2, 3 మాసముల వయస్సప్పుడే కలుగును.

'నేను-నాది' అను ఎరుక, అను ఆత్మభావము, మానవుని యందు సహజముగా స్వార్థభావమును పెంపొందించును. ఇట్లే ఆత్మ భావము కేవలము స్వార్థము కొర్కై, పరోపకారము కొరకుగాక, యుండునది 'దురాత్మ' అనబడును. ఈ ఆత్మ భావము సత్త్వగుణ ప్రధానముగా నుండి, పరోపకార భావమున మెలగునపుడు అది 'పరమాత్మ' అనబడును.

ఆత్మ విచారమును ఇంతటితో పరిమితము జేసికొని నైతిక జీవితమును ప్రధానముగా బెట్టుకొన్నవాడు సుఖశాంతులతో మనగలుగుటయే గాక, సంఘము యొక్క సుఖ శాంతులకు దోహద మిచ్చును.

"ఆత్మవత్సర్వ భూతాని" అన్నప్పుడు సర్వ భూతములయందు ఒకే వైష్ణవశక్తి యున్నది అని భావించవలసినద గాని, జీవాత్మ యొక్క ప్రత్యేకత యేమున్నది? ఈ సూక్తి ఆత్మ జ్ఞానమునకు సంబంధించినదా, లేక, సాంఘిక న్యాయమునకు నైతిక దృక్పథమునకు సంబంధించినదా?

మానవుడు అనాగరకుడుగా నున్నపుడు యెంత అమానుష్యముగా, జంతుతుల్యుడుగా, ప్రవర్తించు చుండినాడేమో గాని, పురాణములలో సైతము నరబలుల సంగతి యున్నదిగదా? శక్తి దేవత నొకదానిని మానవుడు ఊహించుకొని, సృష్టించుకొని, ఆ శక్తిదేవతను తృప్తిపరచిన యెడల ఆ శక్తిదేవత సర్వవిధములయిన వరముల ప్రసాదించునని తలచిన మానవుడు ఆ శక్తికి యివ్వదగిన బలులలో నరబలి శ్రేష్ఠమయినదని తలంచి, నరబలుల నిచ్చు చుండెను. భాగవతమున జడభరతుని కథయందు కూడా నరబలి వృత్తాంతమున్నది గదా! ఇట్టి క్రూరమైనట్టియు, అమానుషమయి నట్టియు, నరబలులను అరికట్టు నుద్దేశముతోనేమో ఋషివంటి ఉత్తమ మానవుడొకడు, 'ఆత్మవత్సర్వ భూతాని' అని చెప్పియుండ వచ్చును. అన్ని జీవరాసుల యందును ఒకే విధమయిన ఆత్మశక్తి

యున్నదిగాన నరబలుల మాన్పుటకు, ఋషివంటి దయాగుణ పరిపూర్ణుడొక మహానుభావుడు సూచించి యుండవచ్చును. నరబలుల నిచ్చి దేవతలను సంతృప్తి పరువగలమను మూఢవిశ్వాస మూఢాచారముల యందు మునిగియున్న అజ్ఞాన ప్రజలకు నేరుగా అసలు జంతుబలులు కూడవని చెప్పుటయెట్లు? బహుదేవతా రాధనములు కూడవని చెప్పుటయెట్లు? దురాచారముల బాప సమకట్టిన మేధావులు సంఘ సంస్కర్తలు ప్రపంచమున నేదేశము నందుగాని యెట్టి యిక్కట్లు పడినారో, యెంతమంది హతులయిరో చరిత్రయే దర్పణముగదా? కావున మనోతత్త్వశాస్త్ర మెరిగిన వాడును, లౌకిక జ్ఞానము గలవాడును, చతురుడయిన, మేధావియైన బోధకుడు కొద్దికొద్ది మార్పులను సూచించుచు మానవులను క్రమక్రమముగా మంచి మార్గమునకు తెచ్చును.

తండ్రిని దుర్మార్గముగా కాలితో తన్ను దుష్టుడును జంతు తుల్యుడును, అజ్ఞానియు, వ్యసనలోలుడయిన కుమారుని నిజమైన ఆచార్యుడు ఎట్లు సన్మార్గమునకు మరల్పగలడో ఆలోచించెదము గాక అట్టి అధమాధముడయిన కుమారునితో, 'నాయనా! తండ్రి దైవసముడు;మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ దేవోభవ అని పెద్దలు వక్కాణించియున్నారు; కాబట్టి నీవు నీ తండ్రిని దేవునివలె పూజింపుము' అని బోధింప ప్రయత్నించిన యెడల యీ దుష్ట కుమారుని నుండి తండ్రికి గల్గిన గౌరవమే ఆచార్యునకు దక్కునేమో! సర్పము ఎవరినైనను కాటు వేయును. హత్యను నివారింప ప్రయత్నించిన మధ్యవర్తులెందరో హంతకుని చురకత్తికి యెరయై యున్నారు. కావున తండ్రిని కాలితో తన్ను దుష్ట కుమారుని సంస్కరించుటకు మేధావియయిన ఆచార్యుడు మొదట యేమని బోధించుననగా - 'నాయనా, నీ తండ్రినేల కాలితో తన్నెదవు? అంత నీకు అప్రియుడుగా నున్న అతనిని చేతితో అటు తొలగనెట్టుము. అది చాలదా? కాలితో తన్నరాదు. కన్నతండ్రి గదా!' అని బోధించును.

తరువాత కొన్ని దినములకు తండ్రిని చేతితో కొట్టుచున్న కుమారునితో ఆచార్యుడు 'అబ్బాయీ, కన్నతండ్రిని కొట్టడమేమిటి? పెద్దవాడు, ముదుసలి, బలహీనుడు, నిన్ను కని పోషించిన వాడు - నీకు తెలియదా - ఒకవేళ అతడు నీకు అప్రియము కలుగజేసిన యెడల, తిట్టుము - కొట్టుట మంచిదిగాదు' అని యనును.

తరువాత కొన్ని దినములకు తండ్రిని తిట్టుచుండిన కుమారునితో, 'అబ్బాయి నీకు తండ్రిపై విసుగుకలిగిన ముఖము తప్పించిపో. ఆయనను తిట్టుట మంచిదిగాదు' అని ఆచార్యుడు చెప్పవలెను. తరువాత కొన్ని దినములకు తండ్రి ముఖము చూడక తండ్రితో మాట్లాడక అప్రియముగా వర్తించు కుమారుని జూచి ఆచార్యుడు, 'అబ్బాయి, తండ్రిపై యేదో కారణముతో నీవు అప్రియుడుగా నుందువేమో. కని, పోషించి, నీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నవాడు మీ తండ్రి వార్ధక్యమున నున్నాడు. నీవు పెడముఖము పెట్టి తండ్రితో మాటాడకుండుట మంచిదికాదు. ఈ నీ వైఖరి పెద్దవాడైన మీ తండ్రికి యెంతటి మనోక్లేశమును కలుగజేయునో ఊహించుకొనుము కాబట్టి తండ్రితో మాట్లాడుచుండుము; అది మీ తండ్రికెంతో సంతోషమును కల్గించును - నీవు ఆయన చెప్పినది ఆమోదించక పోయినను పరవాలేదు - లేక నీ మాటలను ఆయన సమ్మతింపక పోయినను పరవాలేదు - నీవు ఆయనతో మాట్లాడుచుండిన యిరువురు శాంతి యుతముగా నుండుటకు వీలుపడును. మీ తల్లియు, ఇతరులను సంతోషింతురు. కుటుంబమున వాంఛనీయమయిన వాతావరణము నెలకొనును', అని చెప్పను.

తరువాత కొంతకాలమునకు ఆచార్యుడు, 'అబ్బాయీ! మీ తండ్రి పెద్దవాడు, అనుభవజ్ఞుడు; నీ క్షేమమును కోరువాడు. ఆయన సలహాలను నీవు పాటింపుము. అది నీకు శుభస్కరము', అని చెప్పి కుమారుని విధేయునిగా చేయగలుగును.

ఇట్లు విధేయుడుగా మారిన కుమారునితో ఆచార్యుడీ విధమున జెప్పను, 'తండ్రి దైవసముడు. ఆయనను పూజింపుము. శ్రీరాముడు

పితృవాక్య పరిపాలకుడయి ప్రపంచమునకు ఆదర్శప్రాయుడయ్యే కదా!' అని బోధించి కుమారుని పితృభక్తికి మరల్చును.

అదేవిధముగా నరబలులు గావించుచున్న మానవ సంఘమునకు ఆదిలో ఋషివంటి వాడొకడు "ఆత్మవత్సర్వ భూతాని" అని చెప్పి నీలోనున్న ఆత్మవంటిదే గదా తోటి మానవుని యందుండు ఆత్మ? అందువలన తోటిమానవుని చంపుట యుక్తముగాదు. అవసరముగా భావించిన నీ యిష్టదైవమునకు యేదో జంతు బలినిచ్చి తృప్తి పరచుము" అని చెప్పియుండును. దీని భావము బహుదేవత లున్నారని కాదు; వారికి జంతు బలుల నిమ్మనికాదు. అమాను షత్వమును కొంతవరకు తగ్గించుటకు యీ సూక్తి - అనగా-ఆత్మ వత్సర్వ భూతాని - అను సూక్తి ఉపకరించి యుండవచ్చును. క్రమక్రమముగా సర్వమానవుల యందును ఒకే ఆత్మశక్తి యున్నదను భావము ప్రబలగా కొంతకాలమునకు క్రమక్రమముగా మానవుడు నరబలుల నిచ్చుటమాని జంతుబలుల నిచ్చుటకు ప్రారంభించి యుండవచ్చును.

ఇట్లు బహుదేవతా గణమునకు జంతుబలుల నిచ్చు ఆచారము ప్రబలముకాగా 'ఆత్మ వత్సర్వ భూతాని - సర్వ ప్రాణులయందును ఉన్నది ఆ పరమాత్మయే - సర్వ ఘటములను వెలిగించునది ఆ పరమాత్మ శక్తియే - కావున జంతుబలులు నరబలులతో సమానమే. అందువలన జంతుహింస కూడదు' అను సిద్ధాంతము అమలులోనికి వచ్చియుండ వచ్చును. గౌతమబుద్ధుని కాలమున జంతుబలులు అధికముగా ఉండి యుండవచ్చును. ఆత్మవత్సర్వ భూతాని అను సిద్ధాంతము నన్వయింపజేసి బుద్ధుడు 'సర్వ ప్రాణుల యెడ దయ గలిగి యుండవలయును. సర్వప్రాణులకు మనవలె నొప్పి, బాధ యున్నవి కదా! కావున మానవుడు భూతదయ కలిగి యుండ వలయును' అను సిద్ధాంతమును బోధించెను.

ఈ భూతదయ సిద్ధాంతమునకు నాగరక సంఘము యెంతయో ప్రయత్నించినది. ఇప్పుడును ప్రయత్నించు చున్నది. కావున శక్తి దేవతకు

జంతు బలులకు బదులు యే బలినైనను యివ్వవచ్చును అని తరువాత కాలమున సూచింపబడినది. ఇచ్చట బలి అనగా యే ఆహారపదార్థముతో గూడిన పదార్థమయినను కావచ్చును. అందువలన దేవాలయమున ప్రసాదము నుంచు స్థానమును బలిపీఠము అని అనుచున్నాము. కావున బాగుగా గమనించిన యెడల "ఆత్మవత్సర్వ భూతాని" అను సూక్తి ఆత్మ విచారమునకు సంబంధించినదిగా కన్పట్టదు. అది కేవలము సంఘ సంస్కారము కొరకు ప్రవేశ పెట్టబడిన దనియే గమనింపవలసి యున్నది.

వైదికమతము సత్యమయినదని వాదించు వాడును, ఆర్య సమాజ స్థాపకుడును, అయిన దయానంద సరస్వతి సత్యార్థ ప్రకాశము అను గ్రంథమున పేర్కొనబడిన యజ్ఞము, హోమము, శ్రాద్ధము, తర్పణము మొదలగు పదముల విశదీకరణము చాల జ్ఞానోదయ మును కలుగజేయు చున్నది.

మనుస్మృతి (3-70,81; 4-21) ప్రకారము బ్రహ్మచర్యమందు రెండు యజ్ఞములు చేయతగినవి :

(1) బ్రహ్మయజ్ఞ మనగా వేదశాస్త్రమును చదివి, చదివించుట, సంధ్యోపాసనము గావించుట, యోగాభ్యాసము చేయుట - అగును.

(2) దేవయజ్ఞ మనగా విద్వాంసులకు సేవజేయుట, వారితో సాంగత్యము, పవిత్రత మున్నగు దివ్యగుణముల వహించుట, దానమును విద్యను ఉన్నతి పరచుట - అగుచున్నది.

పై రెండు విధములయిన యజ్ఞములను ఉదయ సాయం కాలముల యందు చేయవలయును.

పైరెండు యజ్ఞములు గాక మరియొక విధమయిన యజ్ఞ మున్నది. ఇది పితృయజ్ఞము.

ఏ యజ్ఞమందు దేవులు (విద్వాంసులు), చదివి చదివించువారగు ఋషులు, పితరులు (తలిదండ్రులు) వృద్ధులు, జ్ఞానులు,

పరమయోగులు సేవింపబడుదురో అయ్యది పితృయజ్ఞమనం బడును. పితృయజ్ఞ మందు రెండు అంశములున్నవి : శ్రార్ధము, తర్పణము.

"శ్రత్" అనగా సత్యము. ఏక్రియచే శ్రత్ (సత్యము) గ్రహింపబడ గలదో అట్టిక్రియ శ్రద్ధ అనబడును. అట్టి శ్రద్ధచే ఏ కార్యము చేయబడునో దానిని శ్రాద్ధము అందురు.

ఏ కర్మముచేత జీవించియున్న మాతాపితాది పితరులు తృప్తి జెందింపబడి, సంతోష పెట్టబడుదురో అట్టి కార్యమునకు తర్పణము అనిపేరు.

శతపథ బ్రాహ్మణమున తెల్పబడిన దేవతర్పణమును గూర్చి తెలిసి కొందము :

విద్వాంసులకు దేవులని పేరు. దేవర ఏకవచనము, దేవులు బహువచనము. జంగమదేవర - అన్నపుడు "సంచారజీవనుడయిన విద్వాంసుడు" అను పేరు సార్థకమగుచున్నది. ఏ విద్వాంసుడు నిర్ణీత నివాసము నేర్పరచుకొనక, సన్యసించిన వాడై, విద్యాజ్ఞాన ప్రచారములు జేయుచు దేశాటనము గావించుచున్నాడో అట్టివారు జంగమదేవరులు - అనబడుదురు. ఇది కుల సంబంధమయిన విషయముగాదు.

నాల్గు వేదములను చక్కగా అధ్యయనము గావించిన వానికి బ్రహ్మ అని పేరు. దేవులు అనబడు విద్వాంసులు బ్రహ్మ కంటె తక్కువ శ్రేణికి సంబంధించిన వారు.

బ్రహ్మతో సమానమయిన విద్యావంతురాలయిన అతని భార్యను బ్రాహ్మణి అందురు. అట్లే దేవశబ్ద నామమునకు అర్హుడైనట్టి వాని యొక్క భార్య విద్యావంతురాలై యుండెనేని ఆమె దేవి అని పిలువ బడును.

వీరందరిని, అనగా, బ్రహ్మ, బ్రాహ్మణి, దేవ, దేవి వీరిని సేవించుటయు, వీరితో సమానులగు (విద్యయందును, ప్రవర్తనము

నందును) వీరి పుత్రులను, శిష్యులను, సేవకులను సేవించుటయు కూడ తర్పణము అనబడును.

ఋషి తర్పణమనగా - బ్రహ్మజ్ఞానముతో శిష్యుల చదివించు వానిని, విద్యావంతురాలయి కన్యలకు విద్యాదానము జేయు బ్రాహ్మణిని, వారితో సమానులగు వారి పుత్రులను, శిష్యులను, సేవకులను సేవించుట యను శ్రాద్ధ తర్పణమునకు ఋషి తర్పణమని పేరు.

పితృతర్పణ మంత్రమును గ్రహించిన యెడల ఈ తాత్పర్యము వెల్లడియగును :

'బ్రహ్మ విద్యయందు పదార్థవిద్యయందు నిపుణులగు సోమసదులను, విద్యుదాది పదార్థముల గుర్తెరిగిన అగ్నిష్వాత్తులును, ఉత్తమవిద్యావంతులైనబర్హిషదులును, ఇతరుల ఐశ్వర్యమును రక్షించువారును, ఔషధములనిచ్చి యితరులరోగముల పోగొట్టు సోమపులుసు, సాత్వికాహారులయిన హవిర్భుజులును, విద్యావస్తువును రక్షించువారును, ఘృత దుగ్ధాదుల త్రాగు వారయిన అజ్యవులును, ధర్మము చేయుటకు సుఖరూపమగు సమయము గలవారయిన నుకావికులును, దుష్టులను దండించి శ్రేష్ఠులను పాలించు న్యాయకారులయిన యములును, సంతానమును అన్నముచేత సత్కారము జేయు జనకుడును, పితామహుడును ప్రపితామహుడును (వీరు బ్రతికియున్నవారే), అన్నముచేతను సత్కారముచేతను మాన్యము చేయునట్టి తల్లియును, పితామహిని ప్రపితామహిని (వీరును బ్రతికియున్న వారే) వీరందరును గాక తన భార్యను, అక్కలను, బంధువులను, తన గోత్రీకులను, ఇతర మహాపురుషులను, వృద్ధులను, అత్యంత శ్రద్ధతో ఉత్తమాన్న వస్త్ర సుందర యానము లిచ్చి, బాగుగా తృప్తిపరచుట'.

అనగా నేయే కర్మలచేత వారి ఆత్మ తృప్తినంది శరీరము స్వస్థమగు చున్నదో ఆయా కర్మలచే ప్రీతిపూర్వకముగా వారి సేవజేయుట శ్రాద్ధ

తర్పణ మనబడుచున్నది. గృహస్థుడు సాధ్యమైనంతవరకు తన భార్య (ధర్మపత్ని) సహాయమున పై నుదాహరింపబడిన శ్రాద్ధ తర్పణములను అనుదినము చేయవలయును. తరువాతనే అతడు భుజింప వలయును.

పై కార్యక్రమములు ఎంతటి దివ్యములో, సంఘ సౌభాగ్యము నకు ఎంతటి యుక్తములో గ్రహింపవలసినది.

సనాతన విషయముల పెడదారిన బెట్టువారు కొందరు, సనాతన ధర్మములు తప్పు అని పల్కువారు కొందరు సంఘమున నున్నారేగాని, శాస్త్రీయముగా ఆలోచించి, సనాతన ధర్మములు యుక్తములు అని జెప్పగలిగిన వారు లేరు. ఇది శోచనీయము !

ఎప్పుడయితే శ్రాద్ధ తర్పణములు మరణించిన వారికని మానవులు విశ్వసించుచున్నారో అప్పుడే మరణించిన వాని 'ఆత్మ' పరలోకములో నున్నదనియు, అది యితరజన్మలనెత్తుననియు మానవుడు నమ్ముచున్నాడు. ఈ నమ్మకము స్థిరపడినది. ఏదో ఆత్మ అనేది ఒకటున్నదని అనాది కాలమునుండి ఉన్న విశ్వాసమే. ఈ విశ్వాసమును పారద్రోలుటకు కొన్ని ఉపనిషత్తులయందు సర్వంతర్యామి, పరమాత్మ, బ్రహ్మము మొదలగు పదములు ప్రవేశపెట్టబడినను, అన్ని ఘటములలో వెలుగొందునది ఆ పరమాత్మయే యని చెప్పబడినను, నానావిధానూనరూపకుడై యొప్పుచు నుండునట్టిది ఆ సర్వంతర్యామి శక్తియైన ఈశ్వర శక్తియే నని తత్త్వత్రయ జ్ఞానమును నిరూపించుచు గీతాభాష్యకారుడైన రామానుజుడు బోధించియున్నాడు.

ఉపనిత్తులన్నియు ఒకే విధానమును జూపక పరస్పర విరుద్ధ భావములను గూడా చూపుచున్నవి. పండితుడు ఒక విధముగా భిన్నత్వములో ఏకత్వమనియు, ఏకత్వములో భిన్నత్వమనియు, సమర్థించు చుండును. దీనినైనను సక్రమ మార్గమున గమనించిన మంచిదే. విద్యుచ్ఛక్తి ఒక్కటైనను భిన్న భిన్న ఘటములయందు భిన్న

భిన్న తేజస్సును, పుటించుచున్నది. ఇది యేకత్వములో భిన్నత్వమునకు ఉదాహరణము. వివిధ ఘటములు, యంత్రములు ఒకే విద్యుచ్ఛక్తిచే వెలుగుచున్నను, పనిచేయుచున్నను, అవి వేరు వేరుగా కన్పట్టు చున్నవి. ఒక్కొక్కదానికి సామ్యత ఉన్నది; భేదమూ ఉన్నది. ఇది ఏకత్వమున భిన్నత్వమునకు ఉదాహరణము.

మొక్క మొలచును, పెరుగును. అందు ఒక విధమయిన శక్తి ఉత్పన్నమగు చుండును. పంచ భూతాత్మక శక్తి అది. ఈ చెట్టులోని శక్తికి, ఆ చెట్టులోని శక్తికి సామ్యత ఉన్నది, గుణమున, వేరువేరుగా ఉత్పన్నమయినను. అంతియేగాని ఒక మూలస్థానమునుండి ఆ శక్తి చెట్టులోనికి ప్రవేశించుటలేదు. విత్తనమునకు సరియైన భూమి (నేల), సత్తువ, నీరు, ఉష్ణము, వాయువు శూన్యప్రదేశము తగిన విధమున లభ్యమయినపుడు ప్రాణశక్తి, లేక పెరుగునట్టి శక్తి ఉత్పన్నమగును. ఈశక్తి యెంతగొప్పగా ఉత్పన్నమయిన అంత గొప్పగా చెట్టు ప్రబలును. ఆశక్తి క్షీణించినయెడల చెట్టుగూడా క్షీణించును. చెట్టుయొక్క వివిధ పోషకశక్తులు తగ్గినను ఆ శక్తి (జీవశక్తి) క్షీణించును. మానవశరీర విషయమును ఇంతియే. అన్ని వృక్షములకును, ప్రాణులకును, ప్రాణమున్నది. అనగా ప్రాణశక్తి యున్నది. మానవునకును అట్లే ప్రాణమున్నది. మానవుని యొక్క ప్రాణమున కున్న ఉత్కృష్టత, ప్రత్యేకత, విశిష్టత, యేమనగా మానవ మేధస్సునకు యెరుక (నేను-నాది) అను గుణమున్నది. ఈ యెరుకనే 'ఆత్మశక్తి' యని భావింపవలసి యున్నది. ఈ యెరుక యితర జంతువులకు లేదు. కోతి మొదలగు కొన్ని జంతువులకు కొద్దిగా ఉన్నట్లగపడును.

ప్రపంచమున వెలసిన ఆస్తిక మతములన్నియు వానికి పూర్వమున్న మూఢాచారములను యెదుర్కొని నట్టివే. కాని బహిర్గతముగా నేరుగా యెదుర్కొనలేక పోయినవి. సమరస భావముగా శాస్త్రీయ మార్గమును చూప ప్రయత్నించినను, అనాది మూఢ విశ్వాసముల యొక్క బలమున శాస్త్రీయ వాస్తవిక మార్గము మరల మరల అడుగంటుచు వచ్చినది.

'ఆత్మ' అనబడు దానిని గురించి, పరమాత్మ బ్రహ్మము అనబడు వానిని గూర్చియు, వేదములు ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు పలుపలు విధములుగా చెప్పుచున్నవని యనుటకు భాషవలననో, అన్వయము వలననో అస్కారము గలిగినను, హిందూమతమునకు సంబంధించి కడపటి నిబంధన అనదగిన భగవద్గీతలో విభూతి యోగమున, విశ్వరూప సందర్శన యోగమున నిర్దుష్టముగా సర్వ చరాచర జగత్తు, సర్వ అణువులు, వానిని గూర్చు శక్తి - అంతయును జగదాత్మ, ఈశ్వరశక్తి, వైష్ణవశక్తి అని శాస్త్రీయముగా చెప్పబడినను, ఒకప్రక్క గీతాపఠనము జరుపుచు, మరియొక ప్రక్క బహుదేవతా పూజలు, మూఢాచారములు పాటింపబడుచున్నవి గదా!

ప్రమిద, చమురు, వత్తి, చుట్టునున్న వాతావరణము అట్లున్నవి. దీపము వెలుగుచున్నది. తటాలున వాయువుయొక్క తీవ్రతకు దీపము ఆరిపోయినది. మంట యెక్కడికి పోయినది? ఎక్కడికీ పోలేదు. వత్తి మండుట ఆగినది, కొన్ని పరిస్థితులలో. అట్లే ప్రాణము, ప్రాణము యొక్క ఉత్కృష్ట గుణమైన ఆత్మ (యెరుక) మానవ శరీరమున కన్పడనపుడు ఆ శరీరము పనిచేయుట లేదు. ఆ శరీరము జీవించి యుండుటలేదు అని గమనింపదగి యున్నది.

మనము శాశ్వతముగా నీ ప్రపంచమున నుండుటలేదని యెక్కడనో, యెవరివద్దనో తెలిసికొనవలయునా? ఎవరికి తెలియదు యీ సత్యము? "జాతస్య మరణం ధృవమ్" అని శాస్త్రమున సంస్కృత వచనమును వల్లెవేయ వలయునా? ఈ ఆత్మజ్ఞానము (తన జీవమునకు సంబంధించిన జ్ఞానము) ప్రతి మానవునకును తన మనస్సునందే ఉత్పన్నమగు చున్నది గదా! పిచ్చివానికి యీ జ్ఞాన ముండదు. ప్రాణము మాత్రము జంతువు నందువలె నుండును. పిచ్చి వానికి ప్రాణశక్తి యున్నదిగాని, ఆత్మశక్తి (యెరుక) లేదు. ఇంత సులభమయిన విషయమును మానవపండితుడు క్లిష్టపరచుచునే వచ్చుచున్నాడు. మన జీవితము శాశ్వతము కాదు కాబట్టి, అందరు శాంతియుతముగా సుఖముగా ఆనందముగా జీవింపగలుగుటకు మానవునకు

నైతికమార్గము అవసరము. కావున ఏమతమయినను చూపునట్టి నైతికమార్గము సత్యమయినదే; ఆవశ్యకమయినదే. ఇదియే ఆత్మవిచారము అనదగినది.

పురాణకథలయందు వర్ణింపబడిన వైకుంఠమును లేదనుటకు బదులు ఆళ్వారులు తిరుమలను గూర్చి 'ఇదియే వైకుంఠము, ఇదియే పరమపదము అని శ్లాఘించియున్నారు. శ్రీరంగక్షేత్రమును గూడ ఆళ్వారులు అట్లే శ్లాఘించినారు. దీనిభావమేమి? ఈ ప్రపంచము నందే మనమెక్కడ ఆనందనిలయము నేర్పాటు జేసికున్నామో అదియే వైకుంఠము. వైకుంఠమనగా తెల్లని, స్వచ్ఛమైన, నిర్మల పవిత్రస్థలము అని భావము. మనస్సును నైర్మల్యముగా పెట్టుకొన గలిగినవాడు వైకుంఠవాసియే. అట్టివాని మానసిక తత్త్వమే వైకుంఠము. ఇట్టి నిర్వచనములను, వివరములను ప్రాజ్ఞులయినవారు చూపినను, మూఢ విశ్వాస వృక్షములయొక్క వ్రేళ్లు బలబడుచునే యున్నవి.

ఒక ఉపనిషత్తులో సర్వంతర్యామియగు వైష్ణవశక్తియే ఆత్మశక్తియని వర్ణింపబడగా మరియొక ఉపనిషత్తున మానవుడు మరణించునపుడు ఆతని శరీరముననున్న ఆత్మ చేతి బొటనవ్రేలి పరిమాణమున, సూక్ష్మరూపమున శరీరమును వదలి వెలుపలికి వెడలును అని చెప్పబడి యున్నది. ఇక మరియొక ఉపనిషత్తునందు (జడోపనిషత్తునందు) మానవుడు మరణించిన తరువాత ఆతని ఆత్మ దినదినము ఏయే ఊర్ధ్వలోకములను చేరుచుండునో, కడపట పదునొకండవ దినమున నెట్లు వైకుంఠమును ఆ యాత్మ చేరునో వర్ణింపబడి యున్నది. అందువలన ఈ జడోపనిషత్తు ననుసరించి మానవుని మరణా నంతరము నిత్యకర్మ పది దినములు కుమారుడు చేయడము, తరువాత పదునొకండవ దినమున వైకుంఠ సమారాధన జేయడము అను ఆచారము.

పాపములు జేసినవాని ఆత్మను కదా నిత్యకర్మలచే ఆయా లోకముల యందలి నరకముల నుండి తప్పింప వలసినది? మరణించిన వాడు పాపి యనియే కుమారుడు తలంచి నిత్య

కర్మములు చేయవలయును గదా? బహుశా తెలియక జేసిన పాపము లుండవచ్చును గదా అని సమర్థింతురేమో ?

ఈ విధముగా పరస్పర విరోధ భావముల వెదజల్లు యీ రచనల నన్నింటిని విశ్వసించుట యెట్లు? సమన్వయ పరచుటెట్లు? ప్రపంచములో అన్ని జాతులకు మతములకు వేర్వేరు పద్ధతులున్నవి గదా ?

మానవుడు ఒక ప్రమాణ రచననైనను పాటింపవలసి యున్నది గాన సర్వోపనిషత్సార మయిన భగవద్గీతయే ప్రామాణ్యముగా తీసికొన బడవలసియున్నది. ఈ గీతను గూడా జాగ్రత్తగా పఠించి, అందు శ్రీకృష్ణుని నిర్దేశములను వెదకి అనుసరింపవలసి యున్నది. ఏలననగా గీతాచార్యుడు తనకు ముందున్న రచనలము, విశ్వాసములను పరీక్షించి, సమన్వయపరచి, సత్యమును ప్రకటించి యున్నాడు కాబట్టి. శ్రీకృష్ణుడు సైతము ఆత్మనుగూర్చి తెల్పినభావమును ముందుగనే వెల్లడించి యున్నాను.

ఆత్మను గూర్చి పూర్వీకులేమని చెప్పినారు, దానిని గూర్చి తెలిసి కొనుటకు యోగులు, పండితులు, తార్కికులు ఎట్లు సతమత మవుచున్నారని విమర్శించుచు, గీతాచార్యుడు ఒక మాటలో "అది తెలియబడని విషయములే" అని కొట్టివేసినాడు కదా! కాబట్టి మానవునకు నైతిక దీవితమే శరణ్యము. (నైతిక విషయమును గూర్చి 5వ అధ్యాయమున విపులముగా చెప్పియున్నాను).

మన ఆధ్యాత్మిక రచనల యందెల్లను పంచ భూతములలో నీరు ఒకటి అనిఅన్నారేగాని, నీరుఅనుద్రవము రెండు వాయువుల యొక్క (ప్రాణవాయువు, ఉదజని యొక్క) సమ్మేళన పదార్థమని యెక్కడైనను తెలుపబడి యున్నదా? తాను నిత్యము త్రాగు నీటి యొక్క తత్త్వమునే గమనింపలేని మానవుడు (ఋషి గానిమ్ము, చదువరి గానిమ్ము) ఇక యేదో చూడబడని 'ఆత్మ' అను దానిని గూర్చి ఊహా ప్రంపంచమును సృష్టించుట, ఆ ఊహా ప్రపంచము యొక్క భౌగోళిక శాస్త్రమును నిర్మించుట యెంత వింతగా నున్నదో గ్రహింపుడు.

భగవచ్ఛక్తిని గూర్చి గీతయందు వర్ణించుచు సర్వము, చరాచర వస్తువులన్నియు, భగవచ్ఛక్తి యొక్క విభూతులని తెల్పుచు, మరియు ఆయా వస్తువుల విశిష్టతను గొప్పతనమును వర్ణించుచు విభూతి యోగమున - పర్వతములలో మేరువును నేను, నాగములలో శేషుడను నేను, మృగములలో సింహమును నేను, మానవులలో రాజును నేను అని అనేక విభూతులను తెల్పుచు నక్షత్రములలో చంద్రుడను నేను అని తెల్పినాడు గీతాచార్యుడు. కాబట్టి వ్యాసుడు ఆ కాలమునాటికి నక్షత్రములకంటె చంద్రుడు పెద్ద అనిభావించినట్లే కదా! అది యెంతటి అసత్య విషయమో యీనాడు మనము గమనింపగలము గదా! కంటికి అగపడు చున్నట్టియు దూరముగా నున్న గోళముల పరిమాణములను తెలిసికొనజాలని, ఊహింపజాలని మానవుడు శరీరస్థ మయినట్టియు అనిర్వచనీయమైన శక్తికి ఆత్మ అని పేరిడడము, దానికి రూపమును కల్గించడం, దాని ఉనికి, మార్పులను నిర్ణయించడం యెంతటి విడ్డూరమో ఆలోచింపుడు.

కాబట్టి ఆత్మవిచారము అను యీ అధ్యాయమున పాఠకుడు గమనింపదగు సత్యము ఒకటే - ఆత్మశక్తి అనిర్వచనీయము - అవాఙ్మానస గోచరము - ఇది శరీరమునందే ఉత్పన్నమై, శరీరము నశింపగా అదియును నశించును. కాని ఈఆత్మశక్తి పంచభూత సమ్మేళనమున యెల్లయెడల సర్వప్రాణులయందును ఉత్పన్న మగుచునే యున్నదిగాన, ఈశక్తి సర్వంతర్యామియేగాక, తరుగులేనిది. ఇట్టి జ్ఞానము ఇట్టి ఆత్మజ్ఞానము మానవుని సరియైన నైతికమార్గమునకు మరల్చును.

ఇది వాస్తవము - ఈ వాస్తవమును తెలిసికొనుడు - ఈ వాస్తవమును పాటింపుడు.

# 5. నైతిక మార్గము

ఈ వాస్తవము నెఱుగుము.

నైతిక జీవితమందు అన్ని మత గ్రంథములు సామ్యతను జూపు చున్నవి; పెద్దలను పూజింపుము; పిన్నల నాదరింపుము; అతిథి సత్కారము గావింపుము; సత్యము, దయ, సహనము, స్వార్థ రాహిత్యము, క్షమ, నిష్పక్షపాతము, మొదలగు సద్గుణములు అన్ని మతములకు సంబంధించిన గ్రంథములయందు సమానముగా చెప్పబడి యున్నవి; అన్ని జాతుల వారు పాటించుచున్నారు కూడ.

నైతిక జీవితము లేనిది సంఘమున క్రమశిక్షణ యుండజాలదు; సంఘమునకు, అభివృద్ధిలేదు; సంఘమునకు శాంతిలేదు; సుఖము లేదు, రక్షణ లేదు, ఆనందము లేదు. ఇహజీవితము నైతిక జీవితము నకు ముడిబడి యున్నది. ఇది మనము ప్రత్యక్షముగా చూచు విషయము.

భర్తృహరి సుభాషితము నందలి ఈ పద్యమును గమనింపుడు :

చ॥ శిథిలత లేనిభక్తి నతిసేయుదు వేల్పుల కాసుపర్వులన్
విధివశవర్తులా విధియు విశ్రుత కర్మ ఫల ప్రదాత య
య్యధిక ఫలంబు కర్మవశ మట్లగుటం బనియేమి వారిచే
విధికధికంబు కర్మమని వేమరు మ్రొక్కి భజింతు కర్మమున్ ॥

తాత్పర్యము : 'దేవతలకు మ్రొక్కెదగాక. కాని వారు సైతము సృష్టికర్తయగు బ్రహ్మదేవునకు లోబడినవారు. కావున ఆ పరమేశ్వరునకే మ్రొక్కెదను. కాని ఆ దేవుడు కర్మానుసారముగనే ఫలముల నిచ్చువాడు. కావున కర్మకే నమస్కారము జేసెదనుగాక. ఫలము కర్మల యొక్క పాప పుణ్యముల బట్టి లభించుచున్నవిగాన దేవుని తోడను, దేవతల తోడను నాకేమి పనియున్నది? దైవమునకంటే అధికమయినది విధ్యుక్త ధర్మ నిర్వహణమని గ్రహించిన నేను కర్మమునకే మ్రొక్కెదగాక!"

ఈ పద్యభావము మానవఆధ్యాత్మిక ప్రయాణ మార్గమును, దాని గమ్యస్థానమును శాస్త్రీయముగా, సత్యముగా, చక్కగా తెల్పుచున్నది. వివిధ ప్రకృతి శక్తులను ఆరాధించిన ఆదిమానవ జాతి యెన్నియో వేల సంవత్సరములకు ఒక్కొక్క ప్రకృతి శక్తికి ఒక్కొక్క అధిదైవతమును మానసికముగా సృష్టించుకొని, ఆరాధించుటకు మొదలిడినది. అన్నిమతములయందును గమనము గోచరమగు చున్నది. మనదేశమున అనాదిగా ప్రకృతిశక్తుల ఆరాధనము వేద కాలము నాటికి బహుదేవతా పూజకు వచ్చినది. అందువలన ప్రతి కార్యమునందును విఘ్నేశ్వర పూజ, అష్ట దిక్పాలకుల పూజ, నవగ్రహ పూజ, సప్తమహర్షి పూజ, త్రిమూర్తుల పూజ, కాళీ పూజ, త్రిదేవేరులకు పూజ మొదలగు అనేక విధములయిన పూజలతో బహుదేవతా పూజలు ప్రారంభమయినవి. ఈ దేవతలందరికిని బహువిధములయిన ఆలయములు, పూజావిధానములు ప్రబలినవి. ఇట్టి బహుదేవతా రాధనము ఉపనిషత్కాలమువరకు ఉండినది.

ఉపనిషత్కాలమునాటికి యీ బహుదేవతాప్రార్థనములు ఏకేశ్వరోపాసనమునకు వచ్చినవి. ఇది ఆధ్యాత్మిక ఆలోచన యందు గొప్ప మలుపు.

ఏకేశ్వరోపాసనము ఐరోపా ఖండమున జీసస్ క్రైస్తువు చేత రెండు వేల సంవత్సరముల క్రిందటను, అరేబియాదేశమున మహమ్మదుచే క్రీ.శ. 7వ శతాబ్దముననను ప్రబోధింప బడినది. ఏకేశ్వరోపాసనము ప్రపంచములో నెల్ల మనదేశముననే మొదట ప్రతిపాదింపబడినది. ఇతరదేశములయందు తరువాత కాలములయందు బహుదేవతా ఖండనము ఏకేశ్వరోపాసన ప్రబోధములు జరిగినను, తరువాత క్రమక్రమముగా ఆదేశములయందు ఏకేశ్వరోపాసనము స్థిరపడి, బహు దేవతా రాధనము మరుగున పడినది. మన దేశము యొక్క దౌర్భాగ్య మేమోగాని క్రీ.శ. పూర్వము ఎప్పుడో ఉపనిషత్కాలమున ఏకేశ్వరో పాసనము ప్రతిపాదింపబడినను యీ నాటికికూడా అన్ని విధములయిన

విభిన్న ఆరాధన క్రమములు, బహుదేవతా పూజలు, బహు దేవతాలయ నిర్మాణములు, బలులు, జాతరలు, గ్రామదేవత పూజలు, ప్రకృతి శక్తుల ఆరాధనము, తిరునాళ్లు, ఉత్సవములు అన్నియు కన్పడుచు ఐకమత్యమును సవాలు చేయుచున్నవి.

మనదేశమున వెలసిన ఆచార్యులలో మొదటివాడైన గీతాచార్యుడే (శ్రీకృష్ణుడే) మొట్టమొదటిసారిగా ఏకేశ్వర విషయమును గట్టిగా ప్రతిపాదించినాడు. ఉపనిషత్తులు యేకేశ్వరోపాసనను బోధించినను, వానిలో పరస్పర భిన్నాభిప్రాయములు వ్యక్తము చేయబడినందున, గీతాచార్యుడు వాని నన్నిటిని సమన్వయ పరచి, ఉపనిషత్సారముగా యేకేశ్వరోపాసనను గట్టిగా నొక్కి వక్కాణించి యున్నాడు. శ్రీకృష్ణుని తరువాత ఏకేశ్వరోపాసన ప్రబోధము సామాన్య ప్రజానీకమునకు అందలేదు. తరువాత ఏకేశ్వరోపాసనమును గట్టిగా ప్రకటించినది ద్వాదశాళ్వారులు (6, 7, 8 శతాబ్దములలో) ముని త్రయము వారు (11, 12 శతాబ్దములలో). మునిత్రయము వారనగా నాథముని, యామునాచార్యుడు, శ్రీరామానుజాచార్యులు అనువారు. వీరిలో కడపటి వాడయిన శ్రీరామానుజుడు ఏకేశ్వరోపాసన విషయమై గట్టి కృషి చేసినారు. శంకరాచార్యుల వారు అద్వైత సిద్ధాంతమును వెల్లడి జేసియు షణ్మత స్థాపనము గావించినారు. ఏ దేవతను ఆరాధించినను ఆ పరమేశ్వరుని ఆరాధించినట్లే అగునని చెప్పినారు. వారట్లు చేయుటలో నాటి సంఘవరిస్థితులు విభిన్న విశ్వాసములు, ఆచారములు కారణములయి యుండును. జంతుబలులు కూడవని చెప్పిన చాలమంది వివేకులు మనదేశమున మూఢులును, అజ్ఞానులును, క్రూరులును అయినవారిచేత చంపబడి యున్నారు. అన్ని సిద్ధాంతములలో వైష్ణవ సిద్ధాంతమే మన దేశమున ఏకేశ్వరోపాసనకు ఎక్కువ దోహదమిచ్చినది.

ఏకేశ్వరోపాసనము కొంత నెలకొనిన తరువాత మానవుడు కర్మ సిద్ధాంతము, కర్మఫల సిద్ధాంతమును లేవనెత్తినాడు. ఈ విషయములు భగవద్గీత యందు ఉన్నవి. వివేకి యయినవాడు కడకు సత్కర్మయే

అనుసరణీయ మనియు, సత్కర్మ ఫలము లభించునెడ యితర ధ్రువపడని మార్గము లెందులకని తలచి, తన విధ్యుక్త ధర్మమునకే మ్రొక్కి దానిని పాటించును. కావున భర్తృహరి నుండి గైకొనబడిన పై పద్యభావము మానవుని మూఢవిశ్వాసములనుండి తప్పించి, సత్కర్మాచరణమునకు అంకితుని జేయుచున్నది.

'ధ్యానాత్కర్మ ఫలత్యాగం శ్రేయోహి' అని గీత పల్కుచున్నది. తపస్సు కంటె పరోపకారార్థ జీవితము శ్రేష్ఠమయినదని చెప్పటలో తెలియని తపఃఫలము నాశించుట యెందులకు? పరోపకారివై నీవు శాంతిని బొంది సంఘమునకు శాంతిని కలుగజేయుము అను నీతి సూచింపబడుచున్నది.

భగవద్గీత యందు భక్తియోగమునందును, మరియు అనేక స్థలములయందును నైతికసిద్ధాంత ప్రాముఖ్యమే చూపబడినది. భక్తియోగమున 12, 13, 14, 15, 16, 17, 18, 19 శ్లోక భావముల గమనింపుడు. సద్గుణ సంపన్నునే భక్తుడుగా భావింపవలయును అని తేలుచున్నది - జపము, పూజలకు ప్రాధాన్య మివ్వబడలేదు. భక్తి యోగమును గూర్చి వ్రాయబడిన యీ గ్రంథములోని మొదటి వ్యాసమును మరియొకసారి పఠింపుము.

బహుశా నైతిక జీవితవిధానమునకు బహుళ ప్రచారమును గావించుటకు పరలోక విషయమును ఊతగా యేమైనా తీసికొన్నారా అని ఒక్కొక్క యెడ తోచుచున్నది.

ప్రహ్లాదుని చరిత్రయందును కవి ఒకతావున తొమ్మిది భక్తి మార్గములను దెల్పుచు - "ఈ తొమ్మిది భక్తి మార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు దైత్యోత్తమా" అని యనును. 'దైవమును నమ్మి సజ్జనుడవుగా నుండుము' అని భావము. దైవమును నమ్ముట అనగా సర్వంతర్యామి శక్తికి శరణాగతివి గమ్ము అని భావము. అనగా స్వార్థరహితుడవు గమ్ము అని తాత్పర్యము. తరువాత సజ్జనుడవుగా నుండుము అని

చెప్పబడినది. అనగా పరోపకార జీవితమునకు అంకితుడవగుము అని భావము. ఇదియే అతి ప్రాధాన్యమయిన విషయము. పరోపకార జీవితమునకు అంకితుడగుటకు మానవుడు మొదట స్వార్థరాహిత్య మను సుగుణమును గలిగి యుండవలయును గదా! కాబట్టి పూర్వులు మానవుని నైతిక జీవితమునకు మరల్చుటకు ఆధ్యాత్మిక చింతనము ఉపకరించునని తలంచి యుండిరవెూ! నిజమైన ఆధ్యాత్మిక చింతనము మానవుని తన అల్పత్వమును గమనించునట్లు జేయును. దీనికి ఫలితముగా మానవుడు అహంభావమును వదలి శరణాగతి భావమునకు వచ్చును.

'భగవంతుని పూజించుట అనగా భగవచ్ఛక్తి (ఆత్మశక్తి, ప్రాణశక్తి) గలిగియున్న సర్వ భూతములను ప్రేమించి, ఆదరించుట యగును. ఈ విశ్వాసముతో నెల్లప్పుడు స్వార్థరహితముగా సత్కర్మాచరణ యందుండుము' అని నిర్వచించిన యెడల ఈ సిద్ధాంతమును ఎవరు కాదనగలరు? ఏ మతస్థులు వ్యతిరేకించగలరు? నాస్తికులనబడు వారును, యధార్థవాదులనబడు వారుగాని కాదనగలరా? సర్వాంతర్యామియగు భగవచ్ఛక్తికి భగవద్గీతలో గూడాలేని ఒక రూపమును సృష్టించుకొనుట యేమి? ఆ దేవుడు లేడని గొప్ప వాదనలు తలయెత్తడమేమి? రెండును అపసవ్య ఆలోచనలే !

'భగవద్భక్తి అనగా సర్వభూతములను ప్రేమించుట' దాని అర్థ మంతే. తర్కము కొరకు సృష్టించిన అర్థముగాదు, ఒక పదమునకు లేని అర్థములను సృష్టించుకొని, ఆ అర్థముల విషయమై హిమాలయ పర్యంత తర్కవాదము లేల ?

కాబట్టి యోగశాస్త్రమునకు ప్రామాణ్య గ్రంథమని చెప్పబడు భగవద్గీతయందు నైతికమార్గమునుగూర్చి యెట్లుచెప్పబడినదో విశదముగా గ్రహింతము. ఇందు మోసము, డంబము, అసత్యముగాని లేదు. గ్రహించుట సులభము, వాస్తవము కాబట్టి. పాటింప ప్రయత్నింప దగినది, అసాధ్యముగాదు.

(భగవద్గీతలోని అధ్యాయ, శ్లోకముల సంఖ్యలు బేర్కొన బడినవి. విషయము ప్రధానము గాబట్టి శ్లోకముల యొక్క తాత్పర్యములనే వ్రాయడమయినది)

2-2. కర్తవ్య నిర్వహణమను విషమ సమయమున (పరీక్షా సమయమున) హృదయ కాలుష్యము పనికిరాదు.

2-3. విద్యుక్త ధర్మ నిర్వహణమున అతి నీచమైన పిరికితనము కూడదు.

2-14. శీతోష్ణస్థితుల వలె సుఖదుఃఖములు వచ్చుచు, పోవుచు నుండును. దృఢమైన మనస్సుతో వానిని సహింపుము. (15) అట్టి సమచిత్తుయడయిన ధీరునకే మోక్షమార్గము లభించును. (మోక్షమార్గ మనగా బంధవిముక్తి భావము, ఆనంద స్థితి).

2-31. ధర్మ విరుద్ధముగాని నీ స్వధర్మమును విడువరాదు.

2-46. జలసమృద్ధిగల బావినుండి స్నాన మాచరింపదలచిన వానికి యెంత నీరు అవసరమో, అంతవరకే వివేకవంతునకు సకల వేద విషయములయందు అవసరముండ గలదు. (అనగా గ్రుడ్డివాని వలె ఛాందసుని వలె ప్రతిఅక్షరమును పాటింప నవసరములేదు. స్వబుద్ధితో ఆలోచించి, విషయమును గమనించి, మంచిని పాటింప వలయుననెడి సూచన చేయబడినది).

2-47. కర్మ సన్యాసము తగదు. కర్మఫలత్యాగమును పాటింపుము. (కర్మ అనగా వాచాకర్మ, ఆలోచన కర్మ, సామాన్య కర్మ - యిందు దేనినైనను చేయుచు నుండ వలసినదే - సోమరితనము కూడదు - అని సూచింపబడినది.)

2-50. యోగము అనగా కర్మాచరణము నందలి నైపుణ్యము. (యోగమనగా ముక్కు మూసుకొని కూర్చొనుట అను మూఢ భావమును వదలుము - అని సూచింపబడినది.)

2-55. కోర్కెలను అదుపులో పెట్టుకొన గలిగినవాడు స్థితప్రజ్ఞుడన బడుచున్నాడు. (56) ఇట్టివాడు దుఃఖములు సంభవించినపుడు భగ్న హృదయుడు గాడు. సుఖములు గలిగినపుడు ఉప్పొంగడు. వ్యామోహము, భయము, కోపమును జయించిన వాడే స్థితప్రజ్ఞుడు. (స్థితప్రజ్ఞుడనగా స్థిరమైన ప్రజ్ఞ గలవాడు అని సూచింపబడినది. నీవు తీసికున్న నిర్ణయమునందు స్థిరచిత్తుడవుగా నుండి కార్యసిద్ధిని పొందవలయునని సూచింపబడినది.)

2-62, 63. ఇంద్రియలోలుడై విషయముల గూర్చి ఆలోచించు పురుషునకు వానియందు తగులుబాటు పొడమును. ఆ తగుల్బాటు వలన కామముదయించును. కామము (కోర్కె) వలన క్రోధము జనించును. క్రోదమువలన సమ్మోహము గలుగును. సమ్మోహము వలన స్మృతి తప్పును. స్మృతి తప్పుటవలన బుద్ధి నశించును. బుద్ధి నశించుట వలన తానే నశించును. (చిత్త వృత్తి యెంత నైపుణ్యముగా, యెంత వాస్తవముగా, యెంత శాస్త్రీయముగా, ఎంతటి అనుభవ సిద్ధముగా వర్ణింపబడియున్నదో గమనింపుడు. కోర్కెలు దుఃఖమునకు కారణములని సూచింపబడినది. కోర్కెలనగా నిచట దురాలోచన ములు, చెడ్డ కోర్కెలు అని భావము.)

2-66. స్థిరమయిన మనస్సు లేనివానికి బుద్ధి యుండదు. వానికి భావనయుండదు. అట్టి వానికి శాంతిలేదు. శాంతిలేని వానికి సుఖము లేదు.

2-72. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యము లనబడు అరిషడ్వర్గమును నిర్జింప గలుగుటయే బ్రహ్మనిష్ఠ అనబడును. దీనిని పొందినవాడు అవసాన కాలమందును బ్రహ్మానందమును బొందును. (బ్రహ్మ అనగా సర్వవేదములను పఠించి సక్రమముగా అర్థమును తెలుసుకున్న వాడు. అట్టి సుజ్ఞాని యొక్క జీవిత విధానమే బ్రహ్మనిష్ఠ. నిష్ఠ అనగా మడిగాదు, ఇందు మూఢాచారము లేదు).

3-13. దేవతలకు అర్పింపగా మిగిలిన వస్తు ఆహారముల ననుభవించు వారు పాప విముక్తులు. స్వోదర పోషనార్థము జీవించు

వాడు పాపియగును. (వివరణము - దేవతలనగా, దేవులనగా, తల్లి, తండ్రి, గురువు, పెద్దలు, సాయము చేసినవారు, అతిథులు మొదలగు వారు. ఎట్టి కార్యము చేయువానిని గాని, యితరులను గాని, సంతోష పెట్టదో అట్టి కార్యము పాపము అనబడును. ఎట్టి కార్యము చేయు వానినిగాని, యితరులను గాని, సంతోషపెట్టునో అయ్యది పుణ్యము అనబడును. దేవులు, దేవతలు, పరలోక, స్వర్గలోక వాసులనియు, వారికి నైవేద్యముల నర్పింప వలయుననియు మున్నగు మూఢా చారములకు ఇచట తావులేదు. దేవతలు, దేవులు అను పదమునకు సామాన్యార్థము యిట్లుండగా - కొందరు దేవతలున్నారనియు, కొందరు దేవతలు లేరనియు అజ్ఞానముగా వాదోపవాదములు చేసికొనుచు రెండు విధములైన అపసవ్య వాదనాను కూలము గొప్ప గొప్ప రచనలు జేయుచుందురు. వీరిద్దరు ఉగ్రవాదులే - వీరిద్దరు చీకటిలో నున్నవారే).

3-25. అవిద్వాంసులు స్వార్థపరులై స్వలాభము కొరకు కర్మల జేయుదురు. పండితుడైనవాడు స్వార్థరహితుడై లోకకల్యాణార్థము కార్యములు జేయును. (మహాత్మాగాంధీగారికి యీభావముగల శ్లోకము చాల ప్రియమయినది. కావున ఆ శ్లోకము ఇచట యివ్వడమయినది).

శ్లో॥ సక్తాః కర్మణ్య విద్వాంసో యథాకుర్వన్తి భరాత,
కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షుర్లోక సంగ్రహమ్.

4-28. కొందరు ద్రవ్య యజ్ఞపరులు, కొందరు తపోయజ్ఞపరులు, కొందరు వేదశాస్త్రపఠనా యజ్ఞపరులై యున్నారు. (ఇచ్చట యజ్ఞము అను దానిని మూఢముగా భావింప నవసరము లేదు. సర్వజన సేవ్యమయిన ఫలమునిచ్చు కార్యమునకు యజ్ఞమని పేరు. A productive work or project or a seminar or an experiment).

4-33. (ద్రవ్య యజ్ఞము అవసరమే జీవితమునకు) కాని ద్రవ్య యజ్ఞమున కంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠమయినది. ఎందువలననగా సకల కర్మములును జ్ఞానమున పరిసమాప్త మగుచున్నవి. (శ్రేయోహి

జ్ఞానమభ్యాసాత్ - అని చెప్పబడి యున్నది గీతయందే - ఏ కార్యము చేసినను, ఆ కార్యము వలన నెట్టి ద్రవ్యమును సంపాదింప గలిగినము, ఆకార్యాభ్యాసము వలన, స్వానుభవమున జ్ఞాన మార్జింపవలయును - మంచిచెడ్డలు గమనింప వలయును. కార్యము నందభివృద్ధిగాని, కార్యమునందు మార్పుగాని, కార్యౌచిత్యముగాని, కార్య అవసరమును గాని గమనింప గలుగుటయే జ్ఞానము. Experience & Knowledge).

4-38,39. (జ్ఞానము నార్జింపనివాడు పశుతుల్యుడు). జ్ఞానముతో సమానమైన పవిత్రవస్తువు ఈలోకమున లేదు. అట్టి జ్ఞానము సత్కర్మాచరణవలన సిద్ధించును. జ్ఞానమువలననే మనశ్శాంతి గలుగును. (Knowledge is power attained by actual experience).

4-40. అవివేకియు, శ్రద్ధారహితుడు అయిన సంశయాత్మనకు నాశనము తప్పదు. (A doubting Thomas can never success).

4-45. జ్ఞానయోగమును, కర్మయోగమున, ఒక్కటేయని గమనింప గలిగినవాడు సత్యమును గ్రహించిన వాడగును. (కర్మా చరణము వలననే కదా జ్ఞానము లభ్యమయ్యేది? శుష్కవేదాంత తమోభాస్కరులు కొందరు కర్మయోగము శ్రేష్ఠమయినదా, జ్ఞాన యోగము శ్రేష్ఠమయినదా అని తర్కవాదములు చేయును).

కర్మయోగమను అవలంబముచే కర్మఫల త్యాగబుద్ధివలన పొందిన జ్ఞానమువలన ధీరుడయిన మానవుడు కర్మలయందు బంధింపబడి యుండడు.

5-10. ఈశ్వరుడు ఒకని పాపమునుగాని పుణ్యమునుగాని తీసికొనడు. అజ్ఞానముచేత లోకులు ఊరక భ్రాంతిని జెందుచున్నారు. (ఇది మూఢ విశ్వాసులకు గొప్ప గొడ్డలి పెట్టు. సర్వాంతర్యామి యయిన ఈశ్వర శక్తికి మూర్తిత్వమును ఆపాదించి, ఈశ్వరుడని పుంలింగ వాచకము నేర్పరచి ఆ ఈశ్వరుడు మన పాపములను స్వీకరించునని కొందరు, ఆ ఈశ్వరుడు మన పాపముల హరింపజేయునని కొందరు,

ఆ ఈశ్వరుడు పాపుల క్షమించునని కొందరు, ఆ ఈశ్వరుడు మన పుణ్యకార్యములతో సంతోషపడునని కొందరు, ఆ ఈశ్వరుడు మన పుణ్యపాపములకు తగినఫలము నొసంగుననియు చెప్పు వివిధ మతస్థులయిన మూఢులకు ఎంతటి గొడ్డలిపెట్టుఅగునో విమర్శింపుడు).

5-18. (నిజమైన జ్ఞానికి, పండితునకు, సర్వము అభేదము - ప్రియాప్రియములు సమానములు అని యీ శ్లోకార్థమున చెప్పబడు చున్నది). విద్యా వినయ సంపన్నుడైన బ్రహ్మ జ్ఞాని యందును, గోవు నందును, ఏనుగు నందును, కుక్క యందును, కుక్క మాంసము తిను ఛండాలునందును సమభావము గలవాడే నిజమైన పండితుడు. (కేవలము భాషా జ్ఞానము గలిగి గ్రంథపరిచయము గలిగినవాడు పండితుడు గాడు. సమభావముగలవాడే పండితుడని సూచింప బడినది. మూఢముగా ఏదో కొంత భాషా జ్ఞానము గలవానిని పండితుడనుట తగదు - అని గీతాచార్యుడు సూచించుచున్నాడు. మూఢభావములను, మూఢాచారములను గీతాచార్యుడెట్లు ఖండించెనో గమనింపుడు).

5-22. బాహ్యములయిన విషయ భోగములు దుఃఖ హేతువులు, భోగములకు ఆది ఉన్నది, అంత్యమున్నది. సత్యజ్ఞానము శాశ్వత ఆనందము నిచ్చును. (భోగములు శాశ్వత సుఖము నివ్వవనియు, భోగములనగా శరీర భోగములనియు, శరీరమే క్షీణించి నాశనమగు పక్షమున శరీర భోగములెంత మాత్రమనియు, మానవుడు సత్యాన్వేషణ వలన జ్ఞానలబ్ధి వలన సంతృప్తి ఆనందముల బడయు ననియు గీతచార్యుడు సూచించుచున్నాడు. ఆహార సుఖమును గూడా కడపటి వరకు అనుభవింప గలిగిన వాడెవడు? వయస్సు, ఆరోగ్యము మొదలుగా గల పరిస్థితులున్నవి గదా - జీవించుట కొరకే ఆహారము; పరోపకారము కొరకే జీవితము అని గీతాచార్యుడు యెంతటి నీతిని బోధించినాడో గమనింపుడు).

6-16. (యోగమనగా కర్మయందలి కౌశలము అని యింతకు ముందు గ్రహించి యున్నాము కదా). మితభోజనము చేయువానికే యోగము సిద్ధించును. అతిగా నిద్రించువానికి గాని, ఎప్పుడును మేల్కొనియుండు వానికి గాని యోగము సిద్ధించదు. (యోగమనగా మనస్సును ఒక విషయముపైనగాని, ఒక కార్యముపైనగాని లగ్నము చేయుట యనియు, ద్వంద్వముల యెడ సమబుద్ధి గలిగి యుండుట యనియు గీతయందు చెప్పబడియే యున్నది. యోగమనగా యేదో ముక్కుమూనుకొని, తపస్సన ధ్యానమున నుండుటగాదని గీతాచార్యుడు మూఢ మానవులను కపట సన్యాసులను అపరిపక్వ పండితులను హెచ్చరించు చున్నారు).

6-46. కర్మఫలత్యాగి జ్ఞానులకంటెను, తాపసులకంటెను అధికుడు. ఇతడే పరమగతిని పొందువాడు. (కర్మఫలత్యాగి సంఘాభివృద్ధికి దోహదము చేయువాడు, జ్ఞానియయిన వాడు తానార్జించిన జ్ఞానమును పరోపకారార్థము పంచిపెట్ట వలయును. తాపసుడుకూడా తనధ్యానమున తానుఊహించిన సత్యమును సంఘమునకు పంచిపెట్ట వలయును. ఇట్టి పరోపకారులయిన జ్ఞానులు, తాపసులును కర్మఫల త్యాగులనియే చెప్పబడివలసి యున్నది. సత్కర్మాచరణమునకు యెంతటి ప్రాముఖ్యతను గీతాచార్యుడు ఆపాదించినాడో గమనింపుడు. బూటకపు మాటలయిన జ్ఞానము (ఇతరులకు పనికిరానిది) తపస్సు (ఇతరులకుపయోగ పడనిది) అను శబ్దములతో మానవులు మోసపోరాదని గీతాచార్యుడు వెల్లడించుచున్నాడు. సత్కర్మను అనవరతము చేయుమని ఉద్బోధించు చున్నాడు).

భగవద్గీతయందలి 7. విజ్ఞాన, 8. అక్షర పరబ్రహ్మ, 9. రాజవిద్యా రాజగుహ్య, 10. విభూతి, 11. విశ్వరూప సందర్శన యోగములందు అధ్యాత్మిక భావములు వెల్లిడింపబడి యున్నవి. నైతిక మార్గములు నేరుగా బాహటముగా చూపబడలేదు గాని, విచక్షణాజ్ఞానముతో పఠించిన ఆభావములు స్వార్థరాహిత్యతత్త్వమును తప్పక రేకెత్తించును.

(ఈ స్వార్థరాహిత్య తత్త్వమే కదా కర్మ ఫల త్యాగమునకు మూలకారణము?)

12-12. అభ్యాసమున కంటె జ్ఞానము శ్రేష్ఠమయినది. జ్ఞానము కంటే ధ్యానము శ్రేష్ఠమయినది. ధ్యానము కంటె కర్మఫల త్యాగము శ్రేష్ఠమయినది. ఎందువలననగా కర్మఫలత్యాగమువలన సంఘమునకు శాంతి, సుఖము, ఆనందములున్నవి.

12-13. సకల భూతముల యందును ద్వేషము లేక, వానియెడ మైత్రియు, దయము గలవాడై, మమకార అహంకారముల వదలి, సుఖ దుఃఖములయందు సమచిత్తుడుగా నుండి, క్షమాశీలుడైన వాడే నిజమైన భక్తుడు. (ప్రవర్తనకెంత ప్రాధాన్యత యివ్వబడినదో గ్రహింపుడు. గుణహీనుడై జపములు, తపములు, పూజలు పునస్కారములు పాటించువాడు భక్తుడుగాడు - అని భావము).

12-14. నిత్య సంతుష్టుడును, నియతాత్ముడును, దృఢ నిశ్చయుడును అగువాడు నిజమైన భక్తుడు.

12-15. ఎవ్వండు యితరులకు భయంకారి కాడో, ఎవ్వడు అజ్ఞానమున పిరికిపందగా నుండడో, అట్టి హర్షామర్ష భయోద్వేగ రహితుడు, నిజమైన భక్తుడు.

12-16. ఫలాపేక్షలేని వాడును, చిత్తశుద్ధిగల వాడును, సమర్థుడును, ఉదాసీనుడును, దుఃఖ రహితుడును, ప్రపత్తి భావము గలవాడును, అయిన సత్పురుషుడు నిజమైన భక్తుడు.

12-18. శత్రు మిత్రుల యందును, మానావమానముల యందును, శీతోష్ణముల యందును, సుఖదుఃఖముల యందును సమచిత్తుడై యున్నట్టివాడు నిజమైనభక్తుడు.

12-19. నిందలను స్తోత్రములను, సమానముగా తలచువాడును, లభ్యమయిన దానితో మౌనముగా తృప్తిజెందు వాడును, స్థిరచిత్తుడును, అగువాడు నిజమైన భక్తుడు. (ఈ విధముగా పంద్రెండవ అధ్యాయ

మయిన భక్తి యోగమునందు నీతి మార్గమే ప్రధానముగా చెప్పబడినది. ఈమధ్య ఒకానొక ఉదయకాలమున రేడియో ప్రసారము ద్వారా సూక్తి ముక్తావళి కార్యక్రమములో యీ క్రింది విధముగా విని నేను ఆశ్చర్య చకితుడనయితిని - "భగవంతుని బొందుటకు భక్తియోగము అతి సులభమయినది. భక్తునకు భగవంతుడు సులభముగా వశమగును. భగవద్గీతలోని యీ శ్లోకమును గమనింపుడు - శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం। యో మే భక్త్యాప్రయచ్ఛతి। తదహం భక్త్యుపహృత। మశ్నామి ప్రయతాన్మనః॥ అని భగవంతుడు చెప్పినాడు. వినుడు. ఎవ్వడేని నాకు పత్రమునో, పుష్పమునో, ఫలమునో, ఉదకమునో భక్తితో నమర్పించినయెడల నేను దానిని ప్రీతితోస్వీకరించి, అనుభవించెదను - అని యనును. భగవంతుడు - విన్నారా - ఎంత సులువో యీ భక్తిమార్గము! నీవు భోజనము చేసి, తాంబూలమును నీవే ఆనందముగా సేవించి, కృష్ణార్పణమస్తు, అని అన్నను, అది దేవునకే అంకితమై, దేవుడు తృప్తి జెందును! చూచారా భక్తియోగ మహిమ". ఇది నేను విన్న సూక్తి ముక్తావళి ఉపన్యాసము! నవ్వ వలయునో, ఏడ్వ వలయునో నాకు తోచలేదు. ఈ విధమయిన మార్గ దర్శకత్వము పామర ప్రజలను ఏ మార్గమును పట్టించునో ఆలోచింపుడు. అసలు ఆ శ్లోకము యొక్క సత్యమిది - భగవంతునకు ఒక వస్తువును అర్పించుట అనగా భగవచ్ఛక్తి హృదయములలో వెలుగుచున్న భూతకోటికి అర్పించుట అని భావము! భగవచ్ఛక్తి ఉనికి భూతకోటి హృదయాంతరాళములు గదా! భగవంతునకు ఒక వస్తువు సమర్పించుట అనగా ఫలానివాడని కాకుండా విచక్షణా రహితముగా ఎవ్వానికైనను యిచ్చి వానిని సంతోషపెట్టుట అని భావము.

ఈ సందర్భమున టాల్‌స్టాయ్ రచించిన ఒక చిన్న కథ జ్ఞప్తికి వచ్చుచున్నది - ఒక పాదరక్షలు కుట్టి జీవించువాడు ఒంటరి, ముదుసలి, దైవస్మరణ జేయుచుండువాడు. భగవత్సాక్షాత్కారమును కోరువాడు. ఒకనాటి రాత్రి భగవంతుడు అతనికి కలలో కనపడి, "రేపు నేను నీయింటికి స్వయముగా వచ్చి ఆతిథ్యమును స్వీకరించెదను"

అని చెప్పెను. అత్యానందముతో మరునాడు వేకువనే లేచి, తన చిన్న గృహమును శుభ్రము జేసికొని, ఫల పుష్పాదులను సేకరించి పెట్టి, తాను ప్రాతఃకాల ఆహారమును గూడ తీసికొనక ఆతురతతో వీధివైపు జూచుచు, తన యింటి ద్వారము వద్ద కూర్చొని కాచుకొని యుండెను. లేచినను, అటునిటు జూచినను, రోడ్డున నడచిరాగల దేవుని తప్పొదు నేమోనని అతడు తలంచి అట్లనే ఏకాగ్రతతో దారినబోవు ప్రతి వ్యక్తిని పరికించి చూచుచుండెను. ప్రతి వ్యక్తిని, కొంత ఆడంబరముగా కన్పడిన ప్రతి వ్యక్తిని చూచి ఆ క్షణమున తన ఆతురతలో దేవుడేమోనని తలచి కన్నులు విశాలముగా తెరచి చూచుచుండువాడు. ఉదయము 8 గంటలప్పుడు ఒక కుంటివాడు భిక్షాటనముగా తనయింటి ద్వారమును సమీపించుచుండెను. సామాన్యముగా భిక్ష నొసంగు నీతడు ఈనాడు దేవుని ఆగమనమును నిరీక్షించుచు ఏకాగ్రతతో కూర్చొని యుండెనుగాన, భిక్షను తెచ్చి యివ్వ తీరికలేనివాడై, పొమ్మని చెప్పి పంపెను. తరువాత యెవరును తన గృహ ద్వారమువైపు రాలేదు. మధ్యాహ్నము ఒంటి గంటప్పుడు ఒక కుష్ఠురోగి తన గృహ ద్వారమును సమీపించుచుండ, విసుగుతో ఆతని పంపివేసెను. దేవుని యేకాగ్రతతో వేచియుండవలసి యున్నందున ఉదయ భోజనము లేదు, మధ్యాహ్న భోజనము లేదు ఆతనికి. అట్లనే కూర్చొని యున్నాడు. సాయంకాలము 6 గంటలు కావచ్చినది. సూర్యాస్తమయ మగుచున్నది. మంచు దట్టముగా పడుటచే చాల చలిగా నున్నది. అసలు అది చలిదేశము, దానికితోడు శీతాకాలము. అస్తమాన మగుచున్నది. చీకటికి ముందు మంచు, మసక అలముకొన్నవి. చూపు తగ్గుచున్నది మన కథా నాయకునకు. కండ్లు పొడుచుకొని వీధివైపు చూచుచున్నాడు దేవుని ఆగమనము కొరకు. చలిబాధ కోర్వలేక గడగడ వణకుచు అర్ధ అంగవస్త్రమున తూలియాడుచు ఒక శతవృద్ధు తన నీరసపు శరీరమును లాగుకొనుచు, క్రిందపడి పోవునట్లు వంగివంగి అడుగుల నిడుచు యింటి ద్వారమువైపు వచ్చుచుండెను. అతి విసుగుతో అతనిని ముదుసలి పొమ్మనెను. చీకటి పడినది - దేవుడు రాలేదు - ఇక

వచ్చునని ఆశలేదు. ఉదయము 6 గంటలు మొదలు సాయంకాలము ఆరు గంటలలోపల వత్తునని కదా దేవుడు ఆతనికి కలలో కన్పడి చెప్పినాడు? ముదుసలి గృహస్థుడు ఆశాభంగముననను, ఆహారము తీసికొననందునను, నీరసముగా దుఃఖముగా తయారయి, యిక వేచియుండుట నిష్ప్రయోజనమని తలచి, రాత్రి భోజనము గూడ మాని, ఆనాడు సంపూర్ణ ఉపవాసమును పాటించినవాడై, కొన ఆశతో తన యింటివాకిలి తలుపును మూసి, గడివేయకుండా లోన తలుపున కానుకొని తన కుక్కిమంచమున వాలెను. ఒకవేళ దేవుడు వచ్చినచో తలుపుతట్టి నట్లయిన, వెంటనే తలుపుదీసి దేవుని ఆహ్వానింప దలంచి, ఆలోచించుచు పండుకొని యుండెను. దీపము ఆర్పలేదు, దీపము సమీపమున ఉదయము దెచ్చిన ఫల పుష్పాదులు కళావిహీనముగా పడియున్నవి. బడలికతో ముదుసలి కన్ను మూసినాడు. గాఢ నిద్ర పోయినాడు. కలలో దేవుడు మరలా కన్పడి - "నేను నీ యింటికి నేను చెప్పిన విధమున వచ్చినాను. నీవు తరిమినను మూడు మార్లు వచ్చినాను. ఇక నేనేమి చేయగలను? నీవు అనాదరించితివి, నన్ను వెడలి పొమ్మంటివి" అని దేవుడన్నాడు. ఉలిక్కిపడి ముదుసలి నిద్ర లేచినాడు. తెల్లవారినది - సూర్యోదయము కావచ్చుచున్నది. మరచి నిద్ర పోయినాడు. సామాన్యముగా వేకువనే లేచువాడు, ఈనాడు ఆలస్యముగా పడకనుండి లేచినాడు. తన అజ్ఞానమునకు దిగ్భ్రమ జెందినాడు. దరిద్ర నారాయణుని గుర్తింపలేక పోయినాడు. జరిగిన అనుభవమును బట్టి దేవుడనగా యెవరో తెలిసికున్నాడు. ఆతనికి జ్ఞానోదయ మయినది !

13-30. ప్రకృతి చేతనే యెల్ల విధములగు కర్మలు చేయబడును - అని తెలిసికొన్నవాడు ఆత్మ దేనికిని కర్తగాదు అని తెలిసికొనును. (ప్రకృతి రెండు విధములని గీతయందు వేరొకచోట చెప్పబడినది - బాహ్య ప్రకృతి - అంతర్గత ప్రకృతి - అని. మనకు అగపడు యీ ఘటములు, ప్రాణులు, వృక్ష సంపద, వేయేల ఈ పంచ భూతాత్మక మయిన జగత్తంతయు బాహ్యప్రకృతి. మన శరీరము బాహ్యప్రకృతి.

శరీరాంతర్గతమై యున్న ప్రాణశక్తి, ఆత్మశక్తి అనునది అంతర్ప్రకృతి. స్పర్శజ్ఞానము, దానికి మించిన యెరుక (ఇది నాది-నేను - అను భావము) అనునది ఆత్మ లేక ఆత్మభావము. ప్రకృతి పరిస్థితుల ననుసరించి, పరిసరముల ననుసరించి, ఉత్పన్నమగుచున్న నూతన పరిస్థితుల ననుసరించి మనస్సుయొక్క ప్రోద్బలముచేత శరీరము అనేక కార్యములు చేయుచుండును. కర్మలు జేయునది శరీరమే. కర్మలు జేయునది యేదో ఆత్మఅనుట సరియైనదికాదు. కర్మ ఫలితములును శరీరమునకు - శరీర అంతర్గతమయిన ఆత్మ శక్తి, లేక, యెరుక అనునది శరీర కష్టసుఖములను అనుభవించుచున్నది. శరీరమునుండి ఉత్పన్నమయిన ఈ ఆత్మశక్తి శరీరమునందే యుండి, శరీరముపై నాధారపడియుండి, శరీరమును భక్షించుచు, శరీరము యొక్క కష్టసుఖముల ననుభవించుచు, శరీరము నశింపగా అదియును నశించును. ఈవిధముగా చెప్పబడుటచే మూఢ విశ్వాసులు భావించినట్లు సర్వకర్మలకు ఆత్మకారణ భూతము అను విశ్వాసమును తొలగించుచు, సత్ప్రవర్తన యొక్క ప్రాముఖ్యము చూపబడుచున్నది.)

14-5. సత్త్వము, రజస్సు, తమస్సు అను త్రిగుణములు ప్రకృతి జన్య గుణములు (శరీరము యొక్క ప్రకృతి బట్టి ఆయా వ్యక్తి ఆయా కార్యములకు ప్రోత్సహింపబడు చున్నాడు - ఆయా గుణముల గలిగి యున్నాడు). ఈ త్రిగుణములు ఆత్మను నిబంధించుచున్నవి - కర్మలు చేయునెడ, మాట్లాడునెడ, ఆలోచించునెడ (ఈ విషయము శరీర శాస్త్రమును, మనోతత్త్వ శాస్త్రమును పోషించుచున్నది).

15. పురుషోత్తమ ప్రాప్తియోగమున ప్రర్తన, నైతిక మార్గమును గురించిన విషయములు లెవు.

16-1,2,3. (మానవ గుణములు రెండు విధములు - దేవగుణములు, రాక్షసగుణములు - అని) నిర్భయము, చిత్తశుద్ధి, జ్ఞానయోగనిష్ఠ, దానము, దమము, యజ్ఞము, వేదశాస్త్ర జ్ఞానము, తపస్సు, నిష్కపట ప్రవర్తనము, అహింస, సత్యము, భూతదయ, లోభ

రాహిత్యము, మృదుత్వము, సిగ్గు, జంకు (చెడ్డ చేయుటకు) తేజస్సు, ఓర్పు, ధైర్యము, శౌచము, ద్రోహచింతనా రాహిత్యము, సదభిమానము, మొదలయిన వాంఛనీయమగు సద్గుణములు దైవగుణములు. (దైవ గుణములు గలవారు సత్కార్యములు పరోపకారార్థము జేయుదురు).

16-4. దంభము, దర్పము, దురభిమానము, క్రోధము, పారుష్యము, అజ్ఞానము, శౌచ సత్య రాహిత్యము మొదలగునవి రాక్షస గుణములు.

16-12 మొదలు 18 వరకు - రాక్షసగుణ ప్రధానులు ఆశాపాశ బద్ధులై, కామక్రోధపరులై, కామోపభోగముల కొరకు అన్యాయపద్ధతితో ధనార్జనము చేయగోరుచుందురు. 'ఇప్పుడీ కోర్కె సిద్ధించినది; ఇంతలో నీ కోర్కెను బడయగలను. ఇదిగో యీ ధనము ఇప్పుడున్నది; త్వరలో యెక్కువ ధనము చేరగలదు. ఈ శత్రువునిపుడు అంత మొందించితిని. ఇతరులను గూడ ఈలోపల తుదముట్టించెదను. నేను స్వతంత్రుడను, నేను భోగిని, నేను సిద్ధుడను, నేను బలవంతుడను, నేను సౌఖ్యవంతుడను, నేను ధన్యాత్ముడను, నేను గొప్ప వంశస్థుడను, నాకు సమానుడెవడు? నేను యజ్ఞములు చేయించినాను, నేను యెన్నియో దానములు చేసినాను', అని డంబములు కొట్టుచు, మోహమనెడి వలలో చిక్కుకొని, తుదకు కామక్రోధములందు తగుల్కొని, నరకమున బడుదురు. ఈ రాక్షస గుణ ప్రధానులు తమ్ము తామే మెచ్చుకొనుచు, మొద్దుబారిన చిత్తములతో ధనమాన మదా విష్టులై, యేవేని యజ్ఞములను పేరునకు దంభాచారముగా జరిపించు చుందురు. అహంకారము, బలము, గర్వము, కామక్రోధాది దుర్గుణముల నవలంబించి, అసూయాపరులై వర్తింతురు. వీరు అధోగతినే పొందుదురు. (సత్ప్రవర్తన అవసరము నెంతయో జెప్పి, గీతాచార్యుడు దుష్ప్రవర్తనను వివరించి మనము ఆ ప్రవర్తనను ఏవగించు కొనగలందులకు సూచనల నిచ్చినాడు. ఇచ్చట నరకము అనగా దుఃఖము, బాధ అని అర్థము.

16-24. ఇది కార్యము, ఇది అకార్యము అను భేదమును తెలిసికొని, శాస్త్ర ప్రమాణమున గాని, యోగ్యుడయిన ఆదర్శపురుషుని జూచిగాని, కర్మలు జేయవలయును. (అనాలోచితముగ, విచక్షణా రహితముగ, రాబోవు ఫలితమును ఊహించుకొనకుండు కార్యములు చేయరాదని గీతాచార్యుడు సూచించుచున్నాడు.

17-2,3,4. (మానవులు శ్రద్ధతో కార్యములు చేయవలయును గదా). మానవులకు స్వాభావికముగా శ్రద్ధ మూడు విధములు - సాత్త్విక శ్రద్ధ, రాజస శ్రద్ధ, తామస శ్రద్ధ. సాత్త్వికులు ప్రకృతి శక్తులకు దేవతలని భావింపబడు ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, మొదలుగాగల దేవతలను పూజింతురు. రాజసులు యక్షరాక్షసులను పూజింతురు. తామసులు చచ్చినవారిని, భూతగణమును పూజింతురు.

17-5,6. ఎవ్వరయితే దంభ అహంకార సంయుక్తులై శాస్త్ర విరుద్ధమయిన ఘోర తపస్సు చేయుదురో, శరీరమును కృశింపజేసి ఆత్మను బాధింతురో వారు అసుర నిశ్చయులని తెలియబడు చున్నారు. (ఇచ్చట గీతాచార్యుడు మూఢవిశ్వాసములను, మూఢాచారములను, దాంభికాచారములను సూక్ష్మముగా సూటిగా వ్యతిరేకించు చున్నాడు. తపస్సు అనునది అన్నిటికంటే ఉత్తమోత్తమమయిన చర్య అని గదా పురాణములందు వర్ణింపబడినది?)

17-7. సర్వులకును ఆహారము, యజ్ఞము, తపస్సు, దానము అనునవి అవసరములే. అవి మూడు విధములుగా నున్నవి. (ఈ విషయములను శాస్త్రీయముగ అర్థయుక్తముగ, అనుసర ణీయములుగ గీతాచార్యుడు క్రింది శ్లోకములందు వర్ణించుచున్నాడు.

17-8,9,10. ఆయుస్సత్త్వ బలారోగ్యముల వృద్ధిజేయునవియు, సుఖమును ప్రీతిని కలుగజేయునవియు, రసవంతములును, ఉచితములును, మనోహరములును అయిన ఆహారములు సాత్త్వికాహారములు.

చేదు, పులుపు, ఉప్పు మించినవియై, మిగుల వేడిమియు, తీక్షణతగలవియై,మొరటులై, విదాహకారులై, దుఃఖశోకములను రోగములను పుట్టించు ఆహారములు రాజసులకు ప్రియములు.

జాములు గడచినవియు, రుచి దప్పినవియు, దుర్వాసన గలవియు, దినము గడచినవియు, ఎంగిలి పడినవియు, అపరిశుద్ధ మయినవియు, అయిన ఆహారములు తామసులకు ప్రియమైనవి.

(సత్వ, రజ, స్తమమలను ఆహార విభజనమును ఉత్తమ, మధ్యమ, అధమములని చెప్పవచ్చును - సాత్వికాహారము శరీర పోషణమునకును బుద్ధికుశలతకు దోహదము చేయునుగాన సాత్వికాహారమును తీసికొనవలయునని గీతాచార్యుడు సూచించు చున్నాడు.)

(ఆహార విషయమయిన తరువాత గీతాచార్యుడు యజ్ఞమును గూర్చి చెప్పుచున్నాడు.)

17-11,12,13. (యజ్ఞమనగా ఫలప్రదమయిన కార్యము. ఇది శుభస్కరము, లాభదాయకము అయినది. యజ్ఞములు గూడ సత్వము, రజస్సు, తామసములని మూడు విధములు. వీనిని కూడా ఉత్తమ, మధ్యమ, అధమములని చెప్పవచ్చును.)

కర్తవ్య కారణమున ఫలాకాంక్ష రహితముగా విధి విహితమయిన యే కార్యము మనఃప్రసాదముగా చేయబడుచున్నదో అట్టి కార్యము సాత్విక యజ్ఞ మనబడును. (లోక కల్యాణార్థము చేయబడు కార్యము సాత్వికయజ్ఞమని భావింపవలసియున్నది).

స్వార్థము కొరకు, ఫలాకాంక్షతోగాని, లోకవంచనము కొరకుగాని చేయబడు కార్యము రాజస యజ్ఞము.

విధి విహీనమై, మంత్రహీనమై (తగిన సలహా, దర్శకత్వము లేక) యే కార్యము శ్రద్ధారహితముగా చేయబడుచున్నదో అట్టిది తామస యజ్ఞమనబడును.

(పైన ఉదహరింపబడిన మూడు విధములయిన యజ్ఞములను ఉత్తమ, మధ్యమ, అధమ కార్యములుగా భావింపవచ్చును. యజ్ఞము అనగా సామాన్యముగా మానవులు ఎట్టి మూఢ భావములు గలిగి యున్నారో, పురాణముల యందును ఎట్టి మూఢమయిన భావములు వెల్లడి చేయబడినవో, గీతాచార్యుడు యజ్ఞము అను పదమును యెంత శాస్త్రీయముగా నిర్వచించి విపులీకరించి యున్నాడో గమనింపుడు. యజ్ఞములు మూడు విధములని అనుటలో ఉత్తమ, మధ్యమ, అధమములయిన మానవులు చేయు కార్యములు, వారి యుద్దేశములు తెలుపబడు చున్నవి.)

17-14,15,16. (తపస్సు మూడు విధములని గీతాచార్యుడు చెప్పెను - శారీరక తపస్సు, వాక్తపస్సు, మానసిక తపస్సు - అని).

బ్రహ్మజ్ఞానులను, పెద్దలను, విద్వాంసులను, పూజించుటయు, శుచిత్వము, నిష్కపట వర్తనము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరక తపస్సు అనబడును.

ఇతరులకు తొందరపాటు గలిగింపనిదై, సత్యమును, ప్రియమును, హితమును, అనువాక్యములు పలుకుటయును, వేదశాస్త్రపఠనము అనునవి వాక్ తపస్సు అనబడును.

మనో నైర్మల్యమును, సౌమ్యతయు, మౌనమును, స్వభావ వేగమును నిరోధించగల చిత్తశుద్ధియు, అనునవి మానసిక తపస్సు అనబడును.

(సాత్త్విక తపస్సు శారీరకముగాను, వాగ్రూపముగాను, మానసికముగాను ఎట్లు పాటింపవలయునో గీతాచార్యుడు యెంత రమణీయముగా తెల్పియున్నారో గమనింపుడు. మన ప్రవర్తన యెట్లుండవలయునో గీతాచార్యుడు ఇట్లు నిర్దేశించి యున్నాడు. మూఢాచారముగా, మూఢవిశ్వాసముగా, దంభముగా నొనరించు తపస్సునకును, వాస్తవముగా తపస్సును పాటించు విధానమునకు గల తారతమ్యమును గీతాచార్యుడు వివరించినాడు. మన ప్రవర్తనకు గీతాచార్యుని నిర్వచనములు మార్గదర్శకములు).

17-17,18,19. (మరియు తపస్సు మూడు విధములుగా చెప్పబడుచున్నది.)

నియత మనస్కులై, ఫలాకాంక్ష లేక చేయు తపస్సు సాత్త్విక తపస్సు. సత్కారము కొరకో, తన గొప్పకొరకో, పూజ కొరకో, దాంభికముగా చేయబడు తపస్సు రాజస తపస్సు అనబడుచున్నది. తన అవివేకముచే ప్రారంభింపబడి, తనకే బాధాకరముగా తయారై, సర్వవినాశనము కొరకు చేయబడు తపస్సు తామస తపస్సు అనబడును.

(పై తపస్సులు ఉత్తమ, మధ్యమ, అధమ తపస్సులనియు చెప్పబడును. శారీరక, వాగ్రూప, మానసిక తపస్సులు మూటియందును ప్రతిదానియందును పై నుదహరింపబడిన విధముగా మూడు విధములని తెలియనగును).

17-20,21,22. దానములు మూడు విధములు. కర్తవ్య భావమున, దేశకాల పాత్రలనెరిగి, పరోపకారము కొరకు, ప్రత్యుపకారముకొరకు చేయుదానము సాత్త్విక దానమనబడును.

పరోపకారము కొరకు గానట్టియు, ప్రత్యుపకారము కొరకైనట్టియు ఫలము నుద్దేశించిగాని, లోలోన బాధపడుచుచేయుదానము రాజస దానము అనబడును.

దేశకాల పాత్రల గ్రహింపక, సత్కారముచూపక, పరిభవ పురస్సరముగా అపాత్రులయినవారికి, దుష్కార్యములకొరకు ఇవ్వబడు దానము తామసిక దానము అనబడుచున్నది.

(ప్రవర్తనకు సంబంధించి సజ్జనుడు సాత్త్విక తపస్సును, సాత్త్విక యజ్ఞమును, సాత్త్విక దానమును చేయవలయునని గీతాచార్యుడు సూచించుచున్నాడు. తపస్సు, యజ్ఞము, దానము అను వానిని గూర్చిన మూఢ భావములను పారద్రోలి గీతాచార్యుడు శాస్త్రీయమైనట్టియు, వాస్తవమైనట్టియు, వ్యక్తికి సంఘమునకును క్షేమమును కలుగజేయు నట్టియు ప్రవర్తనను గీతాచార్యుడు సూచించుచున్నాడు. భగవద్గీత

మానవుల ప్రవర్తనను సక్రమపరచుటకే నిర్దేశింపబడినదని గుర్తింప వలసియున్నది. సాత్త్విక, రాజసిక, తామసిక అను పదములు ఎల్ల యెడలను ఉత్తమ, మధ్యమ, అధమ జాతి మానవులకును, వారు చేయు కార్యములకును సంబంధించినవని గ్రహింపవలసి యున్నది.)

18-2. కామ్య కర్మల యొక్క పరిత్యాగము సన్యాసమని పెద్దలు చెప్పుదురు. సకలకర్మలయొక్క పరిత్యాగము త్యాగమని విమర్శకు లందురు. (ఇచ్చట త్యాగమనగా కర్మఫల త్యాగమనియే గమనింప వలయును. ఇది లోక కల్యాణము కొరకైన స్వార్థరహిత త్యాగము.)

18-3. దోషయుక్త మయిన కర్మల పరిత్యజింపదగునని విద్వాంసు లందురు. యజ్ఞము, దానము, తపస్సు అను నీ సాత్త్వికకర్మ త్రయమును విడువదగినవి కావని కొందరందురు. (యజ్ఞ దాన తపముల గూర్చి అంతకుముందున్న రచనల యందు పెద్దలు (ఋషులు) విమర్శకులు, పండితులు, ఆలోచనా పరులు (పరిశీలకులు) ఆయా విధములుగా నుడివి యున్నారని గీతాచార్యుడు తన వేదశాస్త్ర జ్ఞానమును వెల్లడించుచు, తన దివ్యోద్దేశములను సంక్షిప్తముగా నిట్లు వక్కాణించు చున్నాడు. ఈ విధముగా గీతాపఠనమున సత్యమును విమర్శించి గమనింప వలయును.)

యజ్ఞదాన తపో రూపమయిన సత్కర్మ పరోపకారార్థమయినది గాన యెల్లప్పుడును చేయదగినది. ఇవి చిత్తశుద్ధిని కలుగజేయును. వీనిని స్వార్థరహితముగా చేయవలయును.

18-7, 11. (కర్మలను చేయకుండుట కర్మ సన్యాసమనబడును. ఇది కేవలము సోమరితనమే యగును. గీతాచార్యుడు శ్రీకృష్ణుడేమను చున్నాడో గ్రహింపుడు).

స్వభావసిద్ధముగా అవసరమయిన కర్మను సన్యసించుట సాధ్యము కాదు. ఒకవేళ అజ్ఞానముచే కర్మను వదలిన అది తామస చేష్టిత మనబడుచున్నది. దేహధారికి సర్వకర్మ పరిత్యాగము

శక్యముగాదు. కావున ఎవ్వడు కర్మలయొక్క ఫలమును మాత్రమే పరిత్యజించునో వాడే త్యాగియని చెప్పబడును.

(శ్రీకృష్ణుడు పర్యవసానముగా యజ్ఞదాన తపస్సులను గూర్చి యెట్లు కడపట తనఉద్దేశము నిచ్చినాడో యిదియెంతటి విశిష్ట మయినదో పాఠకులు గమనింపవలసి యున్నది. సత్ప్రవర్తనను గూర్చి గీతయందు చర్విత చర్వణముగా చెప్పబడినది. ఇందులకు కారణము గీతాచార్యుడు కర్మాచరణమునకు అపాదింపదలచిన ప్రాముఖ్యమే కారణము).

18-14. కర్మ సాఫల్యమునకు 5 కారణములున్నవి. ఇందుల కుదాహరణముగా భూవ్యవసాయమును గమనింతము.

1) కర్మప్రయోగ స్థానము - (వ్యవసాయ భూమి)

2) కర్మ చేయువాడు - (వ్యవసాయదారుడు)

3) సాధనచయము - (నాగలి, మొదలగు పనిముట్లు)

4) నానావిధ చేష్టితము - (దున్నుట, విత్తుట, పెంచుట, మొదలగునవి)

5) దైవము - అనిర్వచనీయమయిన ఈశ్వర శక్తి, జీవశక్తి)

(ఇదే విధమున మానవుడు తలపెట్టు ఏ కార్యమునకైనను యీ అయిదు అంశములు సక్రమముగా ఉన్నప్పుడే కార్య సాఫల్యమగును. ఈ అయిదు అంశములను గమనింపక కార్యముచేయ సంకల్పించు వాడు వ్యర్థుడగునని గీతాచార్యుడు సూచించుచున్నాడు.)

18-16. కర్మగతి యిట్టిదైయుండగా వివేకహీనుడు కేవలము ఆత్మ యొక్కటియే కర్తయనుచు తలంచుచున్నాడు. ఇట్టివాడు కర్మ జ్ఞానమున గ్రుడ్డివాడు. ('ఆత్మ' అనబడు దానికి యేదేదో ప్రాముఖ్యత నాపాదించు మూఢులయిన పూర్వాచార పరాయణులకు యిది యొక

హెచ్చరిక. శ్రీకృష్ణుని విమర్శనాజ్ఞానము ఎంతటి విశిష్టమయినదో, వాస్తవవాద ప్రేరకమో గమనింపుడు.)

18-23,24,25. (కర్మ సన్యాసము సాధ్యము కానిదని యిది వరలో చెప్పబడినది గదా! కర్మలు మూడు విధములని గీతాచార్యుడు వక్కాణించి యున్నాడు, గమనింపుడు.)

నియమయుక్తమై, రాగద్వేష రహితముగా, ఫలాకాంక్షలేక లోక కల్యాణార్థము చేయు సత్కర్మ సాత్త్విక కార్యమనబడును.

భాగాభిలాషచే అహంకార యుక్తముగా చేయబడు కార్యము రాజస కర్మ అనబడును.

మంచిచెడ్డలను, హానివృద్ధులను, తన శక్తిని, పరహింసను, ఆలోచింపక అవివేకముతో ప్రారంభింపబడు కార్యము తామసకర్మ అనబడుచున్నది. (ఒక ప్రయగము, ఒక సత్యాన్వేషణ కొరకు జరుగు కార్యము, ఒక ప్రణాళిక అనబడునవి యజ్ఞము క్రిందికి వచ్చును. సామాన్యముగా జీవితమున, నిత్య జీవితమున, చేయుబడు కార్యములు కర్మలనబడును. ఈ విభాగమును గమనింపవలసినది. సంసారము అనునది యజ్ఞము; వివాహము అనునది యజ్ఞము; గృహ నిర్మాణము అనునది యజ్ఞము; సంతర్పణ అనునది యజ్ఞము; యుద్ధము, విద్యాభ్యాసము మొదలగు దీర్ఘ కార్యములు యజ్ఞములు. ఆహారము తినుట, స్నానము చేయుట, పత్రిక చదువుట, మొదలగు అనేకానేక దైనిక కార్యములు కర్మలనబడుచున్నవి. మానవుడు యజ్ఞమును నెరవేర్చుట యందును, సామాన్య కార్యములు సలుపుట యందును జాగరూకుడై క్రమశిక్షణాయుతుడై యుండవలసినదే).

18-26,27,28. కర్మలను జేయుటను బట్టి కర్త మూడు విధములని గీతాచార్యుడు చెప్పుచున్నాడు.

సంఘరహితుడును, అహంకార వర్జితుడును, ధైర్యోత్సాహ యుక్తుడును, ఫలితమున నిర్వికారుడును, అగు కర్త సాత్త్వికుడు అనబడుచున్నాడు.

రాజసయుక్తుడు, కర్మఫలాభిలాషి, లోభి, పరబాధకుడు, శౌచ రహితుడు, హర్షశోక సమన్వితుడు అగునట్టి కర్త రాజసికుడనబడు చున్నాడు.

చిత్తస్థైర్యము లేనివాడు, మూర్ఖుడు, కుటిలచిత్తుడు, అపకారి, అలసుడు, వెఱ్ఱియూహలు పన్నువాడు అగునట్టివాడు తామసికుడు అనబడుచున్నాడు.

18-30,31,32. కర్మాచరణమునందు కర్త బుద్ధికుశలత గలవాడునై యుండవలయును. కర్మస్వీకారము నందును, నిర్వహణము నందును, ఫలస్వీకార విషయమునను, కర్తయగువాడు కుశలత బుద్ధిని ప్రదర్శింపవలయును. ఇట్టి వాంఛనీయమయిన బుద్ధిని బట్టి, బుద్ధి మూడు విధములు.

ప్రవృత్తి నివృత్తులను, కార్యాకార్యములను, భయాభయములను, బంధమోక్షములను సరిగా గ్రహింపగలిగిన వానియొక్క బుద్ధి సాత్త్విక బుద్ధి అనబడుచున్నది.

ధర్మాధర్మములను, కార్యాకార్యములను విరుద్ధముగా గ్రహించు వానిబుద్ధి రాజసబుద్ధి అనబడును.

అధర్మమును ధర్మముగాను, సకల విషయములను విపరీతముగా చూచుకొని బుద్ధి తామసబుద్ధి అనబడును. (బుద్ధి అనగా ఆలోచన క్రమమని తెలియవలయును).

18-37, 38, 39. (సుఖము మూడు విధములని చెప్పబడినది).

ఆదిలో విషముగా నుండి, క్రమముగా అమృతతుల్యముగా తయారగు సుఖము సాత్త్విక సుఖమనబడును.

ఆదిలో అమృతతుల్యముగా నుండి, క్రమముగా విషమువలె హానికరముగా తయారగునది రాజస సుఖము.

మొదటను, కడపటను, చిత్త వ్యామోహజనకమై, కేవలము నిద్ర ఆలస్య ప్రమాదముల నుండి ఉత్పన్నమగు క్షణమాత్ర సుఖము తామస సుఖము.

18-42, 43, 44. శమము, దమము, తపస్సు, శౌచము, క్షమ, ఆర్జవము, జ్ఞానము, విజ్ఞానము, ఆస్తికము అను కర్మ కలాపము బ్రాహ్మణకర్మ అనబడుచున్నది. (ఇది కులమునకు సంబంధించినది గాదు. వృత్తి యొక్క జ్ఞానౌచిత్యమునకు, కార్యదక్షతకు సంబంధించిన విషయము.

శౌర్యము, తేజస్సు, ధైర్యము, దక్షత, పట్టుదల, దానము, ప్రాభవము, అను యీ గుణములకు సంబంధించినది క్షాత్రకర్మ (ఇది యేదో ఒక ప్రత్యేక కులమునకు సంబంధించినది కాదు. పూర్వము క్షత్రియులను ఒక్క జాతివారే యుద్ధవీరులుగా నుండగా నిప్పుడు సైన్యమున అన్ని కులములవారు ఉన్నారు కదా.)

కృషి, గోరక్షణ, వాణిజ్యము మొదలగునవి వైశ్య కర్మలు. (ఇవియును ఒక జాతికి సంబంధించినవి కావు.)

పరిచర్య శూద్రకర్మ అనబడుచున్నది. (ఇదియును కులమునకు సంబంధించినట్టిది కాదు. పరిచర్య, సేవ యనునవి యెల్లయెడలను సర్వకాలముల యందును అవసరమనియు, పరిచర్య విలువైన కర్మ అనియు, సంఘాభివృద్ధికి తోడ్పడుననియు, మానవుడు ఇతరులకు పరిచర్య చేయుటకు సంసిద్ధముగా నుండవలయుననియు, ఒక వైష్ణవుడు మరియొక సోదర వైష్ణవుని చూడగానే - అడియేన్ (నీకు నేను దాసుడను) అని పలుకరింప వలయుననియు యామునా చార్యులు, తరువాత రామానుజాచార్యుఉ యెంతయో నొక్కి వక్కాణించియున్నారు.)

18-48. పుట్టుకతో సంప్రాప్తమయిన కర్మ దోషయుక్త మయినను విడువబడరాదు. సకల కర్మలును, అగ్ని ధూమము చేతనుంబోలె,

దోషావృతములుగానే యున్నవి. (బహుశా యిచట ఈ కర్మ కుల వృత్తికి సంబంధించినదై యుండవలెను. పూర్వపు వర్ణాశ్రమ ధర్మబద్ధమయిన హిందూ సంఘమునకే యిది సంబంధించును. ఏ కర్మను చేసినను దానిని బాగుగా చేయుటలో ఔన్నత్యమున్నది. ఎవరిపని వారు చేయుటవలన సంఘము అభివృద్ధియగును. కులవృత్తి కాకున్నను ఇపుడు ఇది నీవు కోరి నిర్ణయించుకొని స్వీకరించిన వృత్తి కావచ్చును. కావున తన వృత్తిని బట్టి మానవుడు ఉన్నతుడాగా పరిగణింపబడడు. తాను తనవృత్తిని యెట్లునిర్వర్తించుచున్నాడు అనేది గణనీయాంశము).

(వృత్తిలోగాదు ఔన్నత్యముండునది. దానిని నిర్వహించు విధమున. ఒక ప్రభుత్యోగ విషయమే తీసికొందము. దానిని నైపుణ్యముగా చేయలేని స్థితి, కష్టించి పనిచేసి త్వరగా పూర్తిచేయని స్థితి, హృదయపూర్వకముగా చేయనిస్థితి, లంచము పుచ్చుకొని చేయ ప్రయత్నించు స్థితి, లంచము తీసికొనియు పనిజేయని స్థితి, మొదలగు లోపములు కొందరిలో కనబడుచున్నవి. ఇట్టి లోపములు లేకుండా కార్యమును జయప్రదము చేయువారును కొందరు లేకపోలేదు. కావున తాను తనకై ఒకసారి నిర్ణయించుకొని వృత్తిగా స్వీకరించిన కార్యమును సక్రమముగా నిర్వర్తించుటయే నైతికమార్గమని యిచ్చట గమనింప వలసియున్నది.)

గీతలో తెల్పబడిన యీ నైతకి మార్గము విశ్వములోని మానవులందరు పాటింపవలసినది. ప్రపంచములోని అనేక మత గ్రంధములలో సూచింపబడిన నీతిమార్గము ఇందుకు సామ్యము గలిగి యుండవచ్చును. కాని గీతయందు మానవుడు అనుసరింపదగు నైతిక మార్గము యెంత విశిష్టముగా, యెంత విపులముగా, శాస్త్రీయముగా చెప్పబడి యున్నదో గమనించి, ప్రశంసింపదగిన విషయము.

"విధి కధికంబు కర్మమని వేమరు మ్రొక్కి భజింతు కర్మమున్" అను భర్తృహరి సుభాషితము ననుసరించి, యీ నీతి మార్గమే సర్వులకు

శరణ్యము; వ్యక్తి ఆనందమునకు గాని, సంఘము యొక్క ఆనందమునకు గాని యీ మార్గము అనుసరణీయము.

18-66. ఇది గీతా చరమ శ్లోకము :

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపే భ్యో మోక్షయిష్యామి మా శుచః.

ఇది చరమ శ్లోకము గావున అత్యంత ముఖ్యమయినది. గీతా సందేశము అతి సంక్షిప్తముగా కడపటి మాటగా నిది యివ్వబడినది.

ఇంతవరకు గీత యందు చెప్పబడిన వివిధ విషయములతో గూడిన నైతిక మార్గమునకిది కడపటి మాట అగుచున్నది.

'నీకు అనేక నీతి మార్గములు చెప్పబడినవి. విధ్యుక్త ధర్మమును నెరవేర్చ వలసిన నీకు ఆ విధ్యుక్త ధర్మ నిర్వహణకు నీకు అనేక విధమయిన మంచి మంచి ధర్మములు, మార్గములు, నిర్వచనములు, వివరణములు చెప్పబడినవి. ఈ విషయములను యెంతవరకు గ్రహింపగలవో, యెంతవరకు జ్ఞప్తియందుంచుకొన గలవో, యెంత వరకు అనుసరింపగలదో కాని - యిదిగో కొంద గుర్తుగా నొక్క విషయము చెప్పుచున్నాను - గమనింపుము - పాటింపుము - సర్వంతర్యామి యగు దైవశక్తికి ప్రపన్నుడవగుము - అనగా నీవు స్వార్థ రహితుడవు కమ్ము. స్వార్థ రహితుడవై అనగా కర్మఫల త్యాగమున నీ జీవితమును గడవుము'. అని గీతా చరమ శ్లోకము జీవితోపాయమును వెల్లడించుచున్నది. ఇది కేవలము నీతిమార్గ సారాంశమే యగుచున్నది. 'నీవు స్వార్థ రహిత భావమున నున్నయెడల, నీవే పాపమును చేయ సంకల్పింపవు; నీవు పాపములకు దూరముగా నుందువు; నీకు ఎట్టి వ్యామోహములు బంధములు ఉండవు; బంధ విముక్తుడుగా నున్న నీవు మోక్ష భావమున ఆనందముగా నుండగలవు. ఈ చరమ మార్గమును నీవు పాటించిన, నీకు ఎట్టి చింతన అవసరములేదు; అనుమానము లేదు; భయమును లేదని అభయము

సూచింపబడినది. కావున గీతా చరమ శ్లోకము నైతిక మార్గమున కడపటి మాటగా గ్రహింప వలసియున్నది.

భగవద్గీత యొక్క చరమ శ్లోక దివ్యార్థము గీతయొక్క ఆది అంతిమ పదములయందు ఇమిడియున్నది. ఇది యొక ఆహ్లాద కరమైన విచిత్రము. భగవద్గీత "ధర్మ" అను పదముతో ప్రారంభ మయి, "మాశచః" అను పదముతో అంతమొందు చున్నది. "ధర్మ ..... మాశుచః" (ధర్మము=విధ్యుక్త ధర్మము. మాశుచః= శోకింపకుము). నీవు నీ విధ్యుక్త ధర్మమును సలక్షణముగా నెరవేర్చెదవేని, నీవు యిక చింతింపవలసిన అవసరము లేదు" అని భావము వచ్చుచున్నది. విధ్యుక్త ధర్మ నిర్వహణకే గీతయందు సంపూర్ణ ప్రాధాన్యము నొక్కి వక్కాణింపబడినది.

ధర్మ నిర్వహణ ఔచిత్యము స్వార్థ రాహిత్య భావమున నున్నది; కర్మఫల త్యాగమున నున్నది. ఈ విషయము విపులముగా పలుతావులందు చెప్పబడినది. స్వార్థపరత్వము వ్యక్తి యొక్కయు, సంఘము యొక్కయు సర్వ దుఃఖములకు, వినాశనమునకు, దుర్మార్గములకు మూలకారణము. అందువలననే కర్మఫల త్యాగము శ్రేష్ఠతమముగా చూపబడినది. ఈ విషయము గీత యందు చర్విత చర్వణముగా పలుతావుల యందు ప్రతి అధ్యాయమునందు పొందు పరుపబడియున్నది.

ఇది వాస్తవము - ఈ వాస్తవమును తెలిసికొనుము - ఈ వాస్తవమును పాటింపుము.

ఓం శాంతిః

T.T.D. Religious Publications Series No 634

Price : Rs 10/-

| పుస్తకం పేరు | రు. పై. |
|---|---|
| 1. ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - మొదటి భాగం డీలక్స్ ప్రతి | 300-00 |
| 2. ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - మొదటిభాగం సాధారణ ప్రతి | 200-00 |
| 3. ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - రెండవ భాగం డీలక్స్ ప్రతి | 300-00 |
| 4. ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - రెండవ భాగం సాధారణ ప్రతి | 200-00 |
| 5. ఆంధ్ర మహాభారతం - సభాపర్వం - డీలక్స్ ప్రతి | 250-00 |
| 6. ఆంధ్ర మహాభారతం - సభాపర్వం - సాధారణ ప్రతి | 175-00 |
| 7. ఆంధ్ర మహాభారతం అరణ్యపర్వం - మొదటి భాగం | 125-00 |
| 8. ఆంధ్ర మహాభారతం అరణ్యపర్వం - రెండవ భాగం | 150-00 |
| 9. ఆంధ్ర మహాభారతం - విరాటపర్వం | 160-00 |
| 10. అద్వైతాక్షరమాలిక | 75-00 |
| 11. అర్థవిజ్ఞాన సర్వస్వం - సంపుటం - I | 50-00 |
| 12. రామచరితమానసం | 40-00 |
| 13. శ్రీ వేంకటేశ్వర వైభవం | 40-00 |
| 14. హరికొలువు | 35-00 |
| 15. శ్రీమద్భాగవతం - రెండవ సంపుటం | 55-00 |
| 16. తిలక్ గీతారహస్యం - సంపుటం - 1 | 40-00 |
| 17. తిలక్ గీతారహస్యం - సంపుటం - 2 | 45-00 |
| 18. తిలక్ గీతారహస్యం - సంపుటం - 3 | 35-00 |
| 19. నారాయణీయం | 45-00 |
| 20. యోగసర్వస్వం | 40-00 |
| 21. రామాయణం - ఉపశ్రీ | 35-00 |
| 22. శ్రీమద్భాగవతం - ఉపశ్రీ | 20-00 |
| 23. భారతీయ సంస్కారాలు | 25-00 |
| 24. దేవాలయములు - తత్త్వవేత్తలు | 40-00 |
| 25. తిరుపతి చరిత్రము | 45-00 |

పుస్తకప్రతులకు, మిగతా వివరాలకు "పౌరసంబంధాధికారి, పుస్తక విక్రయ భాగం, తి.తి.దేవస్థానం ప్రెస్ కాంపౌండు, తిరుపతి - 517 507" వారిని సంప్రదించవలెను.

Published by Sri Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams and Printed at T.T.D. Press, Tirupati